ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
వరంగల్ : fb.com/vaartha Digital
Published from Warangal, Karimnagar, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
3-5-2026 ఆదివారం సంపుటి: 32 సంచిక: 92 పేజీలు: 8+16 వెల: 8.00

ఛత్తీస్‌గఢ్‌లో పేలిన పాతర
ముగ్గురు జవాన్లు మృతి
బెంగాల్‌లో రీపోలింగ్: 85 శాతం ఓటింగ్
2


అమెరికా మళ్లీ యుద్ధానికి రావొచ్చు..
మేం అన్నింటికీ సిద్ధమే: ఇరాన్

5

మమతకు బిగ్ షాక్

ఇసి సర్క్యులర్‌కు సుప్రీం కోర్టు గ్రీన్ సిగ్నల్
5


కులం పేరుతో విభజన వద్దు
కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ సంచలన వ్యాఖ్యలు
5

# ఉద్యోగులకు 6వేల కోట్లు

వంద రోజుల్లో రిటైర్మెంట్ ప్రయోజనాలు
జూన్ 1లోగా ఆరోగ్య భద్రత కార్డులు
పిఆర్సీ నివేదిక వెంటనే ఇవ్వాలని ఆదేశాలు


శనివారం ఉద్యోగ సంఘాలతో భేటీలో సిఎం రేవంత్

## సమస్యలపై 2 నెలలకోసారి సమావేశం
ప్రభుత్వ ఉద్యోగులకు 4 కీలక హామీలు ఇచ్చిన సిఎం రేవంత్‌రెడ్డి
5న జరిగే ఆందోళన విరమించిన ఉపాధ్యాయ సంఘాలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే2:** తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి కీలమైన శుభవార్తలు చెప్పారు. వారి దీర్ఘకాలిక డిమాండ్లపై సానుకూలంగా స్పందించారు. పే రివిజన్ కమిషన్ నివేదికను తక్షణమే అందించాలని అధికారుల కమిటీని ఆదేశించామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి వెల్లడించారు. నివేదిక ఆధారంగా పీఆర్సీపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. వచ్చే వంద రోజుల్లో ఉద్యోగుల రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం రూ.6వేలకోట్లు చెల్లించనున్నట్టు తెలిపారు. ఈ నిధుల ఖర్చు ప్రాధాన్యతలను నిర్ణయించాల్సిన బాధ్యత ఉద్యోగ సంఘాలపై ఉందని అన్నారు. తెలంగాణ ఉద్యోగ సంఘాల సంయుక్త కార్యాచరణ కమిటీ (జెఏసీ), తెలంగాణ ఎంప్లాయీస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ నాయకులు శనివారం సాయంత్రం ముఖ్యమంత్రితో సమావేశమయ్యారు. ఇందులో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో పాటు ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డితో పాటు ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 4 కీలకమైన అంశాలపై ముఖ్యమంత్రి ఉద్యోగ సంఘాలకు స్పష్టతనిచ్చారు. ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. వంద రోజుల్లో పదవీ విరమణ చేసిన ఉద్యోగుల బెనిఫిట్స్ కోసం రూ. 6 వేల కోట్లు చెల్లించడంతో పాటు పీఆర్సీపై నివేదిక అందగానే నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘాలు ప్రతి రెండు నెలలకు ఒకసారి సమావేశమై సమస్యలపై ప్రభుత్వానికి నివేదిక అందించాలని, ఇది స్నేహపూర్వకమైన ప్రభుత్వమని, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించే బాధ్యత ప్రభుత్వానిదని ముఖ్యమంత్రి చెప్పారు. ఉద్యోగ సంఘాల ప్రతినిధులు ప్రస్తావించిన డిమాండ్లపై ముఖ్యమంత్రి స్పందిస్తూ, >>2

## ప్రభుత్వానికి కళ్లు, చెవులు విప్‌లే

ధాన్యం సేకరణ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సిఎం ఆదేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే2:** ప్రభుత్వానికి కళ్లు, చెవులు విప్‌లే అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం మర్రి చెన్నారెడ్డి హెచ్ఆర్‌డిలో శాసన సభ, శాసనమండలి విప్‌లతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమావేశమయ్యారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలను విప్‌లు సీఎం దృష్టికి తీసుకెళ్లారు.వేసవి నేపథ్యంలో నియోజకవర్గాల్లో తాగునీరు, సాగునీటి అవసరాలకు >>2


శనివారం హైదరాబాద్‌లో చెరువుల పునరుద్ధరణపై ఉన్నతాధికారులతో సమీక్ష చేస్తున్న సాగునీటి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

## తెలంగాణలో చెరువుల పునరుద్ధరణ కమిటీలు
అధికారులు, ఇంజనీర్లతో మంత్రి ఉత్తమ్ సమీక్ష
చెరువుల్లో పూడికతీతకు ప్రాధాన్యం


**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే2:** తెలంగాణ వ్యాప్తంగా చెరువుల పునరుద్ధరణపై ప్రభుత్వం దృష్టిపెట్టింది. రాష్ట్రంలో చెరువులకు కమిటీలు వేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు చెరువుల వారీగా కమిటీలు వేయాలని జిల్లా యంత్రాంగానికి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు. రైతులు, స్థానిక అధికారులు, స్టేట్ హోల్డర్స్‌తో కమిటీలు వేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా చెరువుల పునరుద్ధరణపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టిసారించింది. నీటిపారుదల శాఖ అధికారులు, ఇంజనీర్లతో ఆ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి శనివారం సమీక్ష నిర్వహించారు. నిర్దిష్ట కాలపరిమితితో చెరువుల పునరుద్ధరణ జరగాలని సూచించారు. ఈ వేసవిలో చెరువుల పూడికతీతను అత్యవసర ప్రాధాన్యతగా ప్రకటించిన మంత్రి,అన్ని చెరువుల్లో పనులు తక్షణమే ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. చెరువుల పరిస్థితి, అభివృద్ధిపై రైతు కమిషన్ నివేదికపై మంత్రి ఉత్తమ్ ప్రశంసలు కురిపించారు. కమిషన్ ప్రతిపాదనలను సీఎం దృష్టికి తీసుకువెళ్తామని ఆదేశించారు.



## భారీగా పెరిగిన యుపిఐ లావాదేవీలు
రూ.314 లక్షల కోట్లకు చేరిక
ప్రపంచంలో అతి పెద్ద చెల్లింపుల వేదికగా భారత్
కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడి

**హైదరాబాద్, మే 2, ప్రభాతవార్త:** నేషనల్‌పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పిసిఐ) అభివృద్ధి చేసిన యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యుపీఐ) 10 ఘనమైన సంవత్సరాలను పూర్తి చేసుకుంది. ఈ కాలంలో ప్రపంచంలోనే అతిపెద్ద రియల్‌టైమ్ చెల్లింపుల వేదికగా రూపుదిద్దుకుంది. ఈ మేరకు దీనికి సంబంధించి కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ విడుదల చేసిన వివరాలు ప్రకారం రిజర్వ్ బ్యాంక్ నియంత్రణ పర్యవేక్షణలో నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ద్వారా 11 ఏప్రిల్ 2016న ప్రారంభించబడిన యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ దేశ డిజిటల్ చెల్లింపుల వ్యవస్థకు వెన్నెముకగా, ఆర్థిక సమ్మిళితానికి కీలక చోదకంగా ఆవిర్భవించింది. దశాబ్దానికి పైగా కార్యకలాపాలలో, యూపీఐ అసాధారణమైన స్థాయిని ప్రదర్శించింది. వార్షిక లావాదేవీలు చూస్తే 2016-17 ఆర్థిక సంవత్సరంలో కేవలం 2 కోట్ల నుండి 2025-26లో అది 24,162 కోట్లకు పైగా లావాదేవీలకు విస్తరించింది. ఇది లావాదేవీల పరిమాణంలో దాదాపు 12 వేల రెట్ల పెరుగుదలను సూచిస్తుంది. రోజువారీ సగటు లావాదేవీలను చూస్తే 66 కోట్ల మేర జరిగినట్లు రికార్డులు వెల్లడించాయి. అదే సమయంలో, లావాదేవీల విలువ 2016-17 లో రూ.0.07 లక్షల కోట్ల నుండి 2025-26లో సుమారుగా రూ.314 లక్షల కోట్లకు గణనీయంగా పెరిగింది. ఇది లావాదేవీల విలువలో 4 వేల రెట్లకు పైగా పెరుగుదలకు దారితీసింది. ఇక యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ వృద్ధి పథంలో 2025 సంవత్సరం ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది. 2025 ఆగస్టులో నెలవారీ లావాదేవీల పరిమాణం తొలిసారిగా 2,000 కోట్ల లావాదేవీలను దాటి, 2,001 కోట్ల లావాదేవీలకు చేరుకుంది. ఈ ఊపు సంవత్సరం మిగిలిన కాలమంతా కొనసాగింది. డిసెంబర్ 2025లో 2,163 >>2

## రేపు రాష్ట్ర కేబినెట్ భేటీ
తుమ్మడిహెట్టి, ఉద్యోగుల పెండింగ్ బిల్లులపై చర్చ



## ముందస్తు వానలు
14-16 మధ్య అండమాన్‌కు రుతుపవనాల ఎంట్రీ
వాతావరణ అధికారుల వెల్లడి

**న్యూఢిల్లీ, మే 2:** దేశవ్యాప్తంగా ఎండలు మండిపోతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు రికార్డుస్థాయిలో నమోదవుతున్నాయి. మరోవైపు వడగాడ్పులు తీవ్రత పెరిగింది. మండుటెండల వేళ భారత వాతావరణ శాఖ అధికారులు చల్లని కబురు అందించారు. దేశవ్యాప్తంగా నెలకొన్న వడగాలుల పరిస్థితుల నుంచి త్వరలో ఉపశమనం లభించే అవకాశం ఉంది. నైరుతి రుతుపవనాలు ఈసారి సాధారణానికి ముందుగానే దేశాన్ని తాకే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండి) తెలిపింది. ఈ నెల 14 నుంచి 16 తేదీల మధ్య ఇవి అండమాన్ నికోబార్ దీవులకు చేరుకునే అవకాశముందని పేర్కొంది. ఇది సాధారణంగా వచ్చే సమయంతో పోలిస్తే కొంత ముందుగానే కావడం గమనార్హమని తెలిపింది. దీని ప్రభావంతో మే నెలలో దేశవ్యాప్తంగా సగటు వర్షపాతం సాధారణం కంటే ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలు, అలాగే పశ్చిమ భారతంలో అధిక వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయని >>2

## విద్యార్థులకు వరం 'యంగ్ ఇండియా'
ఒకే ప్రాంగణంలో విద్యతోపాటు వసతి, పోషకాహారం, క్రీడలు
వెనుకబడిన వర్గాలకు నాణ్యమైన విద్య
పారదర్శకంగా మొక్కజొన్న, ధాన్యం కొనుగోళ్లు: మంత్రి పొంగులేటి

**దుమ్ముగూడెం ప్రభాతవార్త:** రెవెన్యూ గృహ నిర్మాణ సమా చార, పౌర సంబంధాల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శనివారం భద్రాచలం నియోజకవర్గంలోని దుమ్ముగూడెం మండలంలో పర్యటించి పలుఅభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి ఫలాలు ప్రతి కుటుంబానికి చేరేలాప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని ఈ సందర్భంగా మంత్రి స్పష్టం చేశారు. తొలుత దుమ్ముగూడెం మండలం చిన్న బండిరేవు గ్రామంలో 200 కోట్ల రూపాయలతో నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల భవన నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ గిరిజన ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన సమగ్ర విద్యను అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సాధిస్తుందని ఆయన అన్నారు. యంగ్ ఇండియా పథకం కింద నిర్మించనున్న ఈ రెసిడెన్షియల్ పాఠశాల ద్వారా విద్యార్థులకు విద్యతో పాటు వసతి పోషకాహారం క్రీడలు నైపుణ్యాభివృద్ధి వంటి అన్ని సౌకర్యాలు ఒకే ప్రాంగణంలో అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఆధునిక తరగతి గదులు సైన్స్ మరియు కంప్యూటర్ ల్యాబ్‌లు గ్రంథాలయం క్రీడా మైదానాలు హాస్టల్ వసతులతో ఈ విద్యాసంస్థ నిర్మించబడుతుందని తెలిపారు. ఈ పాఠశాల నిర్మాణం పూర్తయిన అనంతరం స్థానికంగా వెనుకబడిన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులోకి వచ్చి వారి >>2


దుమ్ముగూడెం మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి పొంగులేటి

## కాంగ్రెస్‌కు ఇక ఓటు పడదు
'సర్'లో కాంగ్రెస్, బిజెపిల అక్రమాలకు అడ్డుకట్ట వేయాలి: కెటిఆర్


శనివారం రంగారెడ్డి నేతలతో కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే2:** రాష్ట్రంలో రెండున్నర సంవత్సరాల కాంగ్రెస్ పాలన చూసిన తర్వాత ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ కాంగ్రెస్‌కు ఓటు వేసే అవకాశమే లేదని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ కనీసం 20 సంవత్సరాల పాటు అధికారంలోకి రావడం కల్లని పేర్కొన్నారు. శనివారం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పార్టీ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నేతలతో సుదీర్ఘ సమీక్షను నంది నగర్‌లోని తన నివాసంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రస్తుత రాజకీయ పరిణామాలతో పాటు పార్టీని బలోపేతం చేసే దిశగా చేపట్టాల్సిన కార్యాచరణ పై దిశా నిర్దేశం చేశారు. అడ్డగోలుగా హామీలు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ సబ్బండ వర్గాలను మోసం చేసిందని, దీనికి తోడు కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అవినీతి అరాచకాలు, కుంభకోణాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. అన్ని అంశాల్లోనూ కాంగ్రెస్ పార్టీ కమీషన్లు, కాసుల కక్కుర్తి కోసమే చూస్తున్నదని దుయ్యబట్టారు. రంగారెడ్డి జిల్లాలో భూములతో పాటు అనేక మైనింగ్ కుంభకోణాలకు కూడా కాంగ్రెస్ పార్టీ మంత్రులే స్వయంగా పాల్పడుతున్న పరిస్థితి నెలకొన్నదన్నారు. మరోవైపు బీజేపీ కేంద్రంలో అనేక ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటున్నదని ఆరోపించారు.వేయిరూపాయలకు పైగా పెంచిన గ్యాస్ సిలిండర్ >>2

# నేడే నీట్ పరీక్ష
అరగంట ముందే గేట్లు మూసివేత
దేశ వ్యాప్తంగా 22,79,743 మంది దరఖాస్తు
తెలంగాణలో 199 పరీక్షా కేంద్రాలు
మధ్యాహ్నం 2 గం నుంచి 5 వరకు పరీక్ష



**హైదరాబాద్, ప్రభాతవార్త, మే 2:** దేశంలోని ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో ఎంబీబీఎస్, బీడీఎస్‌తోపాటు ఇతర మెడికల్ కోర్సుల్లో అడ్మిషన్ల కోసం జాతీయ స్థాయిలో నిర్వహించే నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్(నీట్)- యుజీ-2026 పరీక్ష నేడు(ఆదివారం) దేశ వ్యాప్తంగా జరగనుంది. ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షను నిర్వహించనున్నారు. పరీక్షా కేంద్రాలను పరీక్షకు అరగంట ముందుగానే మూసివేస్తారు. ఆలోపుగానే అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు చేరకోవాల్సి ఉంటుంది.పరీక్షను దేశ వ్యాప్తంగా 552 నగరాల్లో నిర్వహించనున్నారు. నీట్ పరీక్షను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టిఏ) నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. నీట్ యుజీ- 2026 పరీక్ష కోసం 22,79,743మంది అభ్యర్థులుదరఖాస్తు చేసుకున్నారు. వారిలో 13,32,928 మంది మహిళా అభ్యర్థులు ఉండగా 9,46,815 మంది పురుష అభ్యర్థులు >>2



## ప్రసార భారతి చైర్మన్‌గా ప్రసూన్‌జోషి

**ముంబయి, మే 2:** ప్రముఖ గీత రచయిత, సాహిత్యాకారుడు, కమ్యూనికేషన్స్ నిపుణుడు ప్రసూన్ జోషి భారత ప్రభుత్వ ప్రసార సంస్థ అయిన ప్రసార భారతికి చైర్మన్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ శనివారం ఒక అధికారిక ప్రకటన విడుదల >>2


శనివారం లోక్‌భవన్‌లో గవర్నర్ శివప్రతాప్ శుక్లాతో భేటీ అయిన డిజిపి సివి ఆనంద్

## గవర్నర్‌ను కలిసిన డిజిపి సివి ఆనంద్

**హైదరాబాద్, మే 2, ప్రభాతవార్త:** రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లాను డిజిపి సి.వి ఆనంద్ శనివారం నాడు లోక్ భవన్‌లో కలిశారు. డిజిపిగా బాధ్యతలు చేబట్టిన తరువాత ఆనంద్ గవర్నర్‌ను కలవడం ఇదే తొలిసారి. ఈ సందర్భంగా గవర్నర్ శుక్లాతో రాష్ట్రంలో శాంతి భద్రతల పరిర క్షణకు పోలీసు శాఖ చేబడుతున్న చర్యలను డిజిపి వివరించారు. కాగా డిజిపిగా బాధ్యతలు చేబట్టిన ఆనంద్‌కు గవర్నర్ శుక్లా శుభాకాంక్షలు తె లిపారు.

డిప్యూటీ సిఎం బట్టి విక్రమార్కను కలిసిన డిజిపి ఆనంద్

ఇదిలావుండగా డిజిపి ఆనంద్ డిప్యూటీ సిఎం బట్టి విక్రమార్కను సచివాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. డిజిపిగా బాధ్యతలు చేబ ట్టిన తరువాత డిప్యూటీ సిఎం బట్టి విక్రమార్కను డిజిపి కలవడం ఇదే తొలిసారి. ఈ సందర్భంగా డిప్యూటీ సిఎంకు డిజిపి పుష్ప గుచ్ఛం అం దించారు.

## ముందస్తు వానలు

>> వెల్లడించింది.మరోవైపు ఈశాన్య రాష్ట్రాలు, తూర్పుమధ్య భారతంలోని కొన్ని ప్రాంతాల్లో మాత్రం సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. ఇక ఉష్ణోగ్రతల విషయానికి వస్తే, ఈసారి మే నెలలో పగటి వేడి మాత్రమే కాకుండా రాత్రిసమయంలో కూడా అధిక ఉష్ణోగ్రతలు కొనసాగుతాయని ఐఎండి పేర్కొంది. అయితే దక్షి ణ ద్వీపకల్పంలోని కొన్ని ప్రాంతాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయిలో లేదా అంతకంటే తక్కువగా నమోద య్యే అవకాశం ఉందని వివరించింది. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాల్లో సముద్రం నుంచి వచ్చే తేమతో కూడిన వేడి గాలుల కారణంగా ఉక్కపోత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది.

## ప్రసార భారతి ఛైర్మన్‌గా ప్రసూన్‌జోషి

>> చేసింది. జోషి.. సాహిత్యం, ప్రకటనలు, సినిమా, ప్రజా సమాచార రంగాల్లో విస్తృతమైన కృషి చేశారని కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఆ ప్రకటనలో కొనియాడింది. ప్రభావవంతమైన రచనలు, లోతైన సాంస్కృతిక అవగాహనకు పేరుగాంచిన విశిష్ట సృజనాత్మక నిపుణుడైన జోషి..సమకాలీన భారతీయ మీడియా కథనాలను తీర్చిదిద్దడంలో గణనీయమైన పాత్ర పోషించారని కేంద్రం తన ప్రకటనలో పేర్కొన్నది. జోషి చేసిన కలం నుంచి జాలువారిన ఎన్నో సినీ గీతాలు ప్రశంసలు అందుకున్నాయని తెలిపింది. జోషి రచనల్లో దేశవ్యాప్తంగా విభిన్న ప్రేక్షకులతో మమేకమయ్యే సామాజిక స్పృహతో కూడిన కథనాలు ఉన్నాయని పేర్కొన్నది.

## కాంగ్రెస్‌కు ఇక ఓటు పడదు

>> ధరనే ఒక ఉదాహరణ అని కేటీఆర్ వెల్లడించారు. అడ్డగోలుగా గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచుకుంటూ వస్తున్న బీజేపీ నిర్వాకం వలన ప్రజలపై నిత్యావసర సరుకుల భారం పెరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. పెంచిన సిలిండర్ ధర పెరుగుదలకు వ్యతిరేకంగా ప్రజలను జాగృతం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే పెంచిన సిలిండర్ ధరను వెనక్కి తీసుకొని ప్రజలకు ఉపశమనం కలిగించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో త్వరలో జరగనున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (శీ.ఖ) కార్యక్రమంలో బీఆర్ఎస్ చురుకైన పాత్ర పోషించి కాంగ్రెస్, బీజేపీ పార్టీలు చేసే అక్రమాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. ప్రతి ఒక్క యువకుడికి, యువతీ యువకులకు ఓటు హక్కు కల్పించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ దొంగ ఓట్లు నమోదు చేయకుండా చూడాలని సూచించారు. కాంగ్రెస్, బీజేపీలు అధికారాన్ని అడ్డం పెట్టుకొని అడ్డగోలుగా ఓట్లు తొలగించే ప్రమాదం ఉన్నదని, ప్రజల ఓటు హక్కుకు బాధ్యతగా భరోసాగా నిలవాల్సిన అవసరం ఉన్నదని ఎమ్మెల్యేలకు, ప్రజా ప్రతినిధులకు, నాయకులకు కేటీఆర్ సూచించారు.

త్వరలో మున్సిపల్ కార్పొరేషన్‌లకు ఎన్నికలు జరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో ఆ ఎన్నికలకు సమయత్తం కావాలన్నారు. పంచాయతీరాజ్ మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ మంచి విజయాలు నమోదు చేసిన నేపథ్యంలో పార్టీ నేతలకు కేటీఆర్ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ సమావేశంలో మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, మల్లారెడ్డితో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ సీనియర్ నేతలు పాల్గొన్నారు.

## డిజిపిని కలిసిన కోదండరామ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే2:** ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం డీజీపీ సీవీ ఆనంద్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఉద్యమం నాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. డీజీపీగా బాధ్యతలు చేపట్టిన సీవీ ఆనంద్‌కు వీహెచ్ శుభాకాంక్షలు తెలిపారు.


శనివారం న్యూఢిల్లీలోని వజీర్‌పూర్ పారిశ్రామిక ప్రాంతంలో ఆక్రమణలను కూల్చివేసిన ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది

## నేడే నీట్ పరీక్ష

>> ఉన్నారు. దరఖాస్తుదారులలో మహిళలు 58 శాతంగా ఉన్నారు. పరీక్షను మొత్తం 13 భాషల్లో నిర్వహించనున్నారు. తెలుగు, ఇంగ్లీష్, హిందీ, అస్సామీ, బెంగాలీ, గుజరాతీ, కన్నడ, మలయాళం, మరాఠీ, ఒడియా, పంజాబీ, తమిళంతోపాటు ఉర్దూ భాషల్లో పరీక్షను నిర్వహించనున్నారు. నీట్ యుజీ-2026లో బయోమెట్రిక్ మినహాయింపుకు సంబంధించి .. పరీక్ష రోజున అభ్యర్థిని తనిఖీ చేసిన తర్వాత, ప్రతి అభ్యర్థి పరీక్ష గదిలోకి ప్రవేశించే ముందు తప్పనిసరి బయోమెట్రిక్ తీసుకోవాల్సి ఉంటుంది. బయోమెట్రిక్ తీసే క్రమంలో పరికరంలో హార్డ్‌వేర్ వైఫల్యం, బయోమెట్రిక్ డేటా నాణ్యత తక్కువగా ఉండటం, నెట్ వర్క్ కనెక్టివిటీ వైఫల్యం, బయోమెట్రిక్ డేటా ధృవీకరణ పూర్తి కాకపోయినా, అభ్యర్థిని పరీక్షా గదిలోకి ప్రవేశించడానికి అనుమతించాలని ఎన్‌టీఏ ప్రకటించింది. దీనికోసం అభ్యర్థి లిఖితపూర్వక హామీ పత్రాన్ని సమర్పించాల్సి ఉంటుందని.. ఆ హామీ పత్రం నమూనా పరీక్షా కేంద్రంలో అందించబడుతుందని ఎన్‌టీఏ ప్రకటించింది.

**తెలంగాణలో 199 కేంద్రాలు**

ఆదివారం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ నిర్వహించనున్న టెట్ పరీక్షకు రాష్ట్రంలోని ఆదిలాబాద్, ఆసిఫాబాద్, భూపాలపల్లి, గద్వాల, జగిత్యాల, జనగామ, కొత్తగూడెం, మహబూబాబాద్, మంచిర్యాల, మెదక్, మేడ్చల్, నల్గొండ, నిజామాబాద్, సిద్దిపేట, సూర్యాపేట, వికారాబాద్, హైదరాబాద్, సికింద్రాబాద్, కరీంనగర్, ఖమ్మం, రంగారెడ్డి, వరంగల్, సంగారెడ్డి, మహబూబ్ నగర్‌తో కలిపి 24 పట్టణాల్లోని 199 కేంద్రాల్లో నీట్ నిర్వహించనున్నారు. ఒక్క హైదరాబాద్‌లోనే 69 పరీక్ష కేంద్రాలున్నట్లు ఎన్‌టిఏ వర్గాలు పేర్కొన్నాయి. తెలంగాణలో సుమారు 73,084 మంది విద్యార్థులు పరీక్ష రాయనుండగా.. హైదరాబాద్ నుంచి 28,697 మంది విద్యార్థులు హాజరు కానున్నట్టు తెలిసింది. నీట్ యూజీ-2026 ప్రవేశ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు తప్పకుండా డ్రెస్ కోడ్ పాటించాలని ఎన్‌టిఏ స్పష్టం చేసింది. పరీక్ష ప్రారంభానికి మూడు గంటల ముందు నుంచే పరీక్షా కేంద్రం గేట్లు తెరుస్తారు. అభ్యర్థుల గుర్తింపునకు బయోమెట్రిక్, ఫేస్ అథెంటికేషన్, వీడియోగ్రఫీ వంటి చర్యలు చేపడతారు. మధ్యాహ్నం 1.30 గంటల తర్వాత అభ్యర్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతించరు.

### వారం - వర్జ్యం

03-05-2026, ఆదివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
వైశాఖమాసం, ఉత్తరాయణం
వసంత ఋతువు, కృష్ణపక్షం, కృత్తిక కార్తె
విదియ రా.3.02
విశాఖ ఉ.7.10
వర్జ్యం : ఉ.11.38 -మ.1.25
దు.సా.4.40 - సా.5.31
శుభసమయం:ఉ.8.30-9.30
రాహుకాలం సా.4.30-6.00

### వార్తాఫలం

**మేషం:** శ్రమకు తగిన ఫలితం దక్కుతుంది. కుటుంబ పురోభివృద్ధి సాంకేతిక విద్యావకాశాలు పొందుతారు.

**వృషభం:** మిత్రులతో ఏర్పడిన విభేదాలు పరిష్కార మవుతాయి. దూర ప్రాంతాల నుండి కీలక సమాచారం అందుకుంటారు.

**మిథునం:** కొత్త కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. ఏ పనిని చేపట్టిన విజయవంతంగా పూర్తి చేస్తారు. వస్త్రలాభం.

**కర్కాటకం :** సహచరుల యొక్క అనుచర గణముల యొక్క కార్యకలాపములను గమనించుట జాగ్రత్త వహించుట మంచిది.

**సింహం:** గుడ్డిగా ఎదుటి వారి మాటలు నమ్మటం వలన మోసపోయే అవకాశాలు ఉన్నాయి.జాగ్రత్త. కోపాన్ని అదుపులో ఉంచుకోండి.

**కన్య :** దైవ కార్యక్రమాలలో, శుభకార్యాలలో చురుకుగా పాల్గొంటారు. స్పెక్యులేషన్‌కు దూరంగా ఉండండి. వాహన సౌలభ్యం.

**తుల :** వృత్తి, ఉద్యోగాలలో మీరు చేసే స్వయం కృతాపరాధముల వలన నష్టపోతారు. సేవాకార్యక్రమాలలో పాల్గొంటారు.

**వృశ్చికం:** దీర్ఘాలోచనలు చేయక పరిష్కారం లేని సమస్యలు కాలానికి వదిలి వేయండి. క్రయ విక్రయాలలో ప్రోత్సాహం.

**ధనుస్సు:** మీకు మిశ్రమ ఫలితాలు గోచరిస్తున్నాయి. ఆరోగ్య విషయంలో శ్రద్ధను వహించవలసి వస్తుంది.కొత్త పరిచయాలు.

**మకరం:** ప్రభుత్వం నుండి అందవలసి నటువంటి సహాయ సహకారాలలో జాప్యం చోటు చేసుకుంటుంది. బంధువుల కలయిక.

**కుంభం:** ప్రతి పని ఒక అడుగు ముందు నాలుగు అడుగులు వెనుకగా సాగుతుంది. విందు, వినోదాలలో పాల్గొంటారు.

**మీనం :** మీ ఆలోచనలు కార్యరూపం అయితే పురోభివృద్ధి మాత్రం నామ మాత్రంగా ఉంటుంది. వస్త్ర లాభం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# రేపు రాష్ట్ర కేబినెట్ భేటీ

## తుమ్మిడిహెట్టి, ఉద్యోగుల పెండింగ్ బిల్లులపై చర్చ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే2:** తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో సోమవారం(ఈ నెల 4వ తేదీన) మధ్యాహ్నం 3 గంటలకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధ్యక్షతన కేబినెట్ సమావేశం జరగనుంది. తుమ్మిడిహెట్టి బ్యారేజీపై కేబినెట్ చర్చించనున్నట్లు తెలుస్తోంది. ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టులో భాగంగా తుమ్మిడిహెట్టి వద్ద 150 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మించి శ్రీపాద ఎల్లంపల్లికి నీటిని తరలించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల నిర్వహించిన సమావేశంలో నిర్ణయించారు.తుమ్మిడిహెట్టి నుంచి ఎల్లంపల్లికి నీటిని తరలించేందుకు 4 మార్గాలు ప్రతిపాదనలో ఉన్నాయి. వీటిపై కేబినెట్ చర్చించి, నిర్ణయం తీసుకొనే అవకాశం ఉంది. ఉద్యోగులు, ఫించనర్ల సమస్యలు, డిమాండ్లపై మంత్రి మండలి చర్చించనున్నట్లుగా తెలుస్తోంది. ఉద్యోగులు, పింఛనర్ల పెండింగ్ బిల్లులు 100 రోజుల్లో క్లియర్ చేయాలని భావిస్తున్న ప్రభుత్వం, అందుకు సంబంధించిన కార్యాచరణపై కేబినెట్ భేటీలో నిర్ణయం తీసుకోనుంది. పెండింగ్ డీఏలు, ప్రభుత్వం నగదు రహిత చికిత్సలపై మంత్రివర్గ సమావేశంలో చర్చించే అవకాశం ఉంది. ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగుల విలీనం, కొత్త ఆసరా ఫించన్లు, తెలంగాణ ఉద్యమకారుల కోసం కార్యక్రమాలు, ఇందిరమ్మ బీమా పథకం తదితర అంశాలపై కూడా నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందని సమాచారం. కాగా, ఇటీవల జరిగిన సమావేశంలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాలకు నామినేట్ పద్ధతిన పాలక వర్గాలను నియమించేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. గచ్చిబౌలి స్టేడియాన్ని పీపీపీ పద్ధతిలో అభివృద్ధి చేయాలని కేబినెట్ నిర్ణయించింది. అదే విధంగా ఉద్యోగులకు సంబంధించిన రిటైర్మెంట్ బెనిఫిట్స్ సహా పలు కీలక అంశాలపై ఇటీవల జరిగిన కేబినెట్ భేటీలో నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే.

## విద్యార్థులకు వరం 'యంగ్ ఇండియా'

>> భవిష్యత్తుకు బలమైన పునాది ఏర్పడుతుందని తెలిపారు. మండలంలోని చింతగుప్ప గ్రామం నుండి బురదమడుగు వరకు బీటీ రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు సుజ్ఞానపురం గ్రామం వద్ద ఇందిరమ్మ ఇంటికి గృహప్రవేశం చేశారుములకపాడు గ్రామంలోని ఐటీడీఏ భద్రాచలం ఆధ్వర్యంలో నిర్మించిన మినీ స్టేడియంలో 400 మీటర్ల అథ్లెటిక్ ట్రాక్‌తో కూడిన మినీ ఇండోర్ స్టేడియం ను మంత్రి ప్రారంభోత్సవం చేశారు. గ్రామీణ యువతలో క్రీడా చైతన్యాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం క్రీడా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మినీ ఇండోర్ స్టేడియంలో కల్పించిన సదుపాయాలను జిల్లా కలెక్టర్ అంకిత్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన బ్యాడ్మింటన్ కోర్టులో మంత్రి, కలెక్టర్ ఎస్పీ స్థానిక శాసనసభ్యుడు వెంకటరావుతో కలిసి షటిల్ ఆడి క్రీడాకారులను ప్రోత్సహించారు. దబ్బనూతల క్రికెట్ లీగ్ పోటీలను ఆయన ప్రారంభించారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు అభివృద్ధి ఫలాలు చేరేలా ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా పేదలకు గృహ సౌకర్యాలు కల్పిస్తూ వారి జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తున్నామని మొదటి విడత విజయవంతంగా పూర్తయిందని రెండో విడతను త్వరలో ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. రైతుల సంక్షేమంపై మాట్లాడుతూ ధాన్యం మరియు మొక్కజొన్న కొనుగోళ్లను పారదర్శకంగా నిర్వహిస్తూ వారం రోజుల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని తెలిపారు రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం గ్రామీణాభివృద్ధిని సమగ్రంగా ముందుకు తీసుకెళ్లే దిశగా రహదారులు విద్య, ఆరోగ్యం, క్రీడా రంగాలకు సమాన ప్రాధాన్యతనిస్తూ చర్యలు తీసుకుంటోందని మంత్రి స్పష్టం చేశారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను దశల వారీగా అందిస్తూ సమగ్ర అభివృద్ధి సాధనలో ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ దుమ్ముగూడెం మండలంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు స్థానిక ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా నిలుస్తాయని తెలిపారు. యంగ్ ఇండియా పాఠశాల రహదారి, క్రీడా వసతుల అభివృద్ధి ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో విద్య, రవాణా, క్రీడా రంగాల్లో పురోగతి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణానికి స్థానిక తహసిల్దార్ మామిడి అశోక్ కుమార్ భూసేకరణలో ప్రత్యేక చొరవ తీసుకొని కృషి చేశారని తహసిల్దార్ మామిడి అశోక్ కుమార్ ను కొనియాడారు.

## భారీగా పెరిగిన యుపిఐ లావాదేవీలు

>> కోట్ల లావాదేవీలు నమోదయ్యాయి, ఇది యుపీఐ దశాబ్ద కాల ప్రయాణంలో అత్యధిక నెలవారీ లావాదేవీల పరిమాణం. 2025 క్యాలెండర్ సంవత్సర కాలంలో, యూపీఐ మొత్తం మీద సుమారు 22 వేల కోట్ల లావాదేవీలను ప్రాసెస్ చేసింది, ఇది రోజుకు సగటున దాదాపు 60 కోట్ల లావాదేవీలకు సమానం. ఈ నేపథ్యంలో దేశ డిజిటల్ చెల్లింపుల్లో యూపీఐ వాటా 85 శాతంగా నమోదైంది. ఈ నిరంతర అధిక వినియోగం దేశవ్యాప్తంగా డిజిటల్ చెల్లింపుల విస్తృత వ్యాప్తిని, దేశ డిజిటల్ చెల్లింపుల వ్యవస్థపై పౌరులు, వ్యాపారులు, వ్యాపార సంస్థలలో పెరుగుతున్న నమ్మకాన్ని ప్రతిబింబిస్తుందని ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది.


బెంగాల్ దక్షి ణ 24 పరగణాల జిల్లాలోని ఫాల్తా ప్రాంతంలో శనివారం రీపోలింగ్ సందర్భంగా టిఎంసి అభ్యర్థికి వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న ఓటర్లు

## బెంగాల్‌లో 15 చోట్ల రీపోలింగ్

### తీవ్ర ఉద్రిక్తత నడుమ 85 శాతం ఓటింగ్

**కోల్‌కత్తా, మే 2:** రెండు నియోజకవర్గాల పరిధిలోని 15 పోలింగ్‌కేంద్రాల్లో నిర్వహించిన రీపోలింగ్‌లో కూడా 90 శాతం మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం ఏడు గంటలనుంచి సాయంత్రం ఆరుగంటలవరకూ కొనసాగిన ఈ పోలింగ్‌లో మహిళలు, యువత ఎక్కువ పాల్గొన్నట్లు అంచనా. డైమండ్ హార్బర్, మగ్రహత్ పశ్చిమ్ నియోజకవర్గాల్లోని 15 కేంద్రాల్లో ఈపోలింగ్ ఝరిగింది. పటిష్టమైన భద్రతా ఏర్పాట్లమధ్య రీపోలింగ్ పూర్తి అయిందని, ఎలాంటి ఉద్రిక్తతలు లేవనెత్తకుండా కేంద్ర బలగాలు పటిష్టమైన చర్యలు తీసుకున్నట్లు ఎన్నికల యంత్రాంగం ప్రకటించింది. ఒకదశలో దక్షిణ 24 పరగణాల్లోని ఫాల్టా అసెంబ్లీ నియోజకవర్గంలో స్థానికులు నిరసన వ్యక్తంచేసారు. తమను టిఎంసి వర్కర్లు బెదిరిస్తున్నారని పోలీసులకు ఫిర్యాదులుచేసారు. పోలీస్ అధికారి శంతనుసేన్ మాట్లాడుతూ పరిస్థితిని సర్దుబాటుచేసామని పోలింగ్‌ప్రశాంతంగా ముగిసిందన్నారు. సాయంనరతం ఐదు గంటలకే 85శాతం పోలింగ్ నమోదయింది.ఫాల్టా నియోజకవర్గ టిఎంసి అభ్యర్థి జహంగీర్‌ఖాన్ అనుచరులపై వెంటనే ఎఫ్ఐఆర్‌నమోదుచేయాలని ఎనినకలసంఘం ఆదేశాలు జారీచేసింది. గ్రామస్తులు తమను బెదిరిస్తున్నారని, జహంగీర్‌ఖాన్ అనుచరులు, టిఎంసి కార్యకర్తలు తమను చంపుతామని బెదిరిస్తున్నట్లు ఫిర్యాదులుచేసారు. డైమండ్ హార్బర్ జిల్లాపోలీసులు కఠినమైన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీచేసారు. రెండోదశ ఎన్నికల్లో ఫాల్టానియోజకవర్గం కూడా ఉంది. ప్రత్యేకపరిశీలనకునిగా సుబ్రతా గుప్తాను నియమించింది. రీపోలింగ్ 30 కేంద్రాల్లోనిర్వహించాలని సిఫారసుచేసారు. అయితే ఎన్నికలసంఘం వాటిపై ఎలాంటినిర్ణయాన్ని ప్రకటించలేదు. గతనెల 29వ తేదీ పోలీస్‌ప్రత్యేక పరిశీలకుడు అజయ్‌పాల్‌వర్మ, ఎమ్మెల్యే అభ్యర్థి జహంగీర్‌ఖాన్‌లమధ్య మాటల యుద్ధం జరిగిన తర్వాత పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. ప్రస్తుతం రీపోలింగ్ ముగియడంతో ఎన్నికల యంత్రాంగం పోలీసులు ఊపిరిపీల్చుకున్నారు.

## ప్రభుత్వానికి కళ్లు, చెవులు విప్‌లే

>> తీసుకోవల్సిన చర్యలు, ధాన్యం సేకరణలో పురోగతి వివరాలను ముఖ్యమంత్రికి తెలిపారు. ధాన్యం సేకరణ ప్రక్రియను మరింత వేగవంతం చేయడంతో పాటు సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా సీఎం ఆదేశించారు. విప్‌లు నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కరించాలని సీఎం దిశానిర్దేశం చేశారు. సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు స్థానిక జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేయాలని సీఎం సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను మరింత క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలని, సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరిస్తుందన్న నమ్మకం ప్రజలకు కల్పించాలని సీఎం తెలిపారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడానికి ప్రసార మాధ్యమాలను ఉపయోగించుకోవాలన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంతో పాటు సమస్యలను ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకురావాలని సీఎం సూచించారు. ప్రభుత్వ విప్ లతో సమన్వయం చేసుకునేందుకు, ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు వారంలో ఒక రోజు విప్ లకు అందుబాటులో ఉంటానని సీఎం తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ ఎంపీ వేం నరేందర్ రెడ్డి, శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, విప్ లు ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్య, యెన్నం శ్రీనివాస్ రెడ్డి, విజయరమణరావు, రామచంద్రు నాయక్, వేముల వీరేశం, అద్దంకి దయాకర్, బల్మూర్ వెంకట్ పాల్గొన్నారు.


శనివారం నారాయణగూడలో వాల్‌రైటింగ్ రాస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

## మోడీ బహిరంగ సభకు పెద్ద ఎత్తున తరలిరండి

### స్వయంగా వాల్ రైటింగ్ క్యాంపెయిన్‌ను ప్రారంభించిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే2:** ప్రధాని మోదీ తెలంగాణ పర్యటన నేపథ్యంలో కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి శనివారం హిమాయత్ నగర్ నారాయణ గూడాలో స్వయంగా వాల్ రైటింగ్ క్యాంపెయిన్ ను ప్రారంభించారు ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఈ నెల 10వ తేదీన పరేడ్ గ్రౌండ్స్‌లో ప్రధాని నరేంద్ర మోడీ భారీ బహిరంగ సభ జరగనుందని, ఈ భారీ బహిరంగ సభలో పాల్గొనేందుకు తెలంగాణ రాష్ట్రంలోని నలుమూలల నుంచి ప్రజలు సభలో పాల్గొనాలని పిలుపునిచ్చారు 'ప్రతి శాసనసభ నియోజకవర్గంలో కూడా వందలాది మంది మహిళలు స్వచ్ఛందంగా తరలివచ్చి, భారతీయ జనతా పార్టీకి మద్దతు తెలుపుతున్నారు. రాబోయే కాలంలో తెలంగాణ రాష్ట్రంలో నరేంద్ర మోదీ నాయకత్వంలో డబుల్ ఇంజన్ సర్కార్ రావాలని ప్రజలు కోరుకుంటున్నారు' అని పేర్కొన్నారు. 'తెలంగాణ సమాజం మార్పు కోరుకుంటోంది. ఒక కుటుంబ పాలన నుంచి, అవినీతి పాలన నుంచి తెలంగాణకు విముక్తి కావాలని ప్రజలు ఆకాంక్షి స్తున్నారు. అందులో భాగంగానే ఈ రోజు ఎక్కడ చూసినా బిజెపికి అనుకూలమైన పవనాలు వీస్తున్నాయి అని చెప్పారు.'ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉగ్రవాదంపై సింధూర్‌తో యుద్ధం చేసి ఉగ్రవాదాన్ని దేశంలో తుద ముట్టించారు మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరుకున్నాయి. పేద ప్రజలందరూ మోదీ వైపు చూస్తున్నారు' అని చెప్పారు. 'రాబోయే ఎన్నికల్లో బిజెపి అధికారంలోకి రావడం ఖాయం. కార్యకర్తలందరూ ఐకమత్యంతో పనిచేసి, క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలి, 10న జరగబోయే బహిరంగ సభలో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొనాల'ని పిలుపునిచ్చారు

## ఉద్యోగులకు 6వేల కోట్లు

>> జూన్ 1 లోగా ఆరోగ్య భద్రత కార్డులను అందిస్తామని చెప్పారు. ప్రభుత్వం ఏ పథకాన్ని ప్రకటించినా ఉద్యోగులు భుజాన వేసుకుని పనిచేస్తున్నారని వారికి అభినందనలు తెలిపారు. ఉద్యోగుల సహకారంతోనే ప్రభుత్వ సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేయగలుగుతున్నామన్నారు.

మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగుల కోసమే మొదటి నిర్ణయం తీసుకున్నాం. ఉద్యోగులకు ప్రతీ నెలా మొదటి తారీఖున వేతనాలు అందేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఉద్యోగ సంఘాలు స్వేచ్ఛగా ఎన్నికలు నిర్వహించుకునేలా అవకాశం కల్పించాం. ఉద్యోగుల బదిలీల విషయంలో గందరగోళం తలెత్తకుండా ప్రణాళిక ప్రకారం నిర్వహించామని తెలిపారు.. ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న టీచర్ల బదిలీలు ఎలాంటి వివాదం లేకుండా పూర్తిచేశామన్నారు.. ఉద్యోగుల ఆరోగ్య భద్రత కార్డుల ప్రతిపాదనపై కూడా ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని పేర్కొన్నారు. ఈ రెండేళ్లలో ప్రజా ప్రభుత్వంలో 67,760 ఉద్యోగ నియామకాలు చేపట్టామని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. ఈ సమావేశంలో ఉద్యోగ సంఘాల నాయకులు మారం జగదీష్, వి. లచ్చి రెడ్డి, ఏలూరి శ్రీనివాస రావు, జి. శ్రీనివాస్ రెడ్డి, పి. దామోదర్ రెడ్డి, జి. సదానందం గౌడ్, వి. రవీందర్ రెడ్డి, వి. రాజశేఖర్, కె. రామకృష్ణ, ఎస్. రాములుతో పాటు ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు. సంఘాల డిమాండ్లపై స్పష్టతనిచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాల నాయకులు ధన్యవాదాలు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో చాలావరకు ఉద్యోగుల సమస్యలను ప్రజా ప్రభుత్వం పరిష్కరించిందని గుర్తుచేసుకున్నారు. ఈ నెల 5 న తలపెట్టిన నిరసన కార్యక్రమంతో పాటు అన్ని రకాల నిరసన కార్యక్రమాలను ఉపసంహరించుకున్నట్టు ఉద్యోగుల సంఘాల నేతలు ప్రకటించారు.

## ఛత్తీస్‌గఢ్‌లో పేలిన పాతర

### ముగ్గురు జవాన్లు మృతి

**నయారాయ్‌పూర్, మే 2:** ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు గతంలో అమర్చిన శక్తిమంతమైన ఐఈడీ (ఇంప్రొవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైస్) పేలడంతో ముగ్గురు డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ (డీఆర్‌జీ) జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. మరో జవాను తీవ్రంగా గాయపడ్డాడు. మందుపాతరలు తొలగించే ఆపరేషన్ (డీమైనింగ్) నిర్వహిస్తుండగా శనివారం ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. కాంకేర్‌నారాయణ్‌పూర్ జిల్లాల సరిహద్దుల్లో భద్రతా బలగాలు డీమైనింగ్, ఏరియా డామినేషన్ ఆపరేషన్లు చేపట్టాయి. ఇందులో భాగంగా ఛోటే బేతియా పోలీస్ స్టేషన్ పరిధిలోని అటవీ ప్రాంతంలో డీఆర్‌జీ బృందం మావోయిస్టులు అమర్చిన బాంబులను గుర్తించి నిర్వీర్యం చేసే పనిలో నిమగ్నమైంది. ఈ క్రమంలో ఒక ఐఈడీ ఊహించని విధంగా పేలింది. ఈ పేలుడులో ఇన్‌స్పెక్టర్ సుఖ్‌రామ్ వట్టి, కానిస్టేబుల్ కృష్ణ కోమ్రా, కానిస్టేబుల్ సంజయ్ గఢ్‌పాలే అక్కడికక్కడే మృతి చెందారు. మరో కానిస్టేబుల్ పర్మానంద్ కోమ్రా తీవ్రంగా గాయపడగా, అతనికి మెరుగైన వైద్యం అందిస్తున్నారు. ఈ ఘటనపై బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజ్ పట్టిలింగం స్పందించారు. ఇటీవలి కాలంలో లొంగిపోయిన మావోయిస్టులు, నిఘా వర్గాల సమాచారంతో వందలాది ఐఈడీలను గుర్తించి నిర్వీర్యం చేశాం. కానీ, నేటి దురదృష్టకర ఘటనలో ఓ ఐఈడీని నిర్వీర్యం చేస్తున్న సమయంలో అది పేలిందని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టు వ్యతిరేక ఆపరేషన్ల కోసం డీఆర్‌జీ దళాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. మార్చి 31న రాష్ట్రాన్ని సాయుధ మావోయిస్టు రహితంగా ప్రకటించిన తర్వాత ఇదే మొదటి పేలుడు కావడం గమనార్హం.

## పోలీసు స్టేషన్ పైనుంచి దూకి యువతి ఆత్మహత్యాయత్నం

**హైదరాబాద్, మే 2, ప్రభాతవార్త:** నిజామాబాద్ జిల్లా బాల్కొండలో ప్రియుడు తనను మోసం చేశాడనే బాధతో పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేసి, ఏకంగా స్టేషన్ భవనం పైనుంచి కిందకు దూకి ఆత్మహత్యకు యత్నించిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ సదరు యువతిని పోలీసులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. శుక్ర వారం మధ్యాహ్నం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాలు ఇలావున్నాయి. నిజామాబాద్ జిల్లా బాల్కొండ మండల కేంద్రంలో నివసించే ఓ యువతి (20) తానుండే ప్రాంతానికి చెందిన బాశెట్టి సాయికుమార్‌ను కొంత కాలంగా ప్రేమిస్తోంది. అయితే సాయికుమార్‌కు అప్పటికే వివాహం అయిన విషయాన్ని దాచిపెట్టి ఈ యువతితో ప్రేమా యణం సాగిస్తున్నాడు. వారం రోజుల క్రితం సాయికుమార్ బండారం ఆ యువతికి తెలియడంతో ఆమె నిల దీసింది. దీంతో ఇద్దరి మధ్య గొడవలు తలెత్తగా ఏం చేసుకుంటావో చేసుకో? అని సాయికుమార్ ఆ యువతిని బెదిరించాడు. దీంతో ఆ యువతి శనివారం ఉదయం బాల్కొండ పాత పోలీసుస్టేషన్ (ప్రస్తుత ముస్కాన్ పోలీసు స్టేషన్)లో ప్రియుడు తనను మోసం చేసిన విషయమై ఫిర్యాదు చేసేందుకు వచ్చింది. స్టేషన్‌లో ఫిర్యాదు చేశాక భవనం పైకి వెళ్లిన ఆ యువతి ఒక్కసారిగా కిందకు దూకింది. ఈ ఘటనతో పోలీసు స్టేషన్‌లో వున్న సిబ్బంది ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. అనంతరం పోలీసులు ఆమెను హుటాహుటిన జిల్లా ఆసుపత్రికి తరలిం చారు. ఆమె పరిస్థితి నిలకడగా వుందని పోలీసులు తెలిపారు. బాధి తురాలి ఫిర్యాదు మేరకు ఆమె ప్రియుడు సాయికుమార్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



రామాయంపేటలో శనివారం మీడియా సమావేశంలో మాట్లాడుతున్న రాంచందర్‌రావు

## మోడీ సభను విజయవంతం చేయండి

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు పిలుపు

**రామాయంపేట, మే 2, ప్రభాతవార్త:** మెదక్‌జిల్లా రామాయంపేట మున్సి పాలిటీలో శనివారం భారతీయ జనతాపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్ర రావు పర్య టించారు. ఈ సందర్భంగా పట్టణంలోని బీజేపీ కార్యాలయం ముందు పార్టీ జెండాను ఎగురవేశారు.అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తెలంగాణ పర్యటనలో భాగం గా సుమారు రూ.8వేల కోట్ల విలువైన అభివృద్ధి పనులను రాష్ట్రానికి అంకితం చేయనున్నారని తెలిపారు. మోదీ ప్రభుత్వం మహిళల హక్కుల కోసం కట్టుబడి పనిచేస్తోందని, మహిళలందరూ పెద్ద ఎత్తున సభకు హాజరై ఘన స్వాగతం పలకాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని రైతుల సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆరోపించారు. అలాగే ఫసల్ బీమా పథకం అమల్లో ఉం టే అకాల వర్షాలవల్ల నష్టపోయిన రైతులకు పరిహారం లభించేదని పేర్కొన్నారు. మెదక్ ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ పార్లమెంట్‌లో మహిళా రిజర్వే షన్ బిల్లు, డీలిమిటేషన్ అంశాలపై కాంగ్రెస్, కమ్యూనిస్ట్ పార్టీల వైఖరిని మహి ళలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నెల 10న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లోనిర్వహించే జనాగ్రహ సభకు ప్రధాని మోదీ హాజరుకానున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మల్లేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, రంజిత్, సురేష్, ఉపాధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్,కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి ఆకుల రమేష్, కిసాన్ మోర్చా అధ్యక్షులు బైండ్ల సత్యనారాయణ, ఓబీసీ మోర్చా అధ్యక్షులు కాశినాథ్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ రాగి రాములు, సర్పంచ్‌లు యాదగిరి, ప్రవీణ్, బాలరాజ్, నరేందర్, ఉపసర్పంచ్ ప్రశాంత్ రామాయంపేట మండల అధ్యక్షులు నవీన్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు శీలం అవినాష్‌రెడ్డి, కౌన్సిలర్ శంకర్ గౌడ్, పట్టణ ప్రధాన కార్యదర్శి అనిల్,పట్టణ యువమోర్చా అధ్యక్షులు కన్నయ్య, వెలుమల సిద్ధరాములు, భానుచందర్ బాసం అనిల్, నాగరాజు, సంతోష్, కటిక కార్తీక్ పాల్గొన్నారు.



## హైదరాబాద్‌లో పవన్ కల్యాణ్‌ను పరామర్శించిన ఏపి సిఎం చంద్రబాబు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మే2:**ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శనివారం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను పరామ ర్శించారు. ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్న పవన్ కల్యాణ్ ప్రస్తుతం హైదరా బాద్‌లోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో శనివా రం సాయంత్రం చంద్రబాబు జూబ్లీహిల్స్ లోని ఆయన నివాసానికి వెళ్లారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు పవన్ కల్యాణ్, ఆయన భార్య అనా కొణిదెల సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పవన్ ఆరోగ్య పరిస్థితిని చంద్రబాబు అడిగి తెలుసుకున్నారు. శస్త్రచికిత్సకు సంబంధించిన వివరాలపై ఆరా తీశారు. ఆరోగ్యం పూర్తిగా కుదుటపడే వరకు తగిన విశ్రాంతి తీసుకోవాలని పవన్‌కు సూచించారు. ఈ సందర్భంగా ఇరువురు నేతలు కాసేపు సమావేశమై రాష్ట్రంలోని తాజా పరిస్థితులపై క్లుప్తంగా చర్చించుకున్నట్లు సమాచారం. తన ఆరోగ్యం గురించి తెలుసుకునేందుకు స్వయంగా నివాసానికి వచ్చిన ముఖ్య మంత్రిచంద్రబాబుకు పవన్‌కల్యాణ్‌హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.



## జిఎన్ నాయుడు కుటుంబాన్ని పరామర్శించిన ఏపి సిఎం చంద్రబాబు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మే2:**హైదరాబాద్‌లోని నందగిరి హిల్స్ లోని జీఎన్ నాయుడు ఇంటికి ఏపీ సీఎం చంద్రబాబునాయుడు శనివారం సాయంత్రం వెళ్లారు. జీఎన్ నాయుడు కుటుంబాన్ని పరామర్శించారు. రీజెన్సీ సిరామిక్స్ అధినేత జీఎన్ నాయుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు.

## కామారెడ్డి ఎమ్మెల్యేపై షబ్బీర్ అలీ కుమారుడు పరువు నష్టం దావా

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మే2:**కామారెడ్డి ఎమ్మెల్యే, బీజేపీ నాయకుడు కాటిపల్లి వెంకటరమణారెడ్డిపై కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ కుమారుడు ఇలియాస్ పరువు నష్టం దావా వేశారు. తనపరువుకు భంగం కలిగేలా ఎమ్మెల్యే ఆరోపణలు చేశారంటూ ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టులో దావా వేశారు. దీనితో, ఈ నెల 20న హాజరుకావాలంటూ ప్రత్యేక కోర్టు సమన్లు జారీ చేసింది.శనివారం కామారెడ్డిలో హైకోర్టు న్యాయవాది సుమంత్ మాట్లాడుతూ, ఎమ్మెల్యేకు నోటీసులు జారీ అయినట్లు తెలిపారు. గత ఫిబ్రవరి 17,21వ తేదీల్లో జరిగిన మీడియా సమా వేశాల్లో ఇలియాస్‌పై అత్యాచార కేసులు ఉన్నాయంటూ ఎమ్మెల్యే అసత్య ఆరోప ణలు చేశారని పేర్కొన్నారు. అవాస్తవాలతో తన పరువుకు నష్టం కలిగించారని, ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని ఇలియాస్ కోర్టును ఆశ్రయించినట్లు చెప్పారు. దీంతో ఈ నెల20న హాజరుకావాలని కోర్టు నోటీసులు జారీ చేసిందని అన్నారు.

# జర్నలిజం ఒక ప్రజా సేవ

## జాతీయ మానవహక్కుల కమిషన్ సభ్యురాలు విజయభారతి

### ధర్మాచరణ పరాయణుడు నారదుడు: నారద జయంతి వేడుకలో వక్తలు

## పలువురు జర్నలిస్టులకు పురస్కారాల ప్రదానం



శనివారం హైదరాబాద్‌లో పురస్కారాలు అందుకున్న ఎడిటర్ దామెర్ల సాయిబాబ, జంధ్యాల శరత్ బాబు, వల్లీ పద్మాంజలి, సరస్వతుల రామ నరసింహం,బూరం ప్రశాంత్,లక్ష్మి

**హైదరాబాద్, మే 2 ప్రభాతవార్త:** దేశం అంతరా త్మను మలిచే బాధ్యతను, దేశానికి అవస రమైన అసలైన విషయాలను గుర్తించి సమా జానికి తెలియజేసే బాధ్యతను గుర్తించేరోజు ఈ నారద జయంతి జాతీయ మానవహక్కుల కమి షన్ సభ్యురాలు విజయభారతి అన్నారు. జర్న లిజం అనేది ఒక ఉత్తమ రూపంగా చేసే ప్రజా సేవ అని కొనియాడారు. హైదరాబాదులో శని వారం సమాచార భారతి ఆధ్వర్యంలో కోఠిలోని వైఎంఐ ఎస్ హాలు నిర్వహించిన నారద జయంతి వేడుక లకు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఇది 'ధైర్యానికి', 'సత్యానికి', 'బాధ్యతాయుతమైన జర్నలిజం శక్తికి'జరుగుతున్న ఉత్సవం అన్నారు. తాను సభ్యురాలిగా ఉన్న ఎన్‌హెచ్ఆర్సి ప్రా రంభం నుంచీ మీడియా శక్తిని, సేవలను విని యోగించుకుందని తెలిపారు. మానవహక్కుల పరిరక్షణ, ప్రోత్సా హంలో మీడియాని కూడా భాగస్వామిగా భావి స్తున్నదన్నారు. మీడియా ఇచ్చే నివేదికలను ఎన్‌హెచ్ఆర్సి విశ్వసిస్తుందని చెప్పారు. మీడియా కథనాలను సుమోటోగా కూడా స్వీకరించిన సందర్భాలు ఎన్నో ఉన్నా యని తెలియ జేస్తూ పోలవరం నిర్వాసితులు, సందేశ్‌కాలీ సహా పలు సంఘటనలను ఉద హరించారు. ఈకార్యక్రమానికి సమాచార భారతి అధ్యక్షుడు ప్రొఫెసర్ జి.గోపాల్‌రెడ్డి అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథిగా జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు విజయభారతి, సంస్థ ఉపాధ్యక్షులు, సీనియర్ జర్నలిస్ట్ వల్లీశ్వర్ తది తరులు హాజరయ్యారు. తొలుత సమాచార భారతి అధ్యక్షులు ప్రొఫెసర్ జి.గోపాల్ రెడ్డి మాట్లా డుతూ మీడియా రంగానికి ఈ సంస్థ చేస్తున్న సేవలను వెల్లడించారు.సమాచార భారతి మూడు దశాబ్దాలుగా భారతీయ సం స్కృతి, సంప్రదాయాలకు పెద్ద పీట వేస్తూ మీడియా రంగానికి సంబంధించిన పలు కార్యక్ర మాలను నిర్వహిస్తూ వస్తోందని తెలిపారు. వక్రీకరణ జరిగిన భారతదేశ చరిత్రను సరైన దిశలో ప్రపంచానికి తెలియజేయడానికి సమా చార భారతి కృషి చేస్తున్నదని, అందులో భాగం గానే పాత్రికేయ మిత్రులను ఒకే వేదికపైకి తీసు కొచ్చి, సోషల్ మీడియా సంగమాలు, పాత్రికేయ శిక్షణా శిబిరాలు వంటి పలు కార్యక్రమాలను నిర్వహి స్తోందన్నారు. జాతీయవాద పాత్రికే యుల్ని తయారు చేయడం కోసం జర్నలిజం కళాశాలను కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.
మహర్షి నారదుడు ధర్మాచరణ పరాయణుడని, అందరూ అనుకున్నట్టు కలహ భోజనుడు కాదని, నిజానికి ఆయనే మొదటి పాత్రికేయు డని చాలామందికి అవగాహన లేదని, పైగా ఈ మహర్షిని కార్టూన్ల రూపంలో నవ్వులపాలు చేసేందుకు ప్రయత్నించారని పలువురు వ్యక్తులు పేర్కొన్నారు.ఈ ఉత్సవంలో మీడియాలోని వివిధ విభాగాలకు చెందిన పలువురు జాతీయ వాద జర్నలిస్టులకు పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. పురస్కారాలను అందుకున్నవారిలో 'వార్త' దినపత్రిక సంపాదకులు దామెర్ల సాయి బాబ, సీనియర్‌జర్నలిస్ట్ జంధ్యాల శరత్ బాబు, మహిళా జర్నలిస్టువీడియో బ్లాగర్ వల్లీ పద్మాం జలి (అంజలి), సీనియర్ కార్టునిస్ట్ సరస్వ తుల రామ నరసింహం (సరాసి), ఐన్యూస్ చానెల్ వరంగల్ బ్యూరో చీఫ్ బూరం ప్రశాంత్, రాజ్ టివి న్యూస్ చీఫ్ ఎడిటర్ లక్ష్మి ఉన్నారు. వీరికి సమాచార భారతిఅధ్యక్షులు ప్రొఫెసర్ జి గోపా ల్ రెడ్డి, సంస్థ ఉపాధ్యక్షులైన సీనియర్ జర్నలిస్ట్ వల్లీశ్వర్, జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు విజయభారతి చేతుల మీదుగా సత్కారాలు, పురస్కార ప్రదానం జరిగాయి.

## రూ.4 వేల కోట్ల రుణానికి బాండ్లు విడుదల

### 4వ తేదీన బహిరంగ వేలంలో సమీకరణ

**హైదరాబాద్, మే 2, ప్రభాతవార్త:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో నెలలో రూ.4 వేల కోట్లను రుణం తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయిం చింది. ఇందుకు రిజర్వు బ్యాంకు నిర్వహించే బహిరంగ వేలంలో ప్రభుత్వ సెక్యూరిటీ బాండ్లను వేలం వేయడం ద్వారా ఈ రుణాన్ని తీసుకోనుంది. ఈ మేరకు దీనికి సంబంధించి రాష్ట్ర ఆర్థిక శాఖ రిజర్వ్ బ్యాంక్‌కు ఇప్పటికే ఇండెంట్ పెట్టింది. ఈ రూ.4 వేల కోట్లను ఈ నెల 4వ తేదీన రిజర్వ్ బ్యాంక్ నిర్వహించే బాండ్ల వేలంతో ప్రభుత్వం సమీకరించుకున్నది. ఇందుకు గాను అవసరమైన బాండ్లను ప్రభుత్వం రిలీజ్ చేసింది. ఈ రూ.4 వేల కోట్లలో రూ.2 వేల కోట్లను 17 ఏండ్ల కాలపరిమితితోను, మరో రూ.2 వేల కోట్లను 30 ఏండ్ల కాలపరిమితితో సమీకరించింది. ప్రస్తుత 2026-27 ఆర్థిక సంవత్సరం లోని తొలి నెలలో రూ.6,900 కోట్ల మేర రాష్ట్ర ప్రభుత్వం రుణాన్ని సేకరించింది. తాజాగా ఈ నెలలో మరో రూ.4 వేల కోట్లతో కలిపితే రెండు నెలల్లో ప్రభుత్వం తీసుకున్న అప్పు రూ.10,900 కోట్లకు చేరుకోనుంది. కాగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.82 వేల కోట్లు రుణంగా తీసుకోవాలని వార్షిక అంచనా బడ్జెట్‌లో ప్రభుత్వం ప్రతిపా దించింది. ఇందులో వడ్డీలు, అసలు చెల్లింపులకే రూ.44,329 కోట్లను అంచనా వేయగా, కొత్త అప్పులతో వడ్డీల భారం మరింత పెరగనున్నది.

## జాతీయ, రాష్ట్ర హైవేలపై ఎలక్ట్రిక్ చార్జింగ్ కేంద్రాల గడువు పెంపు

**హైదరాబాద్, మే 2, ప్రభాతవార్త:** ప్రధానమంత్రి ఈ డ్రైవ్ పథకం కింద జాతీయ, రాష్ట్ర రహదారులపై విద్యుత్ వాహనాల నిమిత్తం ఎలక్ట్రిక్ చార్జింగ్ కేంద్రాల ఏర్పాటుకు దరఖాస్తు చేసుకునే గడువును పొడిగించింది. ఈ మేరకు దీనికి సంబంధించి ఈ ఎలక్ట్రిక్ చార్జింగ్ కేంద్రాల దరఖాస్తు గడువును తెలంగాణ పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (రెడ్కో) పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. ఇప్పటి వరకూ ఈ కేంద్రాల ఏర్పాటుకు చేసుకునేగడువు ఈనెల 3 వ తేదీతో ముగియనుంది. ఈ నేపథ్యంలో మరోసారి ఈ గడువును ఈ నెల 7వ తేదీ వరకూ పొడిగిం చినట్లు పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. ఆసక్తి కలిగిన భూ యాజమానులు, వాణిజ్య సంస్థలు ఎలక్ట్రిక్ చార్జింగ్ కేంద్రాలు పెట్టుకోవడానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. ఇందుకు గాను హైదరాబాద్‌తో పాటు, గ్రేటర్ వరంగల్, పటాన్‌చెరు, సంగారెడ్డి, కరీంనగర్, నల్గొండ ప్రాంతాల్లో ప్రధాన రోడ్లపై కనీసం 200 గజాల స్థలాలు కలిగిన వారు ఈనెల 7వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొంది. ఎలక్ట్రిక్ చార్జింగ్ కేంద్రానికి అయ్యే వ్యయంలో 80 శాతం మేర సబ్సిడీగా పొందే అవకాశం ఉంటుందని వివరించింది. ఈ ఎలక్ట్రిక్ కేంద్రాలు పెట్టుకున్న వారికి కేంద్ర జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ మార్గదర్శకాల ప్రకారం సబ్సిడీ విడుదల అవుతుందని పేర్కొంది. మరిన్ని వివరాలకు, దరఖాస్తులను సమర్పించడానికి రెడ్కో వెబ్ సైట్ లేదా సెల్ నెంబర్ 6304903957, 6304903935 నెంబర్లలో సంప్రదించాలని సూచించింది.

# ఉచితంగా విద్య, వైద్యం

### ఉద్యోగాలు సృష్టిస్తాం, ఇచ్చే స్థాయికి ఎదిగేలా చేస్తాం

### అన్ని వర్గాల ప్రజల కోసం పోరాటాలు సాగిస్తాం: కవిత




శనివారం మీట్ దిప్రెస్‌లో మాట్లాడుతున్న కల్వకుంట్ల కవిత

**హైదరాబాద్ (సైఫాబాద్), మే 2 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సమస్యలు పరిష్కారం కోసం తాము పోరాటం చేస్తామని, సర్వోదయ తెలంగాణ లక్ష్యంతో ముందుకు సాగుతామని తెలంగాణ రక్షణ సేన (టిఆర్ఎస్) వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట కవిత చెప్పారు. పాంచజన్యం పేరుతో ప్రజల్లోకి వెళతా మని, ప్రస్తుతం ప్రతిపక్షంలో ఉన్నప్పటికి భవిష్యత్తులో అధికారంలోకి వచ్చినా ప్రధాన ఫోకస్‌గా ఉంటామన్నారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో టియుడబ్ల్యూజే ఆధ్వర్యంలో జరిగిన మీట్ ది ప్రెస్‌లో ఆమె మాట్లాడారు. రెండు దశా బ్దాల క్రితం ఏర్పాటు చేసిన తెలంగాణ జాగృతి సంస్థ ఇకపై ఎన్‌జివోగా పనిచేస్తుం దన్నారు. తెలంగాణ ఉద్యమకారులను గౌరవిం చుకునే క్రమంలో లక్ష సూపర్ న్యూమరికల్ ఉద్యో గాలను క్రియేట్ చేస్తామని కవిత హామీ ఇచ్చారు. ఏలాంటి జబ్బులు వచ్చినా పేదలకు ఉచితంగా నాణ్యమైన వైద్యం అందిస్తామని, అలాగే విద్యను కూడా ఉచితంగా అందించడమే తమ విధానమన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి హైదరా బాద్‌లో ఉన్నప్పటికి ఆయన సిమ్‌కార్డు మాత్రం ఢిల్లీలో ఉందని దుయ్యబట్టారు. రాష్ట్రంలో ఉపాధి అంటే హాస్యాస్పదంగా మారిందని తాము ఉపాధి కల్పన అంటే ఉద్యోగాలు మాత్ర మే కాదని, యువత, మహిళలే ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదిగేలా చూస్తా మత, 2 లక్షల నుంచి 20 కోట్ల వరకు రుణాలు ఇచ్చేలా ప్రణాళికలను రూపొందిస్తున్నామని, ప్రభుత్వాలు భర్తీ చేయని బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేస్తామన్నారు. సీనియర్ సిటిజన్స్‌కోసం ప్రత్యేకంగా ఒక శాఖను ఏర్పాటు చేసి, వారి సమస్యలను పరిష్కరిస్తామని, వారి కోసం ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటామని, విశ్రాంత ఐఎఎస్, ఐపి ఎస్ బ్యాంకులు రుణాలు ఇవ్వడం లేదని, అగ్రవర్ణాలలోని పేదలు, దివ్యాంగులు, మాజీ మావోయిస్టులు, మాజీ సైనికులందరికి ఇళ్ళు కేటాయించి సామాజిక న్యాయం అందిస్తా మన్నారు. అమ్మలా పాలన అందిస్తేనే ప్రజలకు న్యాయం జరుగుతుందని, తమ పాలన కూడా అలాంటిదేనని కవిత చెప్పారు.

# నేడు టిజిఆర్‌జేసీ ఎంట్రన్స్ టెస్ట్

### ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు

## 35 రెసిడెన్షియల్ కాలేజీలు, 93 కేజీబీవీల్లో అడ్మిషన్ల కోసం టెస్ట్

**హైదరాబాద్, ప్రభాతవార్త, మే 2:** తెలంగాణ రాష్ట్రంలోని జనరల్ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీలతోపాటు, 93 కస్తూర్బాగాంధీ బాలికా విద్యాల యాలు(కేజీబీవీ)ల్లో 2026-27 విద్యా సంవత్సరంలో ఇంటర్ మొదటి సం వత్సరంలో అడ్మిషన్ల కోసం నిర్వహించే టిజి ఆర్‌జేసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(టిజిఆర్‌జేసీ సెట్)-2026 నేడు(ఆదివారం) జరగనుంది. ఎంట్రన్స్ టెస్ట్‌కి 76,174 దరఖాస్తులు వచ్చాయి. టిజి ఆర్‌జేసీ సెట్- 2026 ద్వారా 35 తెలం గాణ రెసిడెన్షియల్ జూని యర్ కాలేజీలతోపాటు 93 కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలలో ఇం టర్మీడియట్ మొదటి సంవత్సరంలో అడ్మిషన్లు తీసుకో నున్నారు. ఇంటర్‌లో ఇంగ్లీషు మీడియం లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపుల్లో ప్రవే శము కొరకు పరీక్షను నిర్వహించనున్నట్టు గురు కుల సొసైటీ సెక్రటరీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2026 మార్చిలో జరిగిన 10వ తరగతి పరీక్షలకు హాజరై ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు పరీక్ష రాయడానికి అర్హులు. 35 గురుకుల కాలేజీల్లో 3000 సీట్లు అందుబాటులో ఉండగా 93 కేజీబీవీల్లో 3700 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ప్రవేశ పరీక్ష కోసం మహబూబ్ నగర్, రంగారెడ్డి, హైదరా బాద్, మెదక్, నిజామాబాద్, అదిలాబాద్, కరీంనగర్, హనుమకొండ, ఖమ్మం, నల్గొండ, సిద్దిపేట, సంగారెడ్డి జిల్లా కేంద్రాల్లో, అభ్యర్థు లకు 317 సెంటర్లు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. పరీక్షకు గంట ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని. ఓఎంఆర్ ఆన్సర్ షీటు ను బాల్ పాయింట్ పెన్నుతో మాత్రమే సరి యగు జవాబును నిర్దేశించిన వృత్తాలలో పూర్తి గా నింపాల్సి ఉంటుందని సెక్రటరీ తెలిపారు. 76174 విద్యార్థులు ఈ ప్రవేశప రీక్షకు దర ఖాస్తు చేసుకున్నారు. ఈ సంవత్స రము 35 తెలంగాణ గురుకుల జూనియర్ కళాశాలలతో పాటు 93 కస్తూర్బాగాంధీబాలికా విద్యాల యాలు (కేజీబీవీ)ల లోకి ఇంటర్మీడి యట్ మొదటిసంవత్సరం 2026-27లో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ గ్రూపుల్లో అలాగే కేజీబీవీ పాఠశాలలకు ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులకు ఉమ్మడి ప్రవేశపరీక్ష లో ప్రతిభ ఆధారంగా సీట్ల కేటాయింపు జరగనుంది. కొం తమంది విద్యార్థినులు రెండు సంస్థలలో దర ఖాస్తులు టిజీఎస్ఆర్‌టీసీ, కేజీబీవీలకు ఎంఈసీ, సీఈసీ, గ్రూపులకు చేసుకున్నట్లు గమ నిం చటం జరిగిందన్నారు. అయితే వారికి రెండు హాల్ టికెట్లు కేటాయించటం జరిగిందని, వారు చేరదలచిన గ్రూపుకి సంబందించిన హాల్ టికెట్ చూసుకకొని ఆయా పరీక్షాకేంద్రానికి వెళ్ళి ఉమ్మ డి పరీక్షకు హాజరుకావలెను. అభర్థులు తమ హాల్ టికెట్ మాత్రమే పరీక్ష హాలుకు తీసుకుని గంటముందుగా తమకు కేటాయించిన పరీక్షా కేంద్రానికి వెళ్లాలని అధికారులు స్పష్టం చేశారు.

## విమానాశ్రయంలో మాజీ ఎమ్మెల్యే కుమారుడు అడ్డగింత

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), మే 2, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్‌లో హిట్ అండ్ రన్ కేసులో నిందితుడైన బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడు మహ్మద్ రాహెల్ ఆమీర్ చట్టవిరుద్ధంగా దుబాయ్‌కు వెళ్లడానికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. రాహెల్ 2022 మార్చి 17న తన ఇద్దరు స్నేహితులతో కలిసి జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్ 45 మీదుగా కారులో వెళ్తున్న క్రమంలో బెలూన్లు అమ్మే మహిళను ఢీకొట్టగా, ఆమె చేతిలోంచి చిన్నారి కిందపడి అక్కడికక్కడే మృతి చెం దింది. ఈ కేసు నుంచి తప్పించుకునేందుకు తన స్నేహితుడు అఫ్రాన్ కారు నడిపాడంటూ పోలీసులకు తప్పుడు సమాచారమిచ్చాడు. ఆ తెల్లవారే దుబాయ్ పారి పోయాడు. ఆ రోజు కారు నడిపింది రాహెల్ అని పోలీసులు విచారణలో గుర్తించడంతో కేసు నమోదు చేశారు. ముందస్తు బెయిల్ కోసం రాహెల్ హైకోర్టును ఆశ్రయించగా పోలీసుల విచారణకు హాజరుకావాలంటూ స్పష్టం చేసింది. దీంతో గత నెల 17న జూబ్లీహిల్స్ పోలీసుల ఎదుట హాజరయ్యాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం దుబాయ్ వెళ్లేందుకు ఫ్లైట్ టికెట్ బుక్ చేసుకున్నాడు. సమాచారం అందుకున్న జూబ్లీహిల్స్ పోలీసులు ఇమ్మిగ్రేషన్ అధికారులను అప్రమత్తం చేసి అతడిని మధ్యలోనే అదుపులోకి తీసుకున్నారు. మరోమారు రాహెల్ విచారణకు రాగా, దుబాయ్ వెళ్లేందుకు కోర్టు అనుమతి ఇవ్వలేదని తేల్చి చెప్పారు.

## ప్రజా పాలన కాదు... ప్రజా వంచన

### బిఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద విమర్శలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మే2:** ప్రజా పాలన పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా వంచనకు పాల్పడుతుందని బిఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ తో కలిసి శనివారం మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రజా పాలన ప్రగతి నివేదిక పేరిట నిర్వహించిన 99 రోజుల కార్యక్రమం 60 రోజులు పూర్తి కావస్తుందని , ఇప్పటికీ ఏ ఒక్క సమస్య పరిష్కారం కాలేదని విమర్శించారు. మొదటి దఫా తీసుకున్న దరఖాస్తులతో కాలం గడిపిన కాంగ్రెస్ ప్రజా పాలన పేరిట దగా కార్యక్రమాం నిర్వహిస్తుందని దుయ్య బట్టారు. ప్రభుత్వం ఏ ఒక్క వర్గానికి మంచి చేయడం లేదని, పాలనలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. తాగునీటికి తల్లడి ల్లుతున్న రాష్ట్ర ప్రజానికానికి గుక్కెడు నీళ్లు ఇవ్వలేక పోతుందని అన్నారు. కెసిఆర్ హయాంలో పట్టణ ప్రగతి, పల్లె ప్రగతిని నిర్వహించి అద్భుతమైన పాలన అందించామని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో గందరగోళంగా నెలకొని ఉందని, ఆర్థికంగా ఉన్నవారికే ఇండ్లు ఇస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ పైన కవిత చేసిన వ్యాఖ్యల పట్ల యావత్ తెలంగాణ సమాజం చీత్కరించుకుంటుందని అన్నారు.

## తిరుమల దర్శనం పేరుతో రూ. 3.77 లక్షల మోసం

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), మే 2, ప్రభాతవార్త:** తిరుమలలో ప్రత్యేక దర్శనాలు కల్పిస్తానని నమ్మించి ఓ భక్తుడి నుంచి లక్షల రూపాయలు దోచుకున్న ఘటన బంజారాహిల్స్‌లో వెలుగులోకి వచ్చింది. బాధితుడు బాలాజీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. బంజా రాహిల్స్ రోడ్ నం.12లోని ఎన్‌బీటీ నగర్‌కు చెందిన బాలాజీ (60), ప్రైవేట్ బ్యాంకులో రిటైర్డ్‌ఉద్యోగి. ఆయన ప్రతి నెలా ఒకటి లేదా రెండు సార్లు తిరు మల వెళ్తుంటాడు. 2025 ఏప్రిల్‌లో వినయ్ గౌడ్ ఆలూరి అనే వ్యక్తి బాలా జీని సంప్రదించి, తన మామ టీవీ 5 ఛానెల్‌లో ఉన్నత పదవిలో ఉన్నారని, అలాగే టిటిడిలో పరిచయాలు ఉన్నాయని చెప్పి నమ్మించాడు. 14 అభిషేకం టికెట్లు, వసతి ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చాడు. దీనిపై నమ్మకంతో బాలాజీ అతనికి అవసరమైన మొత్తాన్ని చెల్లించారు. తిరుమల చేరుకున్న తర్వాత అభిషేకం వాయిదా పడిందని చెప్పి మూడు రోజుల పాటు వేచి ఉండాలని, సుప్రభాతం దర్శనంఏర్పాటు చేస్తానని చెప్పి మరోసారి డబ్బులు తీసుకు న్నాడు.మొత్తం రూ.3,77,370 మోసగించినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు బీఎన్ఎస్ 316(2), 318(4) సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


# చెరువులో ఈతకు వెళ్లి ఇద్దరు బాలురు మృతి

- సైదాపురంలో అలుముకున్న విషాద ఛాయలు

**సైదాపురం (నెల్లూరు), మే 2, ప్రభాతవార్త:** సరదాగా చెరువులోకి ఈతకు వెళ్లి అనధికారికంగా తవ్విఉన్న గుంతలో ప్రమాదవ శాత్తు మునిగిపోయి ఇద్దరు చిన్నారులు మృతి చెందిన సంఘటన మండల కేంద్రమైన సైదాపురంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు సైదాపురంకు చెందిన చల్లా ఉష కుమారుడు 8వ తరగతి చదువుతున్న చల్లా చందు(14), అదే విధంగా వాకాటి మరియదాసు కుమారుడు 7వ తరగతి చదువుతున్న వాకాటి లక్కీ(12) ఇద్దరు కలిసి సైదాపురంలో ఉన్న పెద్ద చెరువు దగ్గరకు సుమారు 1గంటల ప్రాంతంలో సరదాగా ఈతకు వెళ్లారు. ఈ క్రమంలో చిన్నారులు చెరువులోకి దిగుతుండగా ఆ ప్రాంతంలో అనధికారికంగా మట్టి తీసిన గుంతలు లోతుగా ఉండడంతో ఈ చిన్నారులు గమనించకపోవడంతో నీటిలో మునిగిపోయారు. విషయం తెలుసుకున్న స్థానికులు, గ్రామస్తులు ప్రమాద స్థలానికి చేరుకుని వారిని చెరువులో నుంచి బయటకు తీయగా అప్పటికే వారు మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో ఆ ప్రాంతమంతా విషాధ ఛాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న ఇన్‌చార్జి ఎస్సై లక్ష్మీభవాని, తహసీల్దార్ సుభద్ర సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతి చెందిన చిన్నారుల కుటుంబాల్లో విషాధ ఛాయలు అలుముకున్నాయి. గతంలో అనధికారికంగా చెరువులో మట్టి కోసం తవ్విన గుంతల వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎస్సై లక్ష్మీ భవాని మాట్లాడుతూ మృతి చెందిన చిన్నారులను పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆసుపత్రికి పంపించడం జరిగిందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆమె తెలిపారు.

## 5నుండి తిరుపతి తాతయ్యగుంట గంగమ్మజాతర

**తిరుపతి, మే 2 ప్రభాతవార్త ప్రతినిధి:** రాయలసీమ జిల్లాల్లోనే ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే తిరుపతి తాతయ్యగుంట గంగమ్మజాతర వారం రోజులు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. ఇందుకు ప్రభుత్వశాఖలన్నీ సిద్ధమయ్యాయి. ఈనెల 5వతేదీ మంగళవారం రాత్రి చాటింపు తో మొదలయ్యే జాతర వేడుకలు వరుసగా, బైరాగి వేషం, బండ వేషం, తోటి వేషం, దొర వేషం, మాతంగి వేషం, సున్నపుకుండలు వేషం, చివరగా 12వ తేదీ గంగజాతర వేడుకలు జరుగుతాయి. 13వ తేదీ వేకువజామున పేరం టాలు అమ్మవారి ప్రతిమను చంప నరకడంతో ముగుస్తాయి. శనివారం గంగమ్మ ఆలయంలో ఏర్పాట్లు, క్యూలైన్లు, భక్తుల అనుమతి, వైద్య శిబిరాలు, తాగునీరు, పారిశుద్ధ్యం పై నగర పాలక సంస్థ ఇన్‌ఛార్జి కమిషనర్ శారదాదేవి, గంగమ్మఆలయ ఛైర్మన్ నైనార్ మహేశ్‌యాదవ్, ఆలయ ఇఒ జయకుమార్, నగరపాలక సంస్థ ఆర్ఒ సేతుమాధవ్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. తాతయ్యగుంట గంగమ్మ జాతర భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వ శాఖలను సమన్వయం చేసుకుని పనిచేయనున్నట్లు ఛైర్మన్ మహేశ్‌యాదవ్ తెలిపారు. గంగజాతరకు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని, ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా వ్యవహరిస్తామని తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు తెలిపారు. సామాన్య భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా దర్శనాలు కల్పిస్తామని, విఐపిలకు సమయం కేటాయించామన్నారు. ఆయా రోజుల్లో విఐపిలు ఆ సమయంలోనే గంగమ్మ ఆలయానికి చేరుకుని విఐపిలు దర్శనం చేసుకోవాలని, భక్తులు ఆధ్యాత్మిక వాతావరణంలో అమ్మవారిని దర్శించుకునే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.



# కొనుగోలు కేంద్రాల్లో అన్నదాతల పడిగాపులు

మల్లికార్జున

యాసంగిలో అన్నదాతలు పండించిన ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళుతోంది. అయితే వరి కోతలు సాగుతున్నంత వేగంగా ధాన్యం కొనుగోళ్లు కొనసాగడం లేదన్న అసంతృప్తి అన్నదాతల్లో నెలకొంది. ప్రస్తుతం రాష్ట్రంలో యాసంగి వరి, మొక్కజొన్న ధాన్యం సేకరణ కొనసాగుతోంది. ఈ ఏడాది దాదాపు 90లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకు దాదాపు 8221కు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 6వేల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ ఏడాది రబీలో తెలంగాణలో దాదాపు 53లక్షల ఎకరాలకు పైగా వరి సాగైంది. ప్రస్తుతం యాసంగి వరి కోతలు రాష్ట్ర వ్యాప్తంగా ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఇప్పటికే దాదాపు 60శాతం వరి కోతలు పూర్తి కాగా మరో 40శాతం మేర ఈ వారం, పది రోజుల్లో పూర్తి కానున్నాయి. ఈ నేపథ్యంలో వరి ధాన్యం క్రయ,విక్రయాలు ఇటు రైతులకు, అటు వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ, పౌరసరఫరాల శాఖ అధికారులకు సవాల్‌గా మారింది. యాసంగి పంట కాలం అంటేనే ధాన్యం సేకరణను అకాల వర్షాలు వెంటాడుతుంటాయి. ఈ విషయం ప్రతి ఏటా అనుభవంలోకివస్తున్నా అన్నదాతలకు తగినన్ని టార్పలాన్ షీట్లు అందుబాటులో ఉంచడంలో పౌరసరఫరాలశాఖ విఫలమైందన్న ఆరోపణలు ఉన్నాయి. గత 2016 వరకు వ్యవసాయశాఖ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రాయితీపై అన్నదాతలకు టార్పాలాన్ షీట్లను అందజేసేది. అయితే గడిచిన కొద్ది సంవత్సరాలుగా టాటిపత్రులు పంపిణీ చేయకపోవడంతో కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన, కుప్పనూర్చిన ధాన్యాన్ని అకాల వర్షాల బారి నుండి కాపాడుకోలేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అకాల వర్షాలు కురిస్తే తమ వద్ద అందుబాటులో ఉన్న టాటిపత్రులు ధాన్యాన్ని కాపడలేకపోతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదే సమయంలో ఈ ఏడాది రికార్డుస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నా కొనుగోలు కేంద్రాల్లో అన్నదాతలకు నీడ కోసం టెంట్లు, తాగునీటి వసతి తదితర కనీస సౌకర్యాలు కరువయ్యాయి. ధాన్యాన్ని నిబంధనల మేరకు 17శాతం తేమ వచ్చేవరకు ఆరబోసి, మాయిశ్చర్ వచ్చాక కుప్ప నూర్చేందుకు రైతు కుటుంబంలోని పిల్లా జల్లా అంతా కష్టపడాల్సిందే. అయితే కొనుగోలు కేంద్రాల్లో నీడ, చల్లని తాగునీరు వంటి కనీస వసతులు లేకపోవడంతో సమీపంలోని చెట్ల కిందనే రైతులు సేదదీరాల్సి వస్తోంది. ఈ



పరిస్థితుల్లో అకాల వర్షాలు, గాలివానలు వస్తే రైతుల ప్రాణాలకు ప్రమాదమన్న ఆందోళన వ్యక్తమవుతోంది. మొత్తంగా ఓవైపు ఎండల తీవ్రత, మరోవైపు అకాల వర్షాల భయం, మరో వైపు కల్లాలు దాటని వడ్లను చూస్తూ రైతులు ఆవేదనతో కుమిలిపోతున్నారు. చేతికొచ్చిన పంటను అమ్ముకోలేక వర్షాల నుంచి కాపాడుకోలేక రైతులు సతమతమవుతున్నారు. యాసంగి ధాన్యం కొనుగోళ్లకు రవాణా ఇబ్బందులు పెద్ద ప్రతిబంధకంగా మారాయి. తూకం వేసిన ధాన్యాన్ని సకాలంలో రైస్ మిల్లులకు తరలించేందుకు లారీలు అందుబాటులో లేకపోవడంతో పలు జిల్లాల్లో ధాన్యం కొనుగోళ్లు నత్తనడకన సాగుతున్నాయి. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రాశులు పేరుకుపోతున్నాయి. సకాలంలో లారీలు రాకపోవడంతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు పేరుకుపోతున్నాయి. ఈ పరిస్థితుల్లో అకాల వర్షం కురిస్తే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ముంది. నిబంధనల మేరకు 17శాతం మేర తేమ వచ్చేంత వరకు ఆరబోసిన ధాన్యాన్ని రైతులు రాసిపోశారు. అందుబాటులో ఉన్న టార్పలిన్లతో తడవకుండా పట్టాలు కప్పారు. అయితే ధాన్యం రాసిని బస్తాకు 40కిలోల చొప్పున తూకంవేసి లోడింగ్ కోసం లారీల కోసం వేచి చూస్తుండడంతో ఆ ధాన్యాన్ని అకాల వర్షాల భారి నుండి కాపాడడం రైతులకు సవాల్‌గా మారింది. వర్షం బారి నుండి ధాన్యం బస్తాలన్నింటినీ రక్షించేలా కప్పి ఉంచడానికి తగినన్ని టార్పలిన్లు రైతులకు అందుబాటులో లేకుండాపోయాయి. దీంతో కొనుగోళ్లను వేగంగా చేపట్టాలని, తూకం వేసిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించేందుకు లారీలను సమకూర్చాలని డిమాండ్ చేస్తూ పలు జిల్లాల్లో అన్నదాతలు రోడ్డెక్కి నిరసన తెలుపుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రతీ ఏడాది ధాన్యం రవాణాలో ట్రాన్స్‌పోర్ట్ సమస్య వెంటాడుతోంది. తరుగు పేరుతో రైతులు నిలువు దోపిడీకి గురవుతున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను మద్దతు ధరకు అమ్ముకుందామని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు వస్తే మిల్లర్లు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల అక్రమాలు అన్నదాతలకు శాపంగా మారుతున్నాయి. వడ్లలో తేమ, తాలు, రాళ్లు ఉన్నాయనే సాకుతో క్వింటాల్‌కు 3నుంచి 5 కిలోల వరకు తరుగు తీస్తున్నారు. ఒక బస్తాకు 41 కేజీల వడ్లు తూకం వేయాల్సి ఉండగా, 44-45 కేజీల వరకు జోకుతుండడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతు పండించిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి పక్షం రోజుల వరకు ఆరబెట్టి తేమ 17శాతం వరకు వచ్చాక తూకం వేసే క్రమంలో పాక్షిక నష్టం, గన్నీ బస్తాల బరువు పేరుతో అదనంగా 3నుంచి 5కిలోల మేర వడ్లను జోకుతుండడంపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసంగానైనా క్వింటాల్‌కు అయిదు కేజీల వరకు తరుగు పేరిట తూకం అంటే ఎకరా ధాన్యం సాగుచేసిన రైతు 20 క్వింటాళ్లు పండించినా ఒక క్వింటా మేర తరుగు కిందనే నష్టపోతున్నాడు. అంటే ఎకరం ధాన్యం సాగు చేసిన రైతుకు క్వింటా ధాన్యం పైగా రూ.3000 వరకు తరుగు పేరిట నష్టపోతున్నాడు. ధాన్యం నాణ్యత లేదని, రంగు మారిందని సాకులు చూపిస్తూ క్వింటాల్‌కు 3కిలోల వరకు కోత పెడుతున్నారని రైతులు వాపోతున్నారు. ఒకబస్తా 41కిలోల వరకు తూకం వేయాల్సి ఉండగా నిర్వహకులు 44 కిలోలకు పైగా తూకం వేస్తున్నట్టు రైతులు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉంటే కొనుగోలు కేంద్రాల్లో ఆధునిక ప్యాడి క్లినర్లు అందుబాటులో లేకపోవడంతో అన్నదాతలు ప్రయివేటు ప్యాడిక్లీనర్లకు గంటకు రూ.900 నుంచి రూ.1000 దాకా చెల్లించి తూర్పార బడుతున్నారు. ఎకరా ధాన్యాన్ని తూకం పట్టాలంటే గంట సమయం పడుతోంది. దీంతో 17శాతం తేమ వచ్చేంత వరకు ఆరబోసిన ధాన్యాన్ని తూర్పార బట్టాలంటే రైతు ఎకరాకు మరో రూ.1000నుఅదనంగా భరించాల్సిందే. మరోవైపు ధాన్యం విక్రయంలో కీలకమైన తమే నిబంధనలను సంతృప్తి పరచటం రైతులకు కత్తిమీద సాములాగా మారింది. యాసంగిలో మాడు పగిలే ఎండలు,వానాకాలంలో వర్షాలను ఎదుర్కొని ధాన్యాన్ని ఆరబోయడం చాలా కష్టంతో కూడుకున్న పని. ఈ పరిస్థితిని అధిగమించేందుకు ఆధునిక ప్యాడి డ్రయర్ (వరి ఆరబోత) యంత్రాలను సమకూరుస్తామని మూడేళ్లుగా ప్రతీసీజన్‌లో ప్రభుత్వం ప్రకటిస్తున్నా అవి ఇంతవరకు అందుబాటులోకి రావడంలేదు. మరోవైపు కొనుగోళ్ల తాలూకు సుతిల్ దారం కూడా రైతులే కొనుగోలు చేయాల్సి వస్తోంది. అయిదు ఎకరాలు పండించిన రైతు సుతిల్ దారానికే రూ.1000దాకా వెచ్చించాల్సి వస్తోంది. హామాలీ ఛార్జీలు కూడా రైతే భరించాల్సి వస్తోంది. క్వింటాకు రూ.70 నుండి రూ.100 వరకు హామాలి ఛార్జిలు చెల్లించాల్సి రావడంతో ఎకరా ధాన్యాన్ని లారిలోకి ఎత్తేందుకు రైతు దాదాపు రూ.2వేల దాకా హామాలీ ఖర్చుల కింద చెల్లించాల్సి వస్తోంది.

ఇది చాలదన్నట్టు ఈ ఏడాది నుంచి ఇన్ని వ్యయ ప్రయాసలకోర్చి ధాన్యాన్ని రైస్ మిల్లులకు పంపితే మిల్లర్లు కొర్రీలు పెడుతూ అన్‌లోడ్ చేసుకోవడం లేదని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు వాపోతున్నారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన దొడ్డు రకం వడ్ల లారీలను మిల్లులకు పంపితే వారు దించుకోవడం లేదు. దీంతో రోజుల తరబడి లారీలు అక్కడే ఉండాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. అయితే తాము విధించిన షరతు లకు అంగీకరిస్తేనే దొడ్డు ధాన్యాన్ని అన్‌లోడ్ చేసుకుంటామని కండిషన్ పెడుతున్న మిల్లర్లు తాలు పేరిట, మట్టి పెళ్లల పేరుతో అన్‌లోడ్ చేసుకోకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారు. పెద్దఎత్తున కోతలు విధిస్తూ రైతులను నిలువునా ముంచుతున్నారు. మిల్లర్లు చేతు లెత్తేయడం, అధికారులు స్పందించక పోవడం, లారీ కాంట్రాక్టర్లు సైతం ముందుకు రాకపోవడం తదితర సమస్యలతో కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు, అన్నదాతలకు తల నొప్పిగా మారింది. ఇక మక్క రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. యాసంగిలో కష్టపడి పండించిన పంటను కొనుగోలు చేసేవారు కరువయ్యారు. ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో పీఏసీఎస్‌ల ద్వారా కొనుగోళ్లు ప్రారంభించింది. మద్దతు ధర క్వింటాలుకు రూ.2400 ప్రకటించినా పిఎసిఎస్ నిర్వాహకులు గన్నీ సంచులు ఇవ్వకపోవడం, సకాలంలో తూకం వేయకపోవడం, లోడింగ్ కాక రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే పడిగాపులుగాయాల్సి వస్తోంది. మాడు పగులగొడుతున్న 46 డిగ్రీల మండుటెండలో మక్క రాశుల వద్ద రైతులు పడిగాపులు గాయాల్సి రావడం గమనార్హం. ఈ పరిస్థితుల్లో ప్రత్యేక చొరవ తీసుకుని వరి, మక్కల కొనుగోళ్లు వేగంగా కొనసాగేలా వ్యవసాయ, మార్కెటింగ్, పౌరసరఫరాలశాఖ అధికారులను పురమాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని రైతులు కోరుతున్నారు.

పశ్చిమ బెంగాల్

# 24 గంటల్లో..

ఎ.వి.వి ప్రసాద్

జడివాన వెలిసింది.. ఉత్కంఠ పతాకస్థాయికి చేరింది. ఆరోపణలు, ప్రత్యారోపణలు శ్రుతిమించినపుడు తీవ్రస్థాయి నిందలతో ఉద్రిక్త స్థితికి చేరిన ప్రచారం, ఆ తర్వాత అదే ఉద్రిక్త పరిస్థితిమధ్య జరిగిన పోలింగ్ ముగిసి ఇప్పుడు రాజకీయ నాయకుల జాతకాలు తేలే సమయం ఆసన్నమైంది. ఎవరికి వారే గెలుపు ధీమాతో కనిపిస్తున్నారు. కానీ గెలుపనేది ఒక్కరికే గనుక కొందరు ముందే డీలాపడుతున్నారు. నరాలుతెగే ఉత్కంఠ మరి కొన్ని గంటలే. కొందరి ఆశలపై నీళ్లు చల్లుతూ, బెంగాల్ తుది విడత పోలింగ్ గత బుధవారం ముగియగానే వెలువడిన ఎగ్జిట్ పోల్స్ బెట్టింగ్ జోరును మరింత పెంచాయి. ఎవరు గెలుస్తారనేది ఎవరూ కచ్చితంగా చెప్పలేకపోయినా, ఎవరి అంచనాలను వారు ప్రకటిస్తూనే ఉంటారు. ఎగ్జిట్ పోల్స్‌లో శాస్త్రీయత ఎంత అనే సందేహం అలా ఉంచితే, వాటి కోసం అందరూ ఎంతో ఆసక్తితో ఎదురు చూస్తూనే ఉంటారు. దాదాపు మూడున్నర దశాబ్దాల నుంచి, పోలింగ్ ముగియగానే ఎగ్జిట్ పోల్స్ అంచనాలను మనం చూస్తూనే ఉన్నాం. మొదట అధికార స్థాయిలో ప్రకటించిన ఎగ్జిట్ పోల్స్‌పట్ల మీడియాలో ఉత్సుకత పెరగడంతో, తర్వాత మీడియాకు చెందిన అనేక సంస్థలు ఈ ఎగ్జిట్ పోల్స్ నిర్వహించడం మొదలు పెట్టాయి. 1996 లోక్‌సభ ఎన్నికల సమయంలో దూరదర్శన్, సెంటర్ ఫర్ ది స్టడీస్ ఆఫ్ డెవలపింగ్ సొసైటీస్ కలిసి ఎగ్జిట్ పోల్స్ ప్రకటించడంతో అప్పటినుంచి వాటికి విశేషాదరణ మొదలయింది. నిజానికి 1957లోక్ సభఎన్నికల సమయంలోనే ఎగ్జిట్‌పోల్స్ శాస్త్రీయ పద్ధతిలో జరిపినా అప్పట్లో వాటిని ఎవరూ ఎక్కువ పట్టించుకోలేదు. తర్వాత రాజకీయాలను వ్యాపారంగా భావించేవారు వారి భవిష్యత్తును అంచనా వేసే నిపుణులు కూడా ఎక్కువై రకరకాల సర్వేల పేరుతో జోస్యాలు చెబుతున్నారు. ఈఅంచనాలు ఒక్కోసారి నిజమైతే, కొన్నిసార్లు తారుమారవుతూంటాయి. 2004 ఎన్నికల్లో ఎన్డీయేఅధికారంలోకి వస్తుందని మెజారిటీ సర్వేలు చెప్పగా, ఆ అంచనాలు తారుమారు చేస్తూ యుపిఎ అధికారం లోకి వచ్చింది. తర్వాత 2009లో యుపిఎకు స్వల్ప మెజారిటీ వస్తుందని ఎగ్జిట్‌పోల్స్ చెప్పగా, ఆ అంచనాలకు దగ్గరగా యుపిఎకు స్పష్టమైన మెజారిటీ లభించింది. ఇలా కొన్ని సందర్భాల్లో అంచనాలు సరిగానే సాగుతూంటాయి. అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి బెంగాల్‌లో తీవ్ర పోటీ మధ్య బిజెపికి స్వల్ప ఆధిక్యత లభించవచ్చని మెజారిటీ సర్వేలు అంచనా వేశాయి. అయితే తృణమూల్ కాంగ్రెస్ వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చింది. ఇక 2024 లోక్‌సభ ఎన్నికలు చూస్తే దాదాపు అన్ని ప్రధాన సర్వేలు ఎన్డీయేకు 350 నుంచి 400 సీట్లు లభిస్తాయనీ, ఇండియా కూటమికి 120 170 సీట్లు రాగలవనీ అంచనా వేశాయి. అయితే అసలు ఫలితాలు ఆ అంచనాలకు దగ్గరగానే వచ్చి ఎన్డీయే గెలిచినా, ఎగ్జిట్ పోల్స్‌లో



ఓటింగ్ మిషన్

చెప్పినంత భారీ మెజార్టీ రాకపోవడం గమనించవలసిన అంశం. ప్రభుత్వం ఏ కూటమిదో సర్వేలు చెప్పాయి కానీ సీట్ల సంఖ్యలో వ్యత్యాసం ఎక్కువే కనిపించింది. ఆ ఎన్ని కల్లో ఎన్డీయేకు 293 సీట్లు రాగా, ఇండియా కూటమికి 234 సీట్లు లభించాయి. అంటే ఎగ్జిట్ పోల్స్‌అంచనాలకు భిన్నంగా సీట్ల సంఖ్యలు కని పించాయి. తాజాగా ఐదు అసెంబ్లీలకు జరిగిన ఎన్నికలపై భారీ అంచనాలే ప్రకటించడం గమనించవలసిన మరో అంశం. ఐదు పోలింగ్‌లలోను, బెంగాల్‌లో అత్యధికంగా దాదాపు 93శాతం ఓట్లు నమోదవడంతో ఈసారి అక్కడ ఫలితాల అంకెలు మారుతాయని సర్వేసంస్థలు చెబుతున్నాయి. పశ్చిమ బెంగాల్ లో ఈసారి 'కమలం' విరబూయవచ్చని మెజారిటీ ఎగ్జిట్‌పోల్స్ చెబుతున్నాయి.అసోంలో అధికారం మళ్లీ బిజెపికే లభించవచ్చనీ, తమిళనాట స్టాలిన్ వరుసగా రెండోసారి అధికారంలోకి రావచ్చనీ సర్వేలు పేర్కొంటున్నాయి. అయితే కేరళలో అధికారం ఎల్డీఎఫ్ నుంచి యుడిఎఫ్‌కు మారే సూచనలున్నాయి. పుదుచ్చేరిలోను బిజెపి కూటమికే అధికారం లభించవచ్చని అంచనా. అంటే తమిళనాడు అసోంలో అధికార పార్టీల స్థానం పదిలంకాగా, బెంగాల్, కేరళలో విపక్షాలు విజయం సాధించగలవని తెలుస్తోంది. పుదుచ్చేరిలో తిరిగి ఎన్డీయే కూటమికే అధికారం లభిస్తుందని మెజారిటీ సర్వేలు సూచిస్తున్నాయి. బెంగాల్‌కు సంబంధించి ఐదు ప్రధాన సర్వే సంస్థలు బిజెపి వైపు మొగ్గుచూపుతూ 145175 సీట్లు రావచ్చని జోస్యం చెబుతుండడంతో ఆ పార్టీ నాయకులు ముందస్తు సంబరాలు కూడా జరుపుకొంటున్నారు. రెండుసంస్థలు మాత్రమే మమత నాయకత్వంలోని టిఎంసి పట్ల మొగ్గు చూపాయి. తమిళ నాడుకు సంబంధించి అన్ని ప్రధాన సంస్థలు డిఎంకె వైపే మొగ్గు చూపడం గమనించవలసిన మరో అంశం. రెండోస్థానంలో అన్నాడిఎంకె కూటమి, మూడోస్థానంలో విజయ్ నాయకత్వంలోని టివికె రావచ్చని అంచనా వేస్తున్నాయి. హంగ్ ఏర్పడవచ్చనీ, ఆ పరిస్థితిలో విజయ్ పార్టీ కీలకపాత్ర పోషించవచ్చనీ అంటున్నాయి. యాక్సిస్ మై ఇండియా అనే సంస్థ విజయ్ పార్టీకి 98120 సీట్లు అంచనా వేయడంతో ఆయన అభిమానులు కూడా ముందస్తు సంబురాలు జరుపుకొంటున్నారు. బెంగాల్‌కు సంబంధించి 4వ తేదీన ఫలితాలు వెలువడగానే అందరికీ తాము స్వీట్లు పంచుతామని ప్రధాని మోడీ స్వయంగా ప్రకటించడంతో, సర్వే సంస్థల అంచనాలు కూడా దానికి దగ్గరగా ఉండడంతో బెంగాల్‌లో లెక్కలు మారవచ్చనే పరిశీలకులు భావిస్తున్నారు. కేరళలో సిఎం పినరై విజయన్ కూడా ఇదే తరహా ఆశాభావంతో ఉన్నా, సర్వే సంస్థలు యుడిఎఫ్‌కు అనుకూలం గా అంచనాలను ప్రకటించాయి. కేరళలో అధికారం యుడిఎఫ్‌కు లభిస్తే కాంగ్రెస్‌కు కొంత ఊరట లభించినట్లవుతుంది. ఏది ఏమైనా తీవ్రస్థాయికి చేరిన ఉత్కంఠకు మరికొన్ని గంటల్లోనే తెర పడబోతోంది.

మయన్మార్

# నోబెల్ 'శాంతి'కి గృహనిర్బంధం!

గన్ని మోహన్

ప్రజాస్వామిక ప్రపంచంలో ఆమె ఒక హక్కుల నేత. తమ దేశ ప్రజలు అణిచివేతకు గురికాకూడదన్న తపన ఆమెలో నరనరానా పేరుకుని ఉండేది. సైనిక ప్రభుత్వం ఎన్నోసార్లు అణిచివేతకు గురిచేయాలని ఉక్కుపాదం వేయాలని విశ్వప్రయత్నాలు చేసినా ఆమె శాంతియుత దీక్ష ఆపలేదు. ఫలితంగా ఆమె గృహనిర్బంధంలో కూడా ఉన్నారు. ఆమె మరెవ్వరోకాదు ఒకప్పటి బర్మా నేటి మైన్మార్ దేశంలోని హక్కులనేత ఆంగ్‌సాంగ్ సూక్యీ. 33 ఏళ్ల జైలు శిక్షను పలుదఫాలుగా తగ్గిస్తూ చివరకు ఆమెను గృహనిర్బంధంలో ఉంచాలని సైనిక ప్రభుత్వం నిర్ణయించింది. అయినా కూడా ఆమె బతికి ఉన్నారోలేదోనన్న అనుమానం స్వయంగా ఆయన కుటుంబమే వ్యక్తంచేస్తున్నారు. ఆమెను చివరిసారిగాచూసింది 2021లోనేనని ఇప్పటికీ ఆమె బతికి ఉన్నట్లు ప్రభుత్వం స్వయంగా చూపించాల్సిన అవసరం ఉందని, అప్పటినుంచి నేటివరకూ తమను తమ తల్లిని కలిసేందుకు కూడా మైన్మార్ జుంటా అనుమతించలేదంటూ ఆమె కుమారుడు కిమ్ ఆరిస్ చెప్పుకొచ్చారు. ప్రస్తుతం 80వ పడిలో ఉన్న ఆమె ఎదుట ఇద్దరు మిలిటరీ దుస్తుల్లో కూర్చుని ఉన్నఫోటోను మాత్రమే సర్కారు విడుదల చేసింది. అయితే ప్రపంచ వ్యాప్తంగా తనపై వస్తున్న ఒత్తిళ్లను తగ్గించుకునే యోచనతోనే మిన్ ఆంగ్ హ్లైయింగ్ ఆంగ్‌సాంగ్ సూకీని 33 ఏళ్ల జైలుశిక్షను కుదించి గృహనిర్బంధానికి మార్చినట్లు తెలుస్తోంది. అయితే ఆమెను నిజంగా గృహ నిర్బంధానికి తరలించారా లేదా అన్నది ఇప్పటికీ నిర్ధారణ కాలేదు. సరికదా ఆమె న్యాయవాదులకు కూడా సమాచారం లేదు. 2021లో వివిధ ఆరోపణలపై ఆమెను అదుపులోకి తీసుకున్న సైనిక ప్రభుత్వం ఆమెను అధికార దుర్వినియోగం, దేశద్రోహం వంటి అభియోగాలపై జైలుపాలు చేసింది. అప్పటి నుంచి ఆమె బాహ్య ప్రపంచానికి కనిపించిన సందర్భాలు లేవు. గతంలో 2021మే 24వ తేదీ మాత్రం ఆమెను కోర్టులో ఉన్నట్లుగా ఉన్న ఒక ఫోటో మాత్రం ప్రపంచానికి విడుదల చేసారు. ఇందులో భాగంగానే ఈ ఏడాది 1519 మంది క్షమాభిక్షను ప్రసాదించడం మైన్మార్‌లో పరిపాటిగా వస్తోంది. ఇపుడు సూక్యీకి ప్రసాదించడంలో ప్రత్యేకత ఏమీ లేదు. సుదీర్ఘ కాలంగా శిక్ష అమలులో ఉన్నందున ఆమెకు సైతం ఇతర తోటి ఖైదీల తరహాలోనే శిక్షను తగ్గించినట్లు తెలుస్తోంది. అంతకు రెండువారాల ముందే సూక్యీ ప్రభుత్వంలో అధ్యక్షుడుగా పని చేసిన విన్ మ్యింట్‌కు క్షమాభిక్ష ప్రసాదించి ఆయనను విడుదల చేసారు. మిలిటరీ గ్రిప్‌లో ఉన్నమైన్మార్‌లో గతనెల 10వ తేదీ జరిగిన ఎన్నికల్లో తిరిగి మిన్ ఆంగ్ హ్లైయింగ్ అధ్యక్షునిగా ఎన్నికయి పాలన బాధ్యతలు స్వీకరించారు. పూర్తి నిర్బంధం మధ్య జరిగిన ఈ ఎన్నికల విజయాన్ని అంతర్జాతీయ సమాజం గుర్తించకపోయినా హ్లైయింగ్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టారు. సామాజిక సమతుల్యత కోసం తమ ప్రభుత్వం రాజకీయ ఖైదీలకు క్షమాభిక్షలు ప్రవేశపెడుతుందని న్యాయం, శాంతి కార్యాచరణలు అమలుకు వస్తాయని అన్నారు. అందులో భాగంగానే సూక్యీ జైలుశిక్షను కాస్తా గృహనిర్బంధానికి మార్చినట్లు తెలుస్తోంది. మైన్మార్ రాజధానిలో ఉన్న కేంద్ర కారాగారం నాయ్‌పైథా నగరంలోని జైలు నుంచి ఆమెను గృహనిర్బంధానికి తరలించినట్లుగా చెపుతున్నారే కానీ ఎక్కడా ఆమె బయటకు కనిపించిన దాఖలాలులేవు. 2022లో అనేక నేరాలు ఆమెపై నమోదుచేసిన తర్వాత ఆమెను 33 ఏళ్లపాటు జైలు శిక్ష విధిస్తూ మిలిటరీ ప్రభుత్వం నిర్ణయించింది. ఆమెను ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన పదవుల నుంచి తొలగించి మొత్తం ప్రభుత్వాన్నే మిన్ ఆంగ్ హ్లైయింగ్ తిరుగుబాటుతో స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం ఆమెకిచ్చిన మినహాయింపుతో ఆమె జైలుశిక్ష గణనీయంగా తగ్గింది. మరో 13 ఏళ్లపాటు ఆమె శిక్షాకాలం గృహ



ఆంగ్‌సాంగ్‌సూక్యీ

నిర్బంధంలోనే కొనసాగుతుంది. అయితే ప్రభుత్వ పరంగా ప్రకటన వచ్చినా ఆమె ఎక్కడా బయటకు కనిపించలేదు. సైనిక ప్రభుత్వం అనుమతించలేదు. ఆమె ఆరోగ్యం క్షీణించిందని, లోబీపీ, మందకొడతనం, గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్న సూక్యీకి సరైన వైద్యం కూడా అందడం లేదని ఆమె తరపు న్యాయవాదులతోపాటు, ఆమె కుటుంబసభ్యులు స్వయంగా ఆమె తనయుడు సైతం ఆరోపించారు. ప్రస్తుతం లండన్‌లో ఉంటున్న ఆమె చిన్న కుమారుడు కిమ్ ఆరిస్ సైతం ఇదే అభిప్రాయం వ్యక్తం చేసారు. తమను ఇప్పటి వరకూ కలుసుకోనీయని సైనిక ప్రభుత్వం ఆమెకు సరైన వైద్యసాయం అందించడంలేదన్నది వాస్తవమే. జైలులో ఉన్న పరిస్థితులను బట్టి చూస్తుంటే ఆమె ఆరోగ్యం పూర్తిగా క్షీణించిందనే ఆందోళన అటు మైన్మార్ ప్రజల్లోను, ప్రజాస్వామ్యవాదుల్లోను వ్యక్తం అయింది. సాక్షాత్తూ ఐక్యరాజ్య సమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గ్యుటరెస్ సైతం సూక్యీ ఆరోగ్యంపట్ల ఆందోళన వ్యక్తం చేసారు. సైనిక ప్రభుత్వం పగ్గాలు చేపట్టినప్పటి నుంచి న్యాయసాయం, కుటుంబ సభ్యులు కూడా కలుసుకోకుండా కఠిన ఆంక్షలు అమలు చేసారు. మైన్మార్ స్వాతంత్య్రం కోసం పోరాడిన హీరో జనరల్ ఆంగ్‌సాన్ కుమార్తె అయిన సూక్యీ 1989 నుంచి 2010 వరకూ కూడా గృహనిర్బంధంలో కొనసాగారు. అహింసా మార్గంలో ఆందోళన నిర్వహించిన ఆమె చేసిన కృషికిగాను 1991లో ఆమెకు నోబెల్ పురస్కారం కూడా వరించింది. ఈ దశలో సూక్యీ జైలు శిక్షను గృహనిర్బంధానికి మార్పు చేయటాన్ని ఇప్పుడు ఆమె కుటుంబ సభ్యులు కూడా నమ్మలేకపోతున్నారు. ఎందుకంటే 2021నుంచి ఇప్పటివరకూ ఆమె బాహ్య ప్రపంచానికి కనిపించకుండా సైనిక సర్కారు చర్యలు తీసుకోవడమే. ఇప్పుడు ఆమె బతికి ఉన్నారని నిరూపించడానికి ఆమెను బాహ్య ప్రపంచానికి చూపించాల్సిన బాధ్యత కూడా మిన్ ఆంగ్ హ్లైయింగ్ సర్కారుపైనే ఉంది.

# కూలుతున్న భారతీయ అమెరికన్ల కలల సౌధం

డా. కావలి చెన్నయ్య

కష్టాల కన్నీళ్లను వేటితో కొలుస్తారో తెలియదు కానీ కొలమానముంటే అందరికంటే ఎక్కువ కష్టాల కన్నీళ్లు అమెరికాలోని భారతీయులకే. భారతీయుల అమెరికా ప్రయాణాన్ని పరిశీలించినట్లయితే,1635లో మన దేశం నుండి జేమ్స్ టౌన్, వర్జినియా, అమెరికాకు మొదట వలస పోయిన వ్యక్తి 'టామ్' (హెడ్ రైట్) అని నమోదు చేయబడింది. 1680లో భారత సంతతి వ్యక్తి పీటర్, ఐరిష్ మహిళలకు జన్మించిన మేరీ ఫిషర్ స్థిరనివాసం పొందినట్లు తెలుస్తుంది. 1790లో మద్రాస్‌కు చెందిన థామస్ మసాచూసెట్స్‌ను దర్శించాడాట.1910లో బొంబాయికి చెందిన బికాజి ఫ్రామ్జి బల్సారా అనే పార్శి తొలి సహజ పౌరసత్వం పొందిన భారతీయుడు. 17 ,18వ శతాబ్దాలలో చాలా మంది భారతీయులు నావికులుగా, బ్రిటిష్ అధికారులకి సేవకులుగా పనిచేసినప్పటికీ అధికారికంగా నమోదు చేయబడలేదు. మన దేశస్తులు ముఖ్యంగా వ్యక్తిగత స్వేచ్ఛ, అవినీతి రహిత సమాజం, మెరుగైన ఆర్థిక అవకాశాలు, ఉత్తమమైన జీవన ప్రమాణాలు, అధిక జీతాలు, ఉన్నత విద్య, టెక్నాలజీ,పరిశోధనలకు సంబంధించిన ఉన్నతమైన ప్రమాణాలు ఉన్న అమెరికా సంస్థలలో పని చేయడానికి వలస వెళుతున్నారు. అమెరికన్ డ్రీమ్, వృత్తిపరమైన నైపుణ్యాభివృద్ధి సాధించాలనే తపనతో, భారత్ లో ఉన్న విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాలలో ఉన్న అధిక పోటీ నుండి తప్పించుకొని, ఉత్తమ నైపుణ్యం కలిగిన ఐటీ, ఆరోగ్య సంరక్షణ, కార్మిక నిపుణులు విజయవంతమైన భవిష్యత్తును నిర్మించుకునేందుకు హెచ్1బి వీసాలను పయోగించుకొంటున్నారు. చదువు విషయానికొచ్చినప్పుడు భారతీయ విద్యార్థులు అమెరికా అగ్రశ్రేణి విశ్వవిద్యాలయంలో చదవాలని కోరికతో ఖర్చుకు వెనుదీయకుండా అష్ట కష్టాలు పడైనా సరే అమెరికా వెళ్లాలని ప్రయత్నాలు చేస్తూ కొందరు సఫలమైతే కొందరు విఫలమవుతున్నారు.అమెరికా వెళ్లి స్థిరపడిన భారతీయులు మన దేశంలోని వారి వారి కుటుంబాలకు చేయూతనిస్తూ, అమెరికా వెళ్లడానికి ప్రయత్నిస్తున్న మనవారికి సహాయ సహకారాలు అందిస్తూన్నారు. కష్టా నష్టాలను భరించి అమెరికా వెళ్లి అక్కడి స్థానికులచే అవమానానికి గురైనప్పటికీ కష్టపడి కర్తవ్యపతంగా పనిచేస్తూ సముచిత స్థానాన్ని సంపాదించుకుంటు అమెరికాలో పారిశ్రామికవేత్తలుగా, వ్యవస్థాపకులుగా అత్యంత విజయవంతమైన వలస సమూహాలలో ముఖ్యమైనదిగా ఉంటూ ప్రధానంగా టెక్నాలజీ ఫైనాన్స్,తయారీ రంగాలకు నాయకత్వం వహిస్తున్నారు. 16 ఫార్చున్500 కంపెనీలకు భారతీయ సీఈఓలు నాయకత్వం వహిస్తున్నారు. 72 యూనికార్న్ కంపెనీలకు భారతీయులు నేతృత్వం వహిస్తున్నారు. భారతీయ సంతతి కుటుంబాల సగటు ఆదాయం అత్యధికం 119000 అమెరికా డాలర్లు. రతన్ టాటా సహాయ సహకారాలతో శ్రీకాంత్ బోల్ల స్థాపించిన 'బోలాంట్ ఇండస్ట్రీ' పర్యావరణ అనుకూల ఉత్పత్తులను తయారుచేస్తుంది. షలబ్ కుమార్ వంటి వారు రాజకీయ, వ్యాపారాల రెండింటిలో ప్రావీణ్యమున్నది. 2026 నాటికి అమెరికాలో 54 లక్షల (అమెరికాలో జన్మించిన వలస వచ్చిన)కు పైగా భారత సంతతి ప్రజలు నివసిస్తున్నారు. ఇందులో భారతీయ సంతతి వలసదారులు 32 లక్షలకు పైగా,అమెరికా జనాభాలో 1.5 శాతం.సంఖ్యా, ఆర్థిక పరంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆసియా సమూహాలలో మనమొకరం. కాలిఫోర్నియా, టెక్సాస్, న్యూ జెర్సీ, న్యూయార్క్‌లలో భారత సంతతి ప్రజలెక్కువ. అమెరికాలో 10 శాతం భారతీయ వైద్యులే పనిచేస్తున్నారు. భారత సంతతికి చెందిన 11 శాతంయూనికార్న్ కంపెనీలకు భారతీ సంతతివారే వ్యవస్థాపకులు. అమెరికాలో మన వాళ్లు ఎంతగా రాణించినప్పటికీ వారు ఎన్నెన్నో సవాల్లెదుర్కొంటున్నారు. కార్నెగి నిర్వహించిన సర్వేలో అమెరికా వదలాలని అక్కడి భారత సంతతిలోని 40శాతం మంది కోరుకుంటున్నట్లు వెల్లడించింది. ఒకప్పుడు అమెరికాలో ఉద్యోగం సంపాదించడం, స్థిర నివాసం ఏర్పరచుకోవడం



భారతీయుల కల. కానీ ప్రస్తుతం ఆ కల నెమ్మదిగా చెదిరిపోతుంది. అగ్రరాజ్యంలో ఇక ఉండలేమని భారతీయ సంతతి వారి మనోవేదన, అక్కడి పరిస్థితులతో రోజురోజుకు వారిలో ఆందోళన, భయం పెరిగి, మేము తిరిగి భారత్‌కు వెళ్ళిపోవాలనుకుంటున్నారు. అక్కడి రాజకీయ, ఆర్థిక, సామాజిక పరిస్థితులే దీనికి కారణమని భావిస్తున్నారు. యుగవ్, కార్నెగి ఎండోమెంట్స్ సంస్థ 1000 మంది భారతీయులను సర్వేచేసి అభిప్రాయం సేకరించగా40శాతం భారతీయ అమెరికన్లు మళ్లీ మేము భారత్ వెళ్లిపోతామని వెల్లడించగా,14 శాతం మంది వెళ్లిపోవాలని తరచుగా ఆలోచిస్తున్నామని, 28 శాతం మంది అప్పుడప్పుడు అలా అనిపిస్తుందని చెప్పారు. ప్రస్తుతం అమెరికాలో జరుగుతున్న రాజకీయ పరిస్థితులు, ప్రభుత్వ విధానాలపై 58 శాతం మంది తీవ్ర అసంతృప్తి వెలిబుచ్చారు. పెరిగిన జీవన వ్యయాన్ని భరించలేకపోతున్నామని 54 శాతంమంది వెల్లడించారు. రోజురోజుకు వ్యక్తిగత భద్రత కష్టంగాఉందని 41శాతం మంది చెప్పారు. మొదటిసారి ట్రంప్ అధ్యక్షుడైనప్పుడు భారత పక్షపాతిగా భావించారు కానీ 2వసారి అధ్యక్షుడయ్యాక ఆర్థిక వ్యవస్థ నిర్వహణ, వలస విధానాలు, అంతర్జాతీయ సంబంధాల్లో ప్రభుత్వ నిర్ణయాలు తమకు నచ్చడం లేదని 71 శాతం మంది ప్రకటించారు. ట్రంప్ జాత్యహంకార మాటలు మాట్లాడుతూ, అమెరికన్స్ ఫస్ట్ అంటు, మేక్ అమెరికా గ్రేట్ అగైన్( అమెరికాను మళ్ళీ గొప్పగా చేయండి) అని రకరకాలుగా ప్రకటనలు చేస్తూ అమెరికన్లనే కాకుండా అమెరికాలో స్థిరపడిన, పనిచేస్తున్న, చదువుకుంటున్న విదేశీయులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాడు. ట్రంపుకు అమెరికా ప్రజల్లో 38శాతంగా ఉన్న ఆదరణ 30కి పడిపోయిందని విశ్లేషకులు చెప్పగా, రాయిటర్స్ ఇప్సోస్35 , ఏపీఎన్ఓఆర్సి సెంటర్ ఫర్ పబ్లిక్ అఫైర్స్ రీసెర్చ్35 , స్ట్రెంత్ ఇన్ నంబర్స్ వెరా సైట్33 వరకు క్రమంగా ప్రజల మద్దతు తగ్గిపోయిందని ఈ సంస్థలు విడివిడిగా నిర్వహించిన సర్వేలలో తెలిపాయి.ఇరాన్‌తో యుద్ధం, పడిపోతున్న ఆర్థిక వ్యవస్థల నిర్వహణ, వలసలు వంటి విషయాలలో ట్రంప్‌తీసుకుంటున్న నిర్ణయాలకుప్రజామోదము లేదని పైన పేర్కొన్న 3సంస్థలు తెలిపాయి. ముఖ్యంగా ఆర్థిక విషయాలలో అమెరికన్లకు అసంతృప్తి అధికంగా ఉన్నట్లున్నది. అమెరికా ఆర్థిక వ్యవస్థ దారుణంగా ఉందని ఈ వారం ప్రారంభంలో తాను నిర్వహించిన సర్వేలో పాల్గొన్న 70 శాతం మంది ప్రజలు తెలిపినట్లు ఏపీ ఎన్నోఆర్ సి సంస్థ వెల్లడించింది. దేశం సరైన పంతాలో సాగడం లేదని 72 శాతంమంది అభిప్రాయపడినట్లు తెలియజేసింది. ఆర్థిక వ్యవహారాల నిర్వహణలో మార్చి నెలలో ట్రంప్ కున్న ప్రజాదరణ 38శాతం కానీ ఏప్రిల్ వచ్చేసరికి అది కాస్త 30శాతంపడిపోయింది. జీవనవ్యయం విషయంలో కేవలం 23శాతం మంది మాత్రమే ట్రంప్‌కు అనుకూలం, 76 శాతం మంది ట్రంప్ విధానాలను వ్యతిరేకిస్తున్నారు. వీటికి తోడు ఈ మధ్యనే జార్జియా, ఫ్లోరిడా రాష్ట్రాలలో కార్చిచ్చు కమ్మేసింది. భారత్ నుండి అమెరికా వెల్లే వారిని అన్ని మాఫియా గ్యాంగ్‌స్టర్ల కంటే ఎక్కువ నష్టంచేసి, మనల్ని ద్వితీయ శ్రేణిపౌరులుగా చేసి దోచుకొని అమెరికాకు నష్టం కలిగిస్తున్న 'గ్యాంగ్ స్టర్స్ విత్ లాప్టాప్' అని, మైకేల్ శావెజ్ అనే రాజకీయ విశ్లేషకుడు చేసిన పాడ్ కాస్ట్‌ను ట్రంప్ సొంత సామాజిక మాధ్యమమైన ట్రూత్ సోషల్‌లో రీపోస్ట్ చేశాడు. దాదాపు 10నిమిషాల నిడివిగల వీడియోలో జాత్యహంకారపూరిత వ్యాఖ్యలు చేశాడు. మన జెండాను కాలరాశారు. చైనా/ఇండియా నుండి తమ పిల్లలు అమెరికాలో పుట్టేలా 9నెలల గర్భంతో ఉన్న వారిని క్కడికి తీసుకొస్తున్నారు. ఫలితంగా ఇక్కడ పుట్టి అమెరికా జాతీయ పౌరులైపోతున్నారు.ఇక్కడ పుట్టిన బేబీకి చట్టబద్ధంగాపొందే పౌరసత్వాన్ని ఆధారంగా చేసుకుని తమ మొత్తం కుటుంబాన్ని భారత్/చైనా నుండో,భూగోళంపైనున్న మరోనరకప్రాయ దేశం నుండి ఇక్కడికి తెస్తారు. అందుకే 'అమెరికా బర్త్ రైట్ సిటిజన్షిప్' (జన్మతః పౌరసత్వచట్టం)లో మార్పు చేయాలని, ఈ అంశాన్ని కోర్టుకు వదిలేయకుండా జాతీయ స్థాయిలో రెఫరండం(ప్రజాభిప్రాయ సేకరణ) చేయాలని, ఇంటర్నెట్ టీవీ మొబైల్ ఫోన్ విమానాలు లేనప్పుడు ఆ పరిస్థితుల కనుగుణంగా రాసిన అమెరికా రాజ్యాంగాన్ని సవరించాలని పేర్కొన్నాడు.ఎంతో కష్టపడి ఎన్నోకలలతో అమెరికా వెళ్ళిన భారతీయుల మేధావుల విజ్ఞానాన్ని మన దేశాభివృద్ధికి ఉపయోగించుకునేటట్లు అవకాశాలు కల్పించాలి.

# ఇరాన్ అణ్వస్త్ర తయారీని ఆపాం

## యుద్ధం చేయకపోతే ఇజ్రాయెల్, ఐరోపా దేశాలు పేలిపోయేవి

### సైనిక చర్యతో ఇరాన్ నాశనమైంది: ట్రంప్



**ఫ్లోరిడా, మే 2:** యుద్ధం తర్వాత ఇరాన్ నాయకత్వం బలహీనపడిందని, ఆ దేశ సైనిక సామర్థ్యం గణనీయంగా క్షీణించిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. ఫ్లోరిడాలో ఆయన మాట్లాడుతూ, ఇరాన్‌పై దాడి చేసి ఆ దేశం అణ్వాయుధాలను తయారు చేయకుండా అడ్డుకున్నామని తెలిపారు. ఒకవేళ తాను అలా చేయకపోయి ఉంటే పశ్చిమాసియా, యూరప్ దేశాలు ముక్కలైపోయేవని అన్నారు. ఇరాన్ అనే అందమైన దేశంలోకి వెళ్లి వారి వద్ద అణ్వాయుధాలు లేవని మనం నిర్ధారించుకోవాలని వ్యాఖ్యానించారు. బీ2 బాంబర్లతో వారిని అడ్డుకున్నట్లు చెప్పారు. అమెరికా అలా చేయకపోయి ఉంటే వారి వద్ద అణ్వాయుధాలు ఉండేవని, అప్పుడు ఇజ్రాయెల్, పశ్చిమాసియాతో సహా యూరప్ దేశాలు ముక్కలుగా పేలిపోయి ఉండేవని వ్యాఖ్యానించారు. తమ సైనిక చర్యతో ఇరాన్ నాశనమైందని అన్నారు. వారి వైమానిక, నౌకాదళాలు పూర్తిగా తుడిచిపెట్టుకుపోయాయని అన్నారు.

శాంతిచర్చలు తాను ఆశించినవిధంగా జరగడం లేదని అన్నారు. యుద్ధం కారణంగా చమురు ధరలు పెరిగాయని, యుద్ధం ఆగిపోతే తగ్గుతాయని పేర్కొన్నారు. ఇరాన్ తమతో ఒప్పందం చేసుకోవాలనుకుంటోందని అయితే వారి ప్రతిపాదన సంతృప్తికరంగా లేదని అన్నారు. ఇరాన్‌లో నాయకత్వం విచ్ఛిన్నం అయిందని, అక్కడ నాలుగైదు గ్రూపులు ఉన్నాయని, అందుకే ఒప్పందం విషయంలో గందరగోళం నెలకొందని అన్నారు.

ఇరాన్ అనే అందమైన దేశంలోకి వెళ్లి వారి వద్ద అణ్వాయుధాలు లేదని మనం నిర్ధారించుకోవాలని ట్రంప్ చెప్పారు. బీ2 బాంబర్లతో వారిని అడ్డుకున్నామని, ఒకవేళ తాము అలా చేయకపోయిఉంటే వారి వద్ద అణ్వాయుధం ఉండేదని, ఇజ్రాయెల్, పశ్చిమాసియాతో సహా ఐరోపా దేశాలు ముక్కలు ముక్కలుగా పేలిపోయి ఉండేవని అన్నారు.

ఇరాన్ నాయకత్వం బలహీనపడిందని, ఆ దేశ సైనిక సామర్థ్యం గణనీయంగా క్షీణించిందని తెలిపారు. తమ సైనిక చర్యతో ఇరాన్ నాశనమైందని, వారి వైమానిక, నౌకాదళాలు పూర్తిగా తుడిచిపెట్టుకుపోయాయని చెప్పారు. శాంతిచర్చలు తాను ఆశించినవిధంగా జరగకపోవడంపై ట్రంప్ అసహనం వ్యక్తంచేశారు. యుద్ధం కారణంగా అంతర్జాతీయంగా నెలకొన్న ఇంధన సంక్షోభంపై మాట్లాడారు. పెట్రోల్ ధరలు ఎక్కువగా ఉన్నాయని, యుద్ధం ముగిసిన వెంటనే పెట్రోల్ ధరలు తగ్గుతాయని అన్నారు.

ఇరాన్ తమతో ఒప్పందం చేసుకోవాలనుకుంటున్నా కానీ వారి ప్రతిపాదన సంతృప్తిగా లేదని చెప్పారు. హార్మూజ్ జలసంధి లో ఇరాన్ ఓడరేవులపై అమెరికా దిగ్బంధనం కొనసాగుతోంది. ఆ దేశానికి చెందిన నౌకలను యూఎస్ దళాలు స్వాధీనం చేసుకున్నాయని అన్నారు. ఇరాన్‌పై దిగ్బంధనాన్ని అమలు చేయడంలో యూఎస్ నౌకాదళాలు సముద్రపు దొంగల్లా పని చేస్తాయని అన్నారు. ఇరాన్‌పై కొనసాగుతున్న దిగ్బంధనం అమెరికాకు మంచి వ్యాపారమని ట్రంప్ అన్నారు.

తాము నౌకలను సీజ్ చేశామని, సరకు, చమురును స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఇది అత్యంత లాభదాయకమైన వ్యాపారమని, తాము పైరేట్స్ లాంటి వాళ్లమని వ్యాఖ్యానించారు. తాము ఇరాన్‌తో ఆటలు ఆడటం లేదని, ఈ విషయంలో చాలా సీరియస్‌గా ఉన్నామని అన్నారు. అమెరికా దిగ్బంధనంవల్ల ఇరాన్‌కు దాదాపు 4.8 బిలియన్ డాలర్ల (భారత కరెన్సీలో రూ.45 వేల కోట్లకుపైగా) నష్టం వాటిల్లినట్లు పెంటగాన్ అంచనావేసిందన్నారు. దిగ్బంధనం అమల్లోకి వచ్చినప్పటి నుంచి చమురుతో సహా ఇతర నిషేధిత సరకులను రవాణా చేసేందుకు ప్రయత్నించిన 40 కిపైగా నౌకలను యూఎస్ దళాలు దారి మళ్లించాయన్నారు. దాంతో సుమారు 53 మిలియన్ బ్యారెళ్ల ఇరాన్ ముడి చమురు తీసుకెళ్తున్న 31 ట్యాంకర్లు గల్ఫ్‌లోనే నిలిచిపోయాయని పేర్కొన్నది.

# మమతకు బిగ్ షాక్

## ఇసి సర్క్యులర్‌కు సుప్రీం కోర్టు గ్రీన్ సిగ్నల్



**న్యూఢిల్లీ, మే 2:** పశ్చిమ బెంగాల్‌లో ఓట్ల లెక్కింపు ప్రక్రియపై తలెత్తిన వివాదంలో టిఎంసి అధినేత్రి, ముఖ్య మంత్రి మమతా బెనర్జీకి సుప్రీం కోర్టులో ఎదురు దెబ్బ తగిలింది. ఓట్ల లెక్కింపునకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల (పిఎస్‌యు) ఉద్యోగులను మాత్రమే నియమిస్తూ ఎన్నికల సంఘం జారీచేసిన సర్క్యులర్ నిబంధనలకు విరుద్ధం కాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

లెక్కింపు సిబ్బందిని ఒకే వర్గం, అంటే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల నుంచే ఎంపిక చేసే స్వేచ్ఛ ఎన్నికల సంఘానికి ఉందని న్యాయస్థానం పేర్కొంది. అందువల్ల ఆ సర్క్యులర్‌ను తప్పు అని చెప్పలేమని తేల్చిచెప్పింది. అదే సమయంలో, ఏప్రిల్ 13న జారీ చేసిన సర్క్యులర్‌నే అమల్లో ఉంచాలని సుప్రీంకోర్టు వెల్లడించింది. ఓట్ల లెక్కింపు సమయంలో అక్కడ తృణమూల్ కాంగ్రెస్ ప్రతినిధులు కూడా ఉంటారని తెలిపింది. ఈ నేపథ్యంలో టిఎంసి దాఖలు చేసిన పిటిషన్‌పై ఇకపై అదనపు ఆదేశాలు అవసరం లేదని కోర్టు పేర్కొంది. ఓట్ల లెక్కింపులో కేవలం కేంద్ర ప్రభుత్వ సిబ్బందినే నియమించాలని ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయాన్ని సవాలు చేస్తూ మమతా బెనర్జీ సుప్రీంకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఈ తీర్పును ప్రతిపక్ష బిజెపి, అధికార టిఎంసి స్వాగతించింది. అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ప్రతి అంశాన్ని రాజకీయం చేస్తూ, న్యాయస్థానాలకెక్కడం తృణమూల్ కాంగ్రెస్‌కు, ఆ పార్టీ అధినేత్రి మమతకు నిత్యకృత్యమైందని బిజెపి పశ్చిమబెంగాల్ అధ్యక్షుడు సమిక్ భట్టాచార్య దుయ్యబట్టారు. ప్రజాస్వామ్యంలో వ్యవస్థలపై నమ్మకం చాలా ముఖ్యమని అభిప్రాయపడ్డారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును భట్టాచార్య స్వాగతించారు. సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను తృణమూల్ కాంగ్రెస్ స్వాగతిస్తూ, కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌కు ఎదురుదెబ్బ అని ఒక ప్రకటనలో పేర్కొంది. తమ వాదనను సుప్రీంకోర్టు సమర్థించిందని తెలిపింది.

# హత్యకేసు ఎమ్మెల్యేపై అనర్హత వేటు!



**బెంగళూరు, మే 2:** హత్య కేసులో దోషిగా నిర్ధారణ అయిన కాంగ్రెస్ ఎమ్మెల్యే వినయ్ కులకర్ణికి ఇటీవల బెంగళూరులోని ప్రజా ప్రతినిధుల కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. దాంతో కర్ణాటక అసెంబ్లీ సెక్రెటరీ వినయ్ కులకర్ణిపై అనర్హత వేటువేశారు. క్రిమినల్ కేసులో శిక్షపడినందుకు వినయ్ కులకర్ణి శాసన సభ సభ్యత్వాన్ని రద్దు చేస్తున్నట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. శిక్ష ఖరారైన ఏప్రిల్ 15 నుంచి ఆరేళ్లపాటు ఆయనపై అనర్హత వేటు అమల్లో ఉంటుందని తెలిపారు. ఒకవేళ పైకోర్టు శిక్షపై స్టే విధించినా, లేదంటే శిక్షను రద్దుచేసినా అతనిపై ఆరేళ్ల తర్వాత నిషేధం తొలగిపోతుందని అసెంబ్లీ సెక్రెటరీ తన ప్రకటనలో స్పష్టంచేశారు. లేదంటే శిక్షాకాలం పూర్తయ్యేవరకు, ఆపైన ఆరేళ్లపాటు ఆయనపై అనర్హత వేటు కొనసాగుతుందని పేర్కొన్నారు. అంటే ఆయన శిక్ష పూర్తిచేసుకుని జైలు నుంచి విడుదలైన తర్వాత కూడా ఆరేళ్లపాటు ఎమ్మెల్యేగా పోటీ చేయడానికి అనర్హుడని కోర్టు స్పష్టం చేసింది. ధార్వాడ్ అసెంబ్లీ నియోజక వర్గం నుంచి కర్ణాటక అసెంబ్లీ ప్రాతినిధ్యం వహిస్తున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే వినయ్ కులకర్ణికి బీజేపీ నేత యోగేష్ గౌడ హత్య కేసులో యావజ్జీవ కారాగార శిక్షపడింది. యోగేష్ గౌడ 2016లో హత్యకు గురయ్యారు. ఈ హత్య కేసులో దోషులుగా తేలిన అందరికీ బెంగళూరు లోని ప్రజాప్రతినిధుల కోర్టు ఏప్రిల్ 15న శిక్షలు ఖరారు చేసింది. వినయ్ కులకర్ణికి యావజ్జీవ కారాగార శిక్ష విధించింది.

# కులం పేరుతో విభజన వద్దు

## కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ సంచలన వ్యాఖ్యలు



**నాగ్‌పూర్, మే 2:** "ఎవరు కులం గురించి మాట్లాడినా తన్నులు పడతాయని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఘాటుగా స్పందించారు. నాగ్‌పూర్‌లో నిర్వహించిన అంతర్జాతీయ కార్మిక దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న గడ్కరీ, మరోసారి తనదైన శైలిలో కుల రాజకీయాలపై తీవ్ర విమర్శలు గుప్పించారు. సమాజాన్ని కుల, మతాల పేరుతో విభజించే నాయకులకు హెచ్చరిక జారీ చేస్తూ, ఇలాంటి వ్యాఖ్యలను సహించమని స్పష్టం చేశారు. అభివృద్ధికి కులమతాల అడ్డుగోడలు ఉండవని గడ్కరీ పేర్కొన్నారు. ప్రభుత్వం అందించే గ్యాస్, పెట్రోల్, డీజిల్ వంటి సౌకర్యాలు హిందువులకు ఏ ధరకు అందుతాయో, ముస్లిములకూ అదే ధరకు అందుతాయని గుర్తుచేశారు.

అభివృద్ధి ఫలాలు అందరికీ సమానంగా లభిస్తున్న వేళ కుల రాజకీయాలకు స్థానం లేదని తేల్చిచెప్పారు. ఈ సందర్భంగా రాజకీయాల్లో కనిపిస్తున్న ద్వంద్వ వైఖరిని కూడా ఆయన ఎండగట్టారు. బహిరంగ వేదికలపై కులాల గురించి మాట్లాడే కొందరు నేతలు, వ్యక్తిగతంగా తనను కలిసినప్పుడు మాత్రం తమ కుటుంబ సభ్యులకు టిక్కెట్లు ఇప్పించమని అడుగుతారని విమర్శించారు. ఇలాంటి ద్వంద్వ ప్రవర్తన గల నాయకులను ప్రజలు ఇప్పటికే గుర్తించారని వ్యాఖ్యానించారు. తాను ఎప్పుడూ నిజాయితీగా, నేరుగా మాట్లాడతానని గడ్కరీ తెలిపారు. తాను చెప్పిన పనిని చేయలేదని ప్రశ్నించే ధైర్యం ఎవరికీ లేదని విశ్వాసం వ్యక్తం చేశారు. ఇక దేశ నిర్మాణంలో కార్మికుల పాత్రను కూడా ఆయన ప్రశంసించారు. దేశ ప్రగతి కేవలం యంత్రాల వల్ల కాకుండా, లక్షలాది కార్మికుల శ్రమ ఫలితమేనని అన్నారు. రహదారులు, భవనాలు, నీటిపారుదల ప్రాజెక్టులు కార్మికుల కష్టం వల్లే సాధ్యమయ్యాయని కొనియాడారు. దేశాభివృద్ధికి వెన్నెముకలైన కార్మికులకు తగిన గౌరవం, అవకాశాలు కల్పించడం ద్వారా వారి జీవన ప్రమాణాలను మెరుగుపర్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని గడ్కరీ స్పష్టం చేశారు.

# విద్రోహచర్యల అభియోగంపై ఇద్దరికి ఉరి శిక్ష అమలుచేసిన ఇరాన్

**టెహ్రాన్,మే 2:** యుద్ధ సమయంలోనూ ఇరాన్ తన దేశంలో విద్రోహచర్యలపై ఉక్కుపాదం మోపుతోంది. ఇజ్రాయెల్‌కు గూఢచర్యం చేస్తున్నా రనే ఆరోపణలపై ఇద్దరు వ్యక్తుల్ని ఇరాన్ ప్రభుత్వం ఉరితీసింది. శనివారం ఈ ఘటన జరిగింది. సెంట్రల్ ఇస్ఫాహాన్ ప్రావిన్స్ పరిధిలోని నటాంజ్ న్యూక్లియర్ సైట్ వద్ద యగౌబ్ కరింపోర్, నాజర్ బకర్జాదే అనే ఇద్దరు వ్యక్తుల్ని ఉరితీసినట్లు స్థానిక మీడియా తెలిపింది. ఈ ఇద్దరూ ఇజ్రాయెల్‌కు ఇరాన్‌కు సంబంధించిన రహస్య సమాచారం చేరవేశారని ఇరాన్ ఆరోపించింది. ఇజ్రాయెల్‌కు చెందిన గూఢచార సంస్థ మొసాద్. ఈ సంస్థకు ఈ ఇద్దరూ ఇరాన్ ప్రభుత్వానికి సంబంధించిన వివరాలు, కీలక ప్రదేశాలు, మత సంబంధమైన ప్రదేశాలతోపాటు న్యూక్లియర్ ప్లాంట్‌కు చెందిన సమాచారాన్ని చేరవేశారని ఇరాన్ ప్రభుత్వం ఆరోపించింది. ఈ సమాచారాన్ని వీరు సేకరించి, మొసాద్ అధికారులకు అందజేసినట్లు ప్రభుత్వం పేర్కొంది. ఈ నేరానికి గాను ఇరాన్ కోర్టు ఇద్దరికి మరణశిక్ష విధించింది. దీంతో శనివారం ఇరువురిని ఉరితీసింది. రెండు వారాల వ్యవధి లోనే ఇలా స్థానికుల్ని ఉరితీయడం ఇది రెండో సారి. గత ఏప్రిల్ 20న కూడా మొహమ్మద్ మాసోమ్ షాహి, హమెద్ వాలిది అనే ఇద్దరు వ్యక్తుల్ని కూడా ఇదే గూఢచర్యం కింద ఇరాన్ ప్రభుత్వం ఉరితీసింది. వీరు ఇరాక్‌తోపాటు విదేశాల్లో శిక్షణ పొంది, ఇరాన్‌లో గూఢచర్యం చేస్తూ, మొసాద్‌కు సమాచారం అందిస్తున్నారని ఇరాన్ ఆరోపించింది. వీరిపై వచ్చిన ఆరోపణల్ని వీరు పని చేసే మొజాహెదిన్ సంస్థ ఖండించింది. మరోవైపు ఇరాన్‌లో అమలవుతున్న మరణ శిక్షలపై ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల సంఘం ఆందోళన వ్యక్తం చేసింది. గత ఫిబ్రవరి 28న యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు ఇరాన్ ప్రభుత్వం కనీసం 21 మందిని ఉరితీసిందని పేర్కొంది. అలాగే, భద్రతా కారణాలతో నాలుగు వేల మందికిపైగా అరెస్టు చేసినట్లు తెలిపింది. కానీ ఇరాన్ నుంచి అధికారిక ప్రకటన మాత్రం రాలేదు.

# తమిళనాట నిలిచిన చిత్రాల షూటింగ్

## రెవెన్యూ షేరింగ్ అస్త్రం తెచ్చిన నిర్మాతల సంఘం

### అబ్బెబ్బే.. వీలుకాదంటున్న నడిగర్ సంఘం



**చెన్నై,మే 2:** కోలీవుడ్‌లో మొదలైన ఈ రెవెన్యూ షేరింగ్ చిచ్చు ఇప్పుడు టాలీవుడ్‌లో కూడా హాట్ టాపిక్ అయ్యేలా ఉంది. సినిమా హిట్ అయినా, ఫ్లాప్ అయినా నిర్మాత మాత్రం నష్టపోకూడదనే ఉద్దేశంతో తమిళ నిర్మాతలు తీసుకున్న ఈ నిర్ణయం నిజంగా సాహసోపేతమే. తమిళ చిత్ర పరిశ్రమలో (కోలీవుడ్) షూటింగ్స్ నిలిచిపోయాయి. నిర్మాతలు ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభం నేపథ్యంలో తమిళ ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ (టిఎఫ్‌పిఎ) సంచలన నిర్ణయం తీసుకుంది. భారీ పారితోషికాల భారం నుంచి నిర్మాతలను గట్టెక్కించేందుకు "రెవెన్యూ షేరింగ్" అనే కొత్త అస్త్రాన్ని తెచ్చారు. ప్రస్తుతం ఉన్న పద్ధతి ప్రకారం సినిమా ఫలితంతో సంబంధం లేకుండా నటులు, దర్శకులు కోట్లలో పారితోషికం తీసుకుంటున్నారు. సినిమా ఫ్లాప్ అయితే నిర్మాత నిండా మునిగిపోతున్నాడు. దీనికి చెక్ పెట్టేందుకు నిర్మాతలు కొత్త డిమాండ్ చేస్తున్నారు. నటులు, దర్శకులకు ముందుగా పారితోషికం ఇవ్వకుండా, సినిమా విడుదలయ్యాక వచ్చిన లాభాల్లో వాటాలు మాత్రమే ఇవ్వాలనేది వాళ్ల డిమాండ్. సినిమా విజయం సాధిస్తే అందరికీ లాభాలు వస్తాయి, ఒకవేళ పరాజయం పాలైతే కేవలం నిర్మాత మాత్రమే కాకుండా అందరూ ఆ నష్టాన్ని పంచుకోవాలి. నిర్మాతల ఈ నిర్ణయంతో సుమారు 30కి పైగా చిత్రాల షూటింగ్స్ నిలిచిపోయాయి. పారితోషికాల నియంత్రణ ఉంటేనే కోలీవుడ్ మనుగడ సాధ్యమని టిఎఫ్‌పిఎ బలంగా నమ్ముతోంది. అయితే, ఈ ప్రతిపాదనపై నటుల సంఘం (నడిగర్ సంగం) అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. పారితోషికం కాకుండా కేవలం లాభాల్లో వాటా అంటే నటులపై ఒత్తిడి పెరుగుతుందని వారు వాదిస్తున్నారు.

ఒకవేళ తమిళనాట ఈ రెవెన్యూ షేరింగ్ మోడల్ సక్సెస్ అయితే, ఇది కేవలం కోలీవుడ్‌కే పరిమితం కాకపోవచ్చు. మన టాలీవుడ్ మరియు బాలీవుడ్‌లో కూడా నిర్మాతలు ఇదే బాటలో నడిచే అవకాశం ఉందని చిత్రరంగ నిపుణులుభావిస్తున్నారు. పారితోషికం రూపంలో కాకుండా వాటా రూపంలో ఆదాయం తీసుకోవడం అనేది ఇండియన్ సినిమా భవిష్యత్తును మార్చే అంశంగా కనిపిస్తోంది.

# బాంబులు తొలగిస్తుండగా పేలుడు

## 14 మంది ఐఆర్జీసి గార్డులు మృతి

**టెహ్రాన్,మే 2:** ఇరాన్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. దేశ వాయవ్య ప్రాంతంలోని జాంజన్ ప్రావిన్స్‌లో సంభవించిన ఓ పేలుడులో 14 మంది ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ సభ్యులు మరణించగా, మరో ఇద్దరు గాయపడ్డారు. ఇటీవలి యుద్ధంలో పేలకుండా మిగిలిపోయిన బాంబులను తొలగిస్తుండగా ఈ దుర్ఘటన జరిగింది.

జాంజన్ నగర సమీపంలో ఐఆర్‌జీసీకి చెందిన బాంబు నిర్వీర్య బృందాలు క్లియరెన్స్ ఆపరేషన్ చేపట్టాయి. ఈ ఏడాది జరిగిన యుద్ధంలో అమెరికా, ఇజ్రాయెల్ దళాలు జారవిడిచిన క్లస్టర్ బాంబులు, ఇతర పేలుడు పదార్థాలను గుర్తించి, నిర్వీర్యం చేసే పనిలో ఉండగా ప్రమాదవశాత్తు ఓ బాంబు పేలింది. మరణించిన వారిలో అత్యంత అనుభవజ్ఞులైన, ప్రత్యేక శిక్షణ పొందిన సిబ్బంది ఉన్నారని ఐఆర్‌జీసీ అన్సార్ అల్‌మహదీ యూనిట్ ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ యేడాది ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా ఇరాన్‌పై వైమానిక దాడులు ప్రారంభించడంతో యుద్ధం మొదలైంది. దీనికి ప్రతిగా ఇరాన్ కూడా ఇజ్రాయెల్, ఇతర ప్రాంతాల్లోని అమెరికా స్థావరాలపై దాడులు చేసింది. అనంతరం ఏప్రిల్ 8న కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చింది.

యుద్ధం ముగిసినప్పటికీ, పేలని బాంబుల ముప్పు ఇంకా తొలగిపోలేదని ఈ ఘటన స్పష్టం చేస్తోంది. కాల్పుల విరమణ తర్వాత ఐఆర్‌జీసీకి ఇదే అతిపెద్ద నష్టం. ఇప్పటివరకు దాదాపు 15,000కు పైగా పేలని బాంబులను నిర్వీర్యం చేసినట్లు ఐఆర్‌జీసీ తెలిపింది. జాంజన్ ప్రావిన్స్‌లోనే సుమారు 1,200 హెక్టార్ల వ్యవసాయ భూములు ఈ బాంబుల కారణంగా ప్రమాదకరంగా మారాయని అధికారులు వెల్లడించారు.

# పశ్చిమాసియా దేశాలతో అమెరికా ఆయుధ వ్యాపారం

## రూ.81 వేల కోట్లకుపైగా ఆయుధాల సరఫరా



**వాషింగ్టన్, మే 2:** అమెరికా, ఇజ్రాయెల్ దేశాలకు ఇరాన్‌తో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ అమెరికా ఆయుధ వ్యాపారం ముమ్మరం చేసింది. ఇజ్రాయెల్ సహా పశ్చిమాసియా దేశాలకు భారీగా ఆయుధాలను విక్రయించేందుకు అమెరికా సిద్ధమైంది. ఒకవైపు కాల్పుల విరమణ ఒప్పందం అమలవుతుండగానే ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. ఇజ్రాయెల్, కువైట్, ఖతార్, యుఎఇ లాంటి మిత్ర దేశాలకు దాదాపు 8.6 బిలియన్ డాలర్లకుపైగా (భారత కరెన్సీలో రూ.81 వేల కోట్లకుపైగా) విలువైన ఆయుధాల విక్రయానికి యూఎస్ విదేశాంగశాఖ ఆమోదం తెలిపింది. ఈ ప్యాకేజీలో అనేక అధునాతన సైనిక పరికరాలు ఉన్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ ప్యాకేజీ నుంచి ఖతార్ నాలుగు బిలియన్ డాలర్ల విలువైన పేట్రియాట్ వాయు, క్షిపణి రక్షణ వ్యవస్థలతోపాటు అత్యంత కచ్చితత్వంతో కూడిన లక్ష్యాలను ఛేదించగల ఆయుధ వ్యవస్థలను అందుకో నుంది. కువైట్‌కు సుమారు 2.5 బిలియన్ డాలర్ల ఆయుధాలు వెళ్లనున్నాయి. ఈ క్రమంలోనే ఇజ్రాయెల్, యూఏఈలకు గైడెడ్ రాకెట్ లాంఛర్లను యూఎస్ విక్రయించనుంది. సాధారణంగా ఆయుధ విక్రయాలను అమెరికా కాంగ్రెస్ రివ్యూ చేస్తుంది. అయితే ట్రంప్ యంత్రాంగం అత్యవసర అధికారాలను ఉపయోగించి త్వరగా ఈ విక్రయాలు జరపాలని నిర్ణయించింది. ఈ చర్యను యూఎస్ విదేశాంగ మంత్రి మార్కో రూబియో సమర్థించుకున్నారు.

# మా అధినేత విజయ్‌దే తమిళనాడు సిఎం పీఠం!

## పార్టీ చీఫ్ కోఆర్డినేటర్ సెంగొట్టియన్



**చెన్నై, మే 2:** తమిళనాడు రాష్ట్రానికి కాబోయే ముఖ్యమంత్రి టివికె అధ్యక్షుడు విజయేనని ఆ పార్టీ ఎగ్జిక్యూటివ్ చీఫ్ కోఆర్డినేటర్ కెఎ సెంగొట్టయ్యన్ చెప్పారు. ఈ ఎన్నికల్లో విజయ్ నేతృత్వంలోని తమ టివికె పార్టీ 234 స్థానాలకుగాను 180 నుంచి 200 నియోజకవర్గాల్లో గెలువబోతున్నదని ఆయన ధీమా వ్యక్తంచేశారు. రాష్ట్రంలో ఏ పార్టీ కూడా మెజారిటీ సాధించదనే పరిస్థితి ఉండదని, తాము మెజారిటీ స్థానాలు గెలిచి సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్నామని చెప్పారు. ఎన్నికల ఫలితాల అనంతరం కూడా ఏ పార్టీతోనూ పొత్తులు ఉండవని ఆయన అన్నారు. తమ నాయకుడు విజయ్ దూరదృష్టితో పాలన అందిస్తారని సెంగొట్టయ్యన్ చెప్పారు. 2026 ఎన్నికల విజయం తమకు చారిత్రాత్మకమైనదని అన్నారు. విజయ్ రాత్రనక, పగలనక కష్టపడ్డారని, ఎన్నో పరీక్షలను ఎదుర్కొన్నారని, మే 4న విడుదలయ్యే ఎన్నికల ఫలితాల్లో విజయ్ శ్రమకు ఫలితం దక్కబోతోందని వ్యాఖ్యానించారు. ఎన్నికల అనంతరం పొత్తు వార్తలను ఆయన కొట్టిపారేశారు. తమకు స్పష్టమైన మెజారిటీ వస్తుందని, ఏ పార్టీతో పొత్తు పెట్టుకోబోమని అన్నారు. ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే పార్టీ తిరిగి అధికారంలోకి వస్తుందని మెజారిటీ ఎగ్జిట్ పోల్ సర్వేలు తెలిపాయి. అయితే విజయ్ ఈ ఫలితాల అనంతరం కింగ్ మేకర్‌గా నిలుస్తారని టుడేస్ చాణక్య, యాక్సిస్ మై ఇండియా అంచనా వేశాయి. అన్నాడీఎంకే నేతృత్వంలోని ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చే అవకాశం లేదని దాదాపు అన్ని ఎగ్జిట్ పోల్స్ తెలిపాయి. ఈ క్రమంలో సెంగొట్టయన్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# అమెరికా మళ్లీ యుద్ధానికి రావొచ్చు...

## మేం అన్నింటికీ సిద్ధమే: ఇరాన్





**టెహ్రాన్, మే 2:** అమెరికా, ఇజ్రాయెల్ తమ దేశంపై మరోసారి దాడులకు దిగే అవకాశం ఉందని ఇరాన్ సైనిక ప్రధాన కార్యాలయ డిప్యూటీ అధికారి మహమ్మద్ జాఫర్ అసదీ ఆరోపించారు. అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు ఏమాత్రం తగ్గడంలేదు. శాంతి ఒప్పందం కోసం ఇరాన్ తాజాగా పంపిన ప్రతిపాదనపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో అసదీ వ్యాఖ్యలు ప్రాముఖ్యత సంతరించు కున్నాయి. అమెరికాతో మళ్లీ యుద్ధం జరిగే అవకాశం ఉందని అన్నారు. అమెరికా మాట మీద నిలబడటం లేదని విమర్శించారు. ఏ ఒప్పందాలకు, వాగ్దానాలకు కట్టుబడి ఉండటం లేదని అన్నారు. చమురు ధరలు తగ్గించడం, తాము సృష్టించుకున్న గందరగోళం నుంచి బయటపడేలా అమెరికా అధికారుల ప్రకటనలు ఉన్నాయని విమర్శించారు. ఈ క్రమంలో తమ దేశంపై మరోసారి దాడులకుదిగే అవకాశం ఉందని ఆయన ఆరోపించారు. శత్రుదేశాలు చేసే ఎలాంటి దాడినైనా తాము ఎదుర్కొంటామని స్పష్టం చేశారు.

**షిప్పింగ్ సంస్థలకు అమెరికా హెచ్చరిక**

హార్మూజ్ జలసంధి వద్ద ఇరాన్ టోల్ ఫీజు వసూలు చేస్తున్నట్లు వార్తలు రావడంతో అమెరికా స్పందించింది. ఇరాన్ విధించే టోల్ చెల్లిస్తే ఆయా షిప్పింగ్ సంస్థలు తమ ఆంక్షలను ఎదుర్కోవాల్సి వస్తుందని యూఎస్ ట్రెజరీ శాఖ కీలక హెచ్చరికలు జారీ చేసింది. ఇరాన్-అమెరికా మధ్య కాల్పులు విరమణ ఒప్పందం కూడా రద్దు కావొచ్చు. ఇదే జరిగితే, ఇరాన్-అమెరికా మధ్య మళ్లీ యుద్ధం ప్రారంభం కావొచ్చన్నారు. ఇరు దేశాల మధ్య ఒప్పందం విషయంలో అమెరికా అంత ఆసక్తిగా లేదని, దీంతో యుద్ధం తప్పక పోవచ్చని ఆయన అన్నారు. అమెరికా ఇటీవల తీసుకుంటున్న చర్యలు, ప్రకటనలు చూస్తే ద్వైపాక్షిక అంశాలపై అమెరికాకు చిత్తశుద్ధి లేదనే విషయం స్పష్టమవుతోందన్నారు. అమెరికా చేసిన ప్రకటనలు ముందుగా చమురు ధరలు తగ్గించేందుకేనని, అలాగే వాళ్లు సృష్టించిన గందరగోళాన్ని తగ్గించేందుకే అని అసాది అన్నారు. చర్చల విషయంలో అమెరికాకు చిత్తశుద్ధి లేకపోవడంతో అమెరికాతో తమ దేశానికి మళ్లీ యుద్ధం తప్పకపోవచ్చని వ్యాఖ్యానించారు. అందుకే యుద్ధం వచ్చినా ఎదుర్కొనేందుకు తమ సైనిక దళాలు పూర్తి సిద్ధంగా, హై అలర్ట్‌తో ఉన్నాయని తెలిపారు.

# బెంగాల్ ఫలితాలు దుర్గామాత కూడా అంచనా వేయలేరు!

## ఎన్నికల ఫలితాలపై సౌరభ్ గంగూలీ



**కోల్‌కత్తా, మే 2:** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, చివరికి బెంగాల్ ఆరాధ్య దైవం దుర్గామాత కూడా అంచనా వేయలేరని భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఎన్నికల ఫలితాలపై నెలకొన్న తీవ్ర ఉత్కంఠను గంగూలీ తనదైన శైలిలో అభివర్ణించాడు. గంగూలీ విలేకరులతో మాట్లాడుతూ 2026 బెంగాల్ ఎన్నికల్లో ఎవరు గెలుస్తారని అడిగిన ప్రశ్నకు స్పందించాడు. ఇంతటి క్లిష్టమైన ప్రశ్నకు నేను ఎలా సమాధానం చెప్పగలను సోమవారం బ్యాలెట్ బాక్సులు తెరిచినప్పుడే మనందరికీ సమాధానం తెలుస్తుందని అన్నాడు. ఎన్నికల ఫలితాలు ఎంత అనూహ్యంగా ఉంటాయో చెబుతూ, మమతా దీదీ, మోడీజీ, చివరికి దుర్గామాత కూడా ఫలితాలను అంచనా వేయలేరని చమత్కరించాడు. పశ్చిమ బెంగాల్‌లోని 294 అసెంబ్లీ స్థానాలకు ఏప్రిల్ 23, 29 తేదీల్లో రెండు విడతల్లో పోలింగ్ జరిగిన విషయం తెలిసిందే. కాగా, దక్షిణ 24 పరగణాల జిల్లాలోని రెండు నియోజకవర్గాల పరిధిలో 15 పోలింగ్ బూత్‌లలో ఎన్నికల సంఘం నేడు రీపోలింగ్ నిర్వహిస్తోంది. ఎల్లుండి ఓట్ల లెక్కింపు జరగనుంది.

## ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష ఫీజు చెల్లింపు గడువు పెంపు

### అపరాధ రుసుం రూ.3వేలతో 4 వరకు అవకాశం

**హైదరాబాద్, ప్రభాతవార్త, మే 2:** రాష్ట్రంలో ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ ఫీజు చెల్లింపు గడువును అపరాధ రుసుంతో చెల్లించడానికి ఈ నెల 23 వరకు పొడిగించారు. అయితే విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి అందిన విజ్ఞప్తుల మేరకు అపరాధ రుసుం రూ.3వేలతో గడువును ఈ నెల 4సాయంత్రం 5 గంటల వరకు చెల్లించడానికి అవకాశం కల్పించినట్టు ఇంటర్‌బోర్డు కార్యదర్శి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 25 నుంచి మార్చి 18 వరకు ఇంటర్ పరీక్షలు జరిగిన విషయం తెలిసిందే. పరీక్షల ఫలితాలను ఏప్రిల్ 12న విడుదల చేయగా, ఏప్రిల్ 13 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు ఫీజు చెల్లించడానికి అవకాశం కల్పించారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో 4,89,123 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా వారిలో 3,23,807మంది ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 5,07,948 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైతే వారిలో 3,58,490 మంది ఉత్తీర్ణత సాధించారు. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థుల్లో ఫెయిలైన వారితోపాటు అదనంగా మార్కులు కావాలని భావించే వారు ఇంప్రూవ్‌మెంట్ పేరుతో పరీక్షలకు హాజరవుతారు. ఇక ద్వితీయ సంవత్సరంలో ఫెయిలైన వారు కూడా పరీక్ష ఫీజును చెల్లిస్తారు. ఇప్పటి వరకు సుమారు 1.80 లక్షల మంది ఫీజు చెల్లించినట్టు తెలిసింది. ఏప్రిల్ 13 నుంచే రీకౌంటింగ్, రీవె రిఫికేషన్‌కు కూడా ఇంటర్ బోర్డు దరఖాస్తులను స్వీకరిస్తోంది. రీకౌంటింగ్ కోసం 7వేల దరఖాస్తులు రాగా.. రీవెరిఫికేషన్ కోసం 38వేలు దరఖాస్తులు వచ్చినట్టు అధికారులు తెలిపారు.

## రేపు, ఎల్లుండి ఎప్ సెట్ అగ్రికల్చర్ పరీక్షలు

### 106 కేంద్రాల్లో 90,960 మందికి పరీక్ష

### నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు

### 9 నుంచి 11 వరకు ఇంజనీరింగ్ పరీక్షలు

**హైదరాబాద్, ప్రభాతవార్త, మే 2:** రాష్ట్రంలో ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ ఫీజు చెల్లింపు గడువును అపరాధ రుసుంతో చెల్లించడానికి పెంచుతూ ఇంటర్ బోర్డు నిర్ణయం తీసుకుంది. ఇంటర్మీడియట్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలకి ఫీజు చెల్లించడానికి గడువును ఏప్రిల్ 23 వరకు పొడిగించినప్పటికీ చాలా మంది విద్యార్థులు ఫీజులను గడువులోపు చెల్లించలేకపోయారు. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి అందిన విజ్ఞప్తుల మేరకు అపరాధ రుసుం రూ. 3వేలతో గడువును ఈ నెల 4 సాయంత్రం 5 గంటల వరకు చెల్లించడానికి అవకాశం కల్పించినట్టు ఇంటర్‌బోర్డు కార్యదర్శి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 25 నుంచి మార్చి 18 వరకు ఇంటర్ పరీక్షలు జరిగిన విషయం తెలిసిందే. పరీక్షల ఫలితాలను ఏప్రిల్ 12న విడుదల చేయగా ఏప్రిల్ 13 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు ఫీజు చెల్లించడానికి అవకాశం కల్పించారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో 4,89,123 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా వారిలో 3,23,807 మంది ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 5,07,948 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైతే వారిలో 3,58,490 మంది ఉత్తీర్ణత సాధించారు. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యా ర్థుల్లో ఫెయిలైన వారితోపాటు అదనంగా మార్కులు కావాలని భావించే వారు ఇంప్రూవ్‌మెంట్ పేరుతో పరీక్షలకు హాజరవుతారు. ఇక ద్వితీయ సంవత్సరంలో ఫెయిలైన వారు కూడా పరీక్ష ఫీజును చెల్లిస్తారు. ఇప్పటి వరకు సుమారు 1.80లక్షల మంది ఫీజు చెల్లించినట్టు తెలిసింది. ఏప్రిల్ 13 నుంచే రీకౌంటింగ్, రీవెరిఫికేషన్‌కు కూడా ఇంటర్ బోర్డు దరఖాస్తులను స్వీకరిస్తోంది. రీకౌంటింగ్ కోసం 7వేల దరఖాస్తులు రాగా.. రీవెరిఫికేషన్ కోసం 38వేలు దరఖాస్తులు వచ్చినట్టు అధికారులు తెలిపారు.

## ప్రేమ విఫలమై యువకుడి ఆత్మహత్య

**హైదరాబాద్, మే 2, ప్రభాతవార్త:** నిజామాబాద్ జిల్లా నవీపేట్ పోలీసు స్టేషన్ పరిధిలో ప్రేమ విఫలమవడంతో ఓయువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు ఇలావు న్నాయి. బిహార్‌కు చెందిన నితీష్ కుమార్ (21) నవీపేట్ మండలంలో రాంపూర్‌లో కొంతకాలంగా వుంటూ కూలీ పనులు చేస్తున్నాడు. నితీష్ కుమార్‌తో పాటు అతని సోదరుడు రాజేష్ కూడా కూలీ పనులే చేస్తున్నాడు. ఇదే ప్రాంతంలో నివ సించే శివాని అనే యువతి ఇతనికి వరుసకు మరదలు అవుతుంది. ఆ యువతిని ఇతను ప్రేమించాడు. అయితే ఆయువతిని ఇతనికి ఇచ్చి పెళ్లి చేసేందుకు ఆమె తల్లిదండ్రులు ఒప్పు కోలేదు. దీంతో వారం రోజులుగా ముబావంగా వున్న నితీష్ కుమార్ శనివారం ఉదయం ఐదుగంటలకు ఇంట్లో నుంచి బయటకు వెళ్లి గ్రామ శివార్లలో గల చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దీనిపై మృతుడిసోదరుడు రాజేష్ ఇచ్చిన ఫిర్యాదుపై నవీపేట్ పోలీసులు కేసునమోదు చేసి విచారణ చేబట్టారు. కాగా నితీష్‌కుమార్ భౌతిక కాయాన్ని పోస్టుమార్టం తరువాత అతని కుటుంబీకులకు శనివారం సాయంత్రం అప్పగించారు.

## ఫీజుల వసూలుపై హైకోర్టు తీర్పుపై అప్పీలు చేయాలి: ఆర్ కృష్ణయ్య

**హైదరాబాద్ మే 2ప్రభాతవార్త:** విద్యార్థుల వద్ద ఫీజులు వసూలు చేసుకోవ చ్చంటూ హైకోర్టు సింగిల్ జడ్జి ఇటీవల ఇచ్చిన తీర్పుపై ప్రభుత్వం వెంటనే అప్పీలుకు వెళ్లాలని రాజ్యసభ సభ్యులు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆయన ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. హైకోర్టు తీర్పును సాకుగా చూపి విద్యా సంస్థల యాజమాన్యాలు విద్యార్థులపై ఫీజుల కోసం ఒత్తిడి పెంచుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజుల వేధింపుల కారణంగానే శ్రీ ఇందు కాలేజీలో ప్రణీత్ అనే బిటెక్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడని, ఇటువంటి పరిస్థితులు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. ప్రభుత్వం ఏప్రిల్ 30న జారీ చేసిన జీవో నెం. 07 పేద వర్గాల విద్యకు గొడ్డలిపె ట్టులా ఉందని విమర్శించారు. ప్రభుత్వం నుంచి కళాశాలలకు అందాల్సిన దాదాపు రూ. 8 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు.

## కొత్తగా గిరిజన హాస్టళ్లు

**హైదరాబాద్, మే 2, ప్రభాతవార్త:** తెలంగాణలోని వివిధ ప్రాంతాల్లో కొత్తగా గిరిజన హాస్టళ్లను ఏర్పాటు చే దిశగా తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటికే వివిధ ప్రాంతాల్లో చేపట్టిన వసతి గృహాల నిర్మాణం దాదాపు పూర్తికావచ్చినట్లు గిరిజన సంక్షేమ శాఖ అధికారవర్గాలు చెబుతున్నాయి. ఈ హాస్టళ్లు వచ్చే విద్యా సంవత్సరం నుండి పూర్తి స్థాయిలో అందుబాటులోకి రానున్నాయి. ఇందులో భాగంగా తొలుత హైదరాబాద్ లోని బేగంపేట, రామంతపూర్ ప్రాంతాల్లో గిరిజన విద్యార్థుల కోసం ప్రత్యేక హాస్టళ్లు నిర్మించింది. వీటి కోసం కోసం రూ.20 లక్షలు మరియు రూ. 1.33 కోట్లు ఖర్చు చేస్తున్నారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌తో పాటు రామంతపూర్‌లో అడ్మిషన్స్ పొందే గిరిజన విద్యా ర్థులకు ఈ రెండు హాస్టళ్లు మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం గతంలోనే ఉత్తర్వులు జారీ చేసింది. వీటిని బాలికలు మరియు బాలలకు వేరు వేరుగా నిర్మించనున్నారు. హెచ్‌పీఎస్ (హైదరాబాద్ పబ్లిక్ స్కూల్) వద్ద ఈ హాస్టల్‌కు రూ. 20లక్షల 30 వేలు ఖర్చు చేయనుంది. అలాగే రామాంతపూర్ హాస్టల్‌కు రూ. కోటి 33లక్షలు ఖర్చు చేయాలని గిరిజన సంక్షేమ శాఖ ప్రకటించింది. హైదరాబాద్ బేగంపేట హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌తో పాటు, రామంపూర్‌లో అడ్మిషన్స్ పొందే గిరిజన విద్యార్థులకు ఈ రెండు హాస్టళ్లను మంజూరు చేశారు. గిరిజన పిల్లల విద్య కోసం సమర్థమైన వసతులు ఏర్పరచడాన్ని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఈ సందర్భంగా గిరిజన సంక్షేమ శాఖ వెల్లడించింది.

## పూర్తి సామర్థ్యంతో థర్మల్ విద్యుత్

**హైదరాబాద్, మే 2, ప్రభాతవార్త:** ప్రస్తుత వేసవి కాలంలో విద్యుత్ డిమాండ్ భారీగా పెరగనున్న దృష్ట్యా దేశంలోని థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు పూర్తి సామర్థ్యంలో పని చేయాలని కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ అన్ని యూనిట్లను ఆదేశించింది. కరెంట్ కొరత లేకుండా ఈ ఏడాది అక్టోబరు 15 వరకూ విద్యుత్ ఉత్పత్తిని పూర్తిగా చేయాలని స్పష్టం చేసింది. ప్రస్తుత వేసవిలో ఏప్రిల్ నుండి జూన్ వరకూ 270 గిగావాట్ల విద్యుత్‌కు పీక్ డిమాండ్ ఏర్పడే వీలుందని అంచనా వేసింది. గత ఏడాది సెప్టెంబరులో పీక్ డిమాండ్ 253 గిగావాట్లుగా రికార్డయింది. ప్రస్తుత వేసవి కాలంలో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మించి నమోదు కావడతో ఆ మేరకు కరెంట్ వినియోగంలో భారీగా పెరుగుదల చోటు చేసుకుంటోందని తెలిపింది.

## 11న జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నా

### నేటి నుండి మార్కెట్ యార్డులు, కొనుగోలు కేంద్రాల సందర్శన: జాన్‌వెస్లీ

**హైదరాబాద్, ప్రభాతవార్త, మే 2:** ఈ నెల 11న జిల్లాకలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నా చేయాలని నిర్ణయించినట్టు సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ తెలిపారు. నేటి(ఆదివారం) నుండి మార్కెట్ యార్డుల కొనుగోలు కేంద్రాల సందర్శన చేపట్టాలని నిర్ణయించారు. రాష్ట్రవ్యాప్తంగా సాగుచేసిన వరి, మొక్కజొన్న ఇతర పంటల కొనుగోలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని, కొనుగోలు కేంద్రాల్లో నెలకొన్న అస్తవ్యస్త పరిస్థితుల వల్ల అన్నదాతలు అల్లాడుతున్నారన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఐకేపీ, పీఏసీఎస్, వ్యవసాయ మార్కెటింగ్ కమిటీల ఆధ్వర్యంలో కొనుగోలు చేయాలని జాన్‌వెస్లీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇదే సమస్యపై నేటి(ఆదివారం) నుండి సిపిఎం బృందాలు రాష్ట్రంలోని అన్ని మార్కెట్ యార్డులు, కొనుగోలు కేంద్రాలను సందర్శించాలని నిర్ణయించినట్టు తెలిపారు. ఈ నెల 11న అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల ముందు ధర్నాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఖమ్మం, నల్గొండ, ఉత్తర తెలంగాణ, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల్లో పరిస్థితి దయనీయంగా ఉందని, గన్నీ బ్యాగుల కొరత తీవ్రంగా ఉండటంతో రైతులు ఒక్కో బస్తాకు రు.30 అదనంగా చెల్లించాల్సి వస్తోందన్నారు. యాప్ ద్వారా బుక్ చేయాల్సి వస్తోందని, యుద్ధం, డీజిల్ కొరత సాకుతో లారీలు రాకపోవడం వల్ల జాప్యం జరుగుతోందన్నారు. మిల్లుల యజమానులు, దళారులు తరుగు పేరుతో క్వింటాలుకు 3 నుండి 5 కిలోల వరకు కోత విధిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కొనుగోలు చేయడానికి రోజుల తరబడి వేచిచూడాల్సి వస్తుంటే, మరోవైపు అమ్మిన పంటకు డబ్బులు రావడానికి కూడా పక్షం రోజులవరకువేచిచూడాల్సిన స్థితి నెలకొందన్నారు.

# సిరిసిల్లలో అలుముకున్న విషాదం

## ఆరుగురి మృతదేహాలకు అంత్యక్రియలు

**సిరిసిల్ల అర్బన్ ప్రభాతవార్త :** హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డుపై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురి మృతదేహాలు శనివారం తమ స్వస్థలమైన సిరిసిల్లకు చేరుకోవడంతో పట్టణమంతా తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. విగతజీవులుగా మారిన తమ వారిని కడసారి చూసుకునేందుకు సర్దార్ నగర్, వెంకంపేట్ వారి నివాసానికి బంధువులు, మిత్రులు మరియు పట్టణ ప్రజలు భారీ సంఖ్యలో పోటెత్తారు. ఒకే ఇంట ఆరు మృతదేహాలను చూసి అక్కడికి వచ్చిన వారంతా కన్నీరుమున్నీరుగా విలపించారు. నిన్నటి వరకు సంతోషంగా గడిపిన కుటుంబం ఇలా విధి ఆడిన వింత నాటకంలో బలికావడాన్ని ఎవరూ జీర్ణించుకోలేకపోతున్నారు.

ఈ ప్రమాదంలో సిరిసిల్ల పట్టణం సర్దార్‌నగర్‌కు చెందిన బొల్లి శివకుమార్ (37), ఆయన భార్య లాస్య (30), ఎనిమిదేళ్ల కుమార్తె రిషిక అక్కడికక్కడే మృతి చెందారు. శివకుమార్ స్థానిక బీడీ టేకేదార్ బొల్లి రాజు, భాగ్యలక్ష్మి దంపతుల కుమారుడు. ఆయన హైదరాబాద్‌లో సొంత బ్రాండ్ మార్కెటింగ్ రంగంలో రాణిస్తుండగా, ఆయన భార్య లాస్య పౌర సరఫరాల శాఖ ప్రధాన కార్యాలయంలో హెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్నత హోదాలో పనిచేస్తున్నారు. విద్యావంతులైన ఈ దంపతులు ప్రమాదానికి గురవ్వడం ఆ కుటుంబంలో తీరని శూన్యాన్ని మిగిల్చింది.

వీరితో పాటు స్థానిక వెంకంపేట్ కు చెందిన శివకుమార్ బావ, వేములవాడలోని ఓ ఫైనాన్స్ కంపెనీ మేనేజర్‌గా పనిచేస్తున్న కొడం శ్రీనివాస్ (40), ఆయన ఇద్దరు కుమారులు మాధవ్ (11), కృష్ణచంద్ర (9) కూడా ఈ దుర్ఘటనలో ప్రాణాలు విడిచారు. తండ్రితో పాటు ఆడుకోవాల్సిన వయసులో ఇద్దరు చిన్నారులు మృత్యువాత పడటం చూపరులను కలిచివేసింది. ఒకే కుటుంబానికి చెందిన వరుసలు కలిసిన ఆరుగురు సభ్యులు మరణించడంతో బంధువుల రోదనలు మిన్నంటాయి. మృతదేహాల వద్ద బంధువుల ఆర్తనాదాలతో ఆ ప్రాంతమంతా శోకసంద్రంగా మారింది. ఈ ఘోర ప్రమాదం నుండి శివకుమార్ సోదరి, కొడం శ్రీనివాస్ భార్య శ్వేత (35) మాత్రమే ప్రాణాలతో బయటపడ్డారు. ప్రస్తుతం ఆమె హైదరాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రిలో తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నారు.

మృతుల అంత్యక్రియల సందర్భంగా సిరిసిల్ల పట్టణంలో నిశ్శబ్ద వాతావరణం నెలకొంది. పట్టణ ప్రముఖులు, రాజకీయ నాయకులు బాధితుల నివాసానికి చేరుకుని మృతులకు నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఒకేసారి ఆరు పాడెలు ఇండ్ల నుంచి కదులుతుంటే చూసిన ప్రతి ఒక్కరి హృదయం ద్రవించిపోయింది. మానేరు వాగులో ఒకదగ్గరే పక్క పక్కనే అంత్యక్రియలు నిర్వహించారు.



మృతదేహాల వద్ద రోధిస్తున్న కుటుంబ సభ్యులు

### బాధిత కుటుంబాలను పరామర్శించిన మాజీ మంత్రి కె.టి.ఆర్

**హైదరాబాద్ (అఫ్జల్‌గంజ్), మే 2ప్రభాతవార్త:** ఔటర్ రింగ్ రోడ్డు ప్రమాద భాదిత కుటుంబాలను బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు, మాజీ మంత్రి కె.టి.ఆర్ ఉదయం శనివారం ఉస్మానియా మార్చురీ వద్ద మృత్యుల కుటుంబాలకు చెందిన వారిని కలిసి పరామర్శించారు. శుక్రవారం జరిగిన



ఘోర రోడ్డు ప్రమాదంలో సిరిసిల్లకు చెందిన ఆరుగురు వ్యక్తులు మృతి చెందిన చెందడం పట్ల ఆయన తీవ్రదిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.

ఈక్రమంలోనే శనివారం ఉదయం ఉస్మానియా జనరల్ ఆసుపత్రిలోనిమార్చురీకి చేరుకున్నారు. కె.టి.ఆర్ పోలీసులను ప్రమాదానికిగల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతుల పార్థివ దేహాలపై వద్ద పుష్పగుచ్చాలు ఉంచినివాళ్లు ఆర్పించారు. అక్కడే ఉన్న మృత్యుల కుటుంబ సభ్యులతో కెటిఆర్ మాట్లాడి, ఆత్మీయులనుకోల్పోయి కన్నీరు. మున్నీరు అవు తున్న వారిని ఆయన ఓదార్చి, ధైర్యం చెప్పారు. ఈకష్ట సమయంలోతాను వ్యక్తిగతంగా భాదిత కుటుంబాలకు పూర్తి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఒకేగ్రామానికి ఆరుగురు వ్యక్తులు మరణించడం పట్ల తీరని లోటు అన్నారు. పోస్టుమార్టం అనంతరంసిరిసిల్ల గ్రామానికి మృతదేహాలను తరలించారు. ఉస్మానియా మార్చురీ వద్ద విషాద చాయలు నెలకొన్నాయి. మాజీ మంత్రి కె.టి.ఆర్ వెంట గోషామహల్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఇన్‌చార్జ్ ఆర్వీమ హేందర్‌కుమార్, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## ఐదు బొగ్గు గనుల్లో 100 శాతం ఉత్పత్తి

### ఏరియా చీఫ్ జనరల్ మేనేజర్ శ్రీనివాస్

**హైదరాబాద్, మే 2, ప్రభాతవార్త:** సింగరేణి కాలరీస్‌కు చెందిన శ్రీరాంపూర్ ఏరియాలో బొగ్గు ఉత్పత్తి పూర్తి స్థాయిలో నమోదైంది. ఏప్రిల్ నెలలో ఒక భూగర్భ గని మినహా మిగిలిన ఐదు గనులు 100 శాతానికి పైగా బొగ్గు ఉత్పత్తిని సాధించాయని సింగరేణి కాలరీస్ ఏరియా చీఫ్ జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆరు భూగర్భ గనులు మరియు రెండు ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టులు (ఓసీపీలు) కలిగి ఉండగా, గత నెలలో నిర్దేశించిన 5.47 లక్షల టన్నులకు బదులుగా 3.07 లక్షల టన్నుల బొగ్గును తవ్వినట్లు చెప్పారు. ఇది 56 శాతం మేర నమోదైనట్లు సూచిస్తుందన్నారు. అయితే, శ్రీరాంపూర్ ప్రాంతంలోని భూగర్భ గనులు మొత్తం 99 శాతం ఉత్పత్తిని నమోదు చేయగా, ఏప్రిల్‌లో ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టులు 44 శాతం బొగ్గు ఉత్పత్తిని నమోదు చేశాయని ఆయన వివరించారు. భూగర్భ గని ఎస్సార్పీ1 123 శాతం ఉత్పత్తిని నమోదు చేయగా, ఇతర గనులైన ఆర్కేఎన్టీ, ఆర్కే5 ఏప్రిల్‌లో వరుసగా 104 శాతం, 102 శాతం బొగ్గు ఉత్పత్తిని సాధించాయని తెలిపారు. అదేవిధంగా, ఎస్సార్పీ3, ఆర్కే7 గనులు ఒక్కొక్కటి 100 శాతం ఉత్పత్తిని నమోదు చేశాయి. అయితే, ఐకె1ఎ గని 84 శాతం ఉత్పత్తిని నమోదు చేసిందని వెల్లడించారు. పై పొరను తొలగించడంలో సమస్యలతో పాటు, ఇంధన కొరత కారణంగా ఆ ప్రాంతం కింద ఉన్న చమురు శుద్ధి కర్మాగారాలు (ఓసీపీలు) పేలవంగా పనిచేశాయన్నారు.

సమీక్షా సమావేశాలు నిర్వహిం చడం ద్వారా కాంట్రాక్టర్లు మరియు ఐకె1ఎ భూగర్భ గని ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించి, ఓసీపీల పనితీరును మెరుగుపరి చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నెలవారీ లక్ష్యాలను సాధించడానికి సమన్వయం అవసరమని, కార్యాచరణ ప్రణాళికను రూపొం దించుకోవాలని పేర్కొన్నారు.

## బ్లాక్‌మెయిల్ చేసి హారీశ్‌రావు, కెటిఆర్ డబ్బులు దండుకుంటున్నారు : బల్మూరి వెంకట్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మే2:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఆ పార్టీ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావులపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్ సంచలన ఆరోపణలు చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. కాంట్రాక్టర్లను బ్లాక్ మెయిల్ చేసి డబ్బులు దండుకుంటున్నారని ఆరోపించారు. హ్యామ్ రోడ్లకు టెండర్లు వేసిన వారికి ఫోన్లు చేసి బెదిరిస్తున్నారని ధ్వజమెత్తారు. గత ప్రభుత్వం చేసిన అరాచకాల కారణంగా పనులు చేయడానికి కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని అన్నారు. బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్ రావులకు ఆదాయం తప్ప ప్రజా సమస్యలు పట్టడం లేదని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ విమర్శించారు. వివిధ శాఖలు, ప్రాజెక్టులపై అనవసర ఆరోపణలు చేసి కాంట్రాక్టర్లను లొంగదీసుకోవాలని చూస్తున్నారని మండిపడ్డారు. బ్లాక్ మెయిల్‌కు కేటీఆర్, హరీశ్ రావులు బ్రాండ్ అంబాసిడర్లు అన్నారు. రాజకీయ అస్తిత్వం కోసమే వారిద్దరు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. మహిళలపై అత్యాచారాలు పెరిగిపోయాయని బీఆర్ఎస్ నేతలు నిస్సిగ్గుగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మహిళల రక్షణ కోసం తమ ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందని వివరించారు. సొంత చెల్లి చేసిన ఆరోపణలకు సమాధానం చెప్పే ధైర్యం కేటీఆర్‌కు లేదన్న ఆయన, ప్రజా సమస్యలపై కేటీఆర్, హారీశ్‌రావు ఎప్పుడూ మాట్లాడరన్నారు.

## కులగణన ప్రకటించాకే తెలంగాణలో ప్రధాని అడుగు పెట్టాలి

### 10న రాష్ట్రవ్యాప్తంగా నల్ల జెండాలతో నిరసన ర్యాలీలు

### రౌండ్ టేబుల్ సమావేశంలో అఖిలపక్ష పార్టీలు, బిసి సంఘాల వెల్లడి

**హైదరాబాద్, మే 2,ప్రభాతవార్త:** బిహార్‌ఎన్నికల ముందు దేశవ్యాప్తంగా జరిగే జనాభా లెక్కలలో బిసి కులాల లెక్కలు చేపడతామని ఢిల్లీలో ప్రకటించిన ప్రధాని బీహార్ ఎన్నికలు ముగియగానే బీసీలకు మొండి చెయ్యి చూపించారని,బిసి కులగలను చేస్తామని ప్రకటించిన తర్వాతే తెలంగాణలో ప్రధాని నరేంద్ర మోడీ అడుగు పెట్టాలని లేదంటే ఈనెల 10 న రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడికక్కడ నల్లజెండాలతో నిరసన కార్యక్రమాలు చేపడతామని అఖిలపక్ష పార్టీలు, బిసి సంఘాల నేతలు వెల్లడించారు. ఈమేరకు హైదరాబాదులోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జనగణలో బిసికులగణన చేపట్టాలని ప్రధాన డిమాండ్‌తో అఖిలపక్ష రాజకీయ పార్టీల రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో కాంగ్రెస్ నుండి వి హనుమంతరావు, బిఆర్ఎస్ నుండి మధుసూదనాచారి, వి శ్రీనివాస్ గౌడ్, టీజేఎస్ నుండి ప్రొఫెసర్ కోదండరాం, సిపిఎం నుండి జాన్ వెస్లీ హాజరయ్యారు. మొదటగా జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ బిసి కులగరణ చేస్తామని దేశంలోని 140 కోట్ల మంది సాక్షిగా ప్రకటించిన ప్రధాని, తీరా జనగణన లో కులగణన చేపట్టకుండా బీసీలను మోసం చేశారన్నారు, బిసి కులగలను చేపట్టకుండా మోసం చేస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరి నిరసిస్తూ ఈ నెల 10న రాష్ట్ర పర్యటనకు వస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ కి నిరసన తెలపాలని నిర్ణయించామని, రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడికక్కడ నల్లజెండాలతో నిరసన ర్యాలీలు చేపట్టాలని శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు బిసిలను నమ్మించి దగా చేస్తున్న బిజెపి వైఖరి నిరసిస్తూ ఈనెల 9వ తేదీ నుండి ఆమరణ నిరాహార దీక్ష చేపడతానని, బీసీల కోసం ప్రాణ త్యాగానికైనా సిద్ధపడతానని కాంగ్రెస్ నేత వి హనుమంతరావు అన్నారు. మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా కల్పించకుండా అన్యాయం చేసిన కేంద్ర ప్రభుత్వం, బిసిలు ఎక్కడ నిలదీస్తారో అనే భయంతో జనాగ్రహ సభలో పేరుతో నాటకం ఆడుతున్నారని, మహిళా బిల్లులో అన్ని వర్గాల మహిళలకు సమన్యాయం జరగాలని, బిసి కులాల లెక్కలు తీసి బిసిలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు పెంచే వరకు బిజెపి ప్రభుత్వం పై పెద్ద ఎత్తున పోరాటం చేసామన్నారు. ఎంఎల్‌సి కోదండరాం మాట్లాడుతూ సకల జనుల పోరాట స్ఫూర్తితోనే బీసీ రిజర్వే షన్లు సాధించుకోవాలని, అసెంబ్లీలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ చేసిన చట్టాన్ని కేంద్రం ఆమోదించకుండా బీసీలను అవమా నించిందని, ఇప్పుడు బీసీ కులగన్న చేస్తామని మాట మార్చి మోసం చేస్తున్న కేంద్ర ప్రభుత్వంపై బీసీ సమాజమంతా తిరగబడాలని పిలుపు నిచ్చారు.



శనివారం జరిగిన సమావేశంలో అభివాదం చేస్తున్న మధుసూధనాచారి, విహెచ్, జాజుల, శ్రీనివాస్ గౌడ్, కోదండరాం,గుజ్జకృష్ణ, విక్రంగౌడ్ తదితరులు

## 2 వేల మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ విద్యుత్‌కు గ్రీన్‌సిగ్నల్

### 10 వేల మెగావాట్ల మేర ఉత్పత్తికి నిర్ణయం, త్వరలో మరో 3 వేల మెగావాట్ల సోలార్ విద్యుత్ కొనుగోలు

**హైదరాబాద్, మే 2, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్తు డిమాండ్, రాబోయే పదేండ్లకు అవసరమయ్యే విద్యుత్తు సరఫరా, విద్యుత్తు ఉత్పత్తి అంచనాలపై సర్కార్ దృష్టిసారించింది. ఇందులో భాగంగా రాష్ట్ర విద్యుత్తు అవసరాలు దృష్టిలో ఉంచుకుని అదనపు విద్యుత్తు కొనుగోలుకు అనుమతి ఇచ్చింది. తాజాగా 2వేల మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ విద్యుత్తును కొనుగోలు చేసేందుకు అనుమతి ఇస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఈ విద్యుత్తు కొనుగోళ్లకు టీజీ జెన్‌కో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించగా, ఐదేండ్ల కాల వ్యవధికి 6+2 గంటలపాటు 2వేల మెగావాట్ల విద్యుత్తు కొనుగోలుకు ముందుకొచ్చింది. అయితే ఈ విద్యుత్తును కాంపిటేటివ్ బిడ్డింగ్ పద్ధతిలో కొనుగోలు చేయాలని ఆదేశించింది. ఇక సోలార్ పవర్ తరహాలోనే పంప్డ్ స్టోరేజ్ పవర్ వినియోగం పెంచాల్సి ఉంది. 2000 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ పవర్ కొనుగోలుకు టెండర్లు పిలవాలని ఇప్పటికే నిర్ణయం తీసుకుంది. అయిదేళ్ళ కాల పరిమితితోనే ఈ టెండర్లు కూడా పిలవనుంది. ఇక రాష్ట్రంలో పలు చోట్ల పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు అనువైన ప్రాంతాలున్నాయి. పంప్డ్ స్టోరేజీ పవర్ ప్లాంట్లను నెలకొల్పేందుకు ముందుకు వచ్చే కంపెనీలు, పెట్టుబడిదారులకు అనుమతి ఇవ్వనుంది. ఇప్పటికే విద్యుత్ పంపిణీ సంస్థల వద్ద ఉన్న ఎంవోయూలను కూడా పరిశీలించింది. ఈ నేపథ్యంలోనే రాష్ట్రంలో 10 వేల మెగా వాట్ల పంప్డ్ స్టోరేజ్ విద్యుత్తు ఉత్పత్తి ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు అనుమతులు ఇవ్వాలని నిర్ణయించింది. ఈ ప్లాంట్ల ఏర్పాటుకు ఆసక్తి ప్రదర్శించే కంపెనీలకు ప్రభుత్వమే అవసరమైన భూమిని కేటాయించి, నీళ్లను అందిస్తుంది. ఈ ప్లాంట్లలో ఉత్పత్తి చేసే విద్యుత్ ను ముందుగా మన డిస్కమ్ లకే అమ్మాలనే షరతుతో ప్రభుత్వం ఒప్పందం చేసుకుంటుంది. మరోపక్క పునరుత్పాదక విద్యుత్తు వినియోగం పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నిబంధనల ప్రకారం రాష్ట్రంలో పునరుత్పాదక విద్యుత్ వినియోగాన్ని పెంచేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా 3000 మెగా వాట్ల సోలార్ పవర్ కొనుగోలుకు వీలైనంత తొందరగా టెండర్లు పిలవాలని నిర్ణయం తీసుకుంది. అయిదు ఏళ్ల పాటు విద్యుత్ సరఫరా చేసే కాల పరిమితి ఒప్పందాలతో ఈ టెండర్లు పిలవనుంది.

## గానుగపాడులో గాలి బీభత్సం..పిడుగుపాటుకు యువకుడు మృతి

**చండ్రుగొండ, ప్రభాతవార్త:** చండ్రుగొండ మండలంలో శనివారం గాలి బీభత్సం సృష్టించిన ఘటనలో గానుగుపాడు గ్రామంలో పిడుగు పడి కొండ్రు వినోద్ 28 సంవత్సరాలు అనే యువకుడు మృతి చెందిన ఘటన చోటు చేసుకున్నది. గానుపాడు గ్రామానికి చెందిన పనితి కాంతారావు అనే యువ రైతు తన మొక్కజొన్న చేను వద్ద కాపలాగా ఉండగా తన స్నేహితులైన కొండ్రు వినోద్ తీట్ల అశోక్‌తో పాటు రేపల్లెవాడ గ్రామ పంచాయతీ శ్రీరామ్ పురం గ్రామానికి చెందిన జక్కుల రాజశేఖర్ నలుగురు కలిసి శనివారం కాంతారావు మొక్కజొన్న చేనువద్ద సరదాగా గడుపుతున్న క్రమంలో సుమారు నాలుగు గంటల సమయంలో ఈదురు గాలులతో కూడిన ఉరుములు మెరుపులతో భారీ వర్షం రావడంతో అక్కడే ఉన్న ఓ చెట్టు కిందకు వెళ్లారు ఒకసారిగా మెరిసి పిడుగు ఆ చెట్టు దగ్గరలో పడడంతో నలుగురు స్పృహ తప్పి పడిపోయారు. అశోక్‌కు స్పృహ రాగా 108కు సమాచారం అందించారు. ఈలోగా రాజు అనే వ్యక్తి చెట్టు వద్దకు రావడంతో నలుగురు పడిపోవడానికి గమనించి వెంటనే గ్రామంలోని బంధువులకి సమాచారం అందించి పడిపోయిన వారిని లేపే క్రమంలో కొండ్రు వినోద్ స్పృహలోనికి రాకపోవడంతో వినోద్ తో పాటు తిట్ల అశోక్ రాజశేఖర్ని 108 ద్వారా కొత్తగూడెం తరలించారు.

కాంతారావు అనే రైతుని ఆటోలోనే చండ్రుగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్యం అందించిన డాక్టర్లు మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిలో వినోద్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

## షార్ట్ సర్క్యూట్‌తో 16 ఎకరాల మక్కజొన్న పంట దగ్ధం

### రూ 8 లక్షల ఆస్తి నష్టం

### ఆదుకోవాలని రైతుల వేడుకోలు

**చిట్యాల, మే 2 ప్రభాతవార్త:** ప్రమాదవశాత్తు విద్యుత్తు షార్ట్ సర్క్యూట్ సంబంధించి 16 ఎకరాల మక్క జొన్న పంట దగ్ధమైన సంఘటన మండలంలోని తిరుమలాపురం గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. బాధితులు, గ్రామస్తులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఆ రెల్లి కృష్ణ మూర్తి 4



ఎకరాలు, బొజ్జం సదయ్య 2 ఎకరాలు, గోపగాని చిన్న వెంకటేశ్వర్లు 4 ఎకరాలు, గోపగాని రవీందర్ 4 ఎకరాలు, ఆనందం 2 ఎకరాల మక్కా జొన్న పంటలు సాగు చేసినట్లు చెప్పారు. పంట కోత సమయం రావడంతో కూలీలతో గురు, శుక్రవారంలో పంటలను కోసి కంకులను చేలల్లోనే ఉంచారు. ఈ నేపథ్యంలో ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లు షార్ట్ సర్క్యూట్ సంబంధించి 16 ఎకరాల్లో నిలువ ఉన్న ఎండిన చో ప్ప తోపాటు మొక్కజొన్న కంకులు పూర్తిగా కాలిపోయినట్లు బాధితులు విలపిస్తూ చెప్పారు. గమనించిన గ్రామస్తులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో అప్పటికే ఎగిసిపడుతున్న మంటలను ఆర్పివేసినట్లు చెప్పారు. ఈ సంఘటనలో సుమారు రూ 8 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు రైతులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎస్సై పోచంపల్లి సతీష్ సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. ప్రభు త్వం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.

# నవదంపతుల బలవన్మరణం



కార్తీక్, జ్యానిక(ఫైల్)

**కెపిహెచ్‌బి కాలనీ, మే 2, ప్రభాతవార్త:** ప్రేమించి పెళ్లి చేసుకున్న నవ దంప తులు పెళ్లయిన రెండు నెలలకే బలవన్ మరణానికి పాల్పడిన సంఘటన కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికంగా కలకలం రేపిన ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం కూకట్‌పల్లిలోని కుమ్మరి బస్తీకి చెందిన సత్య నారాయణ కుమారుడు ఎంజాల కార్తీక్ (28) ఐటిసి కంపెనీలో మార్కెటింగ్ మేనేజర్‌గా విధులు నిర్వహించేవాడు. అయితే లక్ష్మణ్ కూతురు ఎర్రమల్ల జ్యానిక (మంజుల) (27)తో పరిచయం కాగా ఇరువురు ప్రేమించుకున్నారు. రెండు కుటుంబాల సభ్యులను ఒప్పించి గత రెండు నెలల క్రితం సాంప్రదా యపద్ధంగా పెళ్లి చేసుకున్నారు. కాగా ఎంజాల కార్తీక్ శనివారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. కార్తీక్ భార్య మంజుల విషం సేవించి ఆత్మహత్య చేసుకుంది. ఇద్దరూ విగత జీవులుగా మారిన విషయాన్ని స్థానికుల ద్వారా పోలీసులకు సమాచారం అందించడంతో వెంటనే పోలీసులు ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఇరువురు మృతి చెందడంతో పోస్టు మార్టం నిమిత్తం కూకట్ పల్లి పోలీసులు మృతదేహాలను గాంధీ మార్చురీకి తరలించారు. నవ దంపతుల మరణానికి గల కారణాలు తెలియాల్సి ఉందని విచారణ చేపడుతున్నట్లు కూకట్‌పల్లి పోలీసులు తెలిపారు.

## ఆన్‌లైన్ బెట్టింగ్ ముఠాలకు పోలీసుల ఝలక్

### ఆరు కేసులు నమోదు,181 సోషల్ మీడియా ప్రొఫైళ్ల తొలగింపు

**హైదరాబాద్, మే 2, ప్రభాతవార్త:** ఐపిఎల్ సీజన్ నేపథ్యంలో యువతను ఆన్‌లైన్ జూదంలో లాగుతూ ఓవైపు వారిని వ్యసనపరులుగా మా రుస్తూ ఇంకోవైపు ఆత్మహత్యలకు పురిగొల్పుతున్న ఆన్‌లైన్ బెట్టింగ్ ముఠాలపై సిటీ సైబర్ క్రైం పోలీసులు ఝలక్ ఇచ్చారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు సంబం ధించి అందిన ఫిర్యాదుపై ఆరు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసిన సైబర్ క్రైం పోలీసులు ఏకంగా 181 సోషల్ మీడియా ప్రొఫైళ్లపై వేటు వేశారు. దీనికి సంబంధించిన వివరాలను సైబర్ క్రైం డిసిపి అరవిందబాబు శని వారం మీడియాకు వెల్లడించారు. దేశంలో ఐపిఎల్ సీజన్ ఊపం దుకోవడంతో ఆన్‌లైన్ బెట్టింగ్ కూడా వేగంగా విస్తరించింది. పోలీసులు ఎంత నిఘా వుంచినా ఇందులో చిక్కుకుని అనేక మంది తమ జీవితాలను నాశనం చేసుకుంటుండడంతో సోషల్ మీడియా ప్రొఫైళ్లపై సైబర్ క్రైం పోలీసులు నిఘా వుంచారు. దీనిపై గతనెలలో సైబర్ క్రైం పోలీసులు పలుచోట్ల రహస్య ఆపరేషన్ నిర్వహించారు. ఇందులో సంచలన విషయాలు వెలుగు చూశాయి. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం వేదికగా పెయిడ్ అడ్వర్‌టైజ్‌మెంట్లను నడుపుతున్న 181సోషల్ మీడియా ప్రొఫైళ్ల బండారం బయటపడింది. ఈ అకౌంట్ల ద్వారా ఐపిఎల్ మ్యాచ్‌ల అంచనాలు, భారీ బోనస్‌లు, రెఫరల్ కమీషన్ల పేరుతో అమాయకులను ఉచ్చులో లాగుతున్నారు. ఈ క్రమంలో ప్రముఖ క్రికెటర్ల ఫోటోలను, వీడియోలను డీఫ్‌ఫేక్ సాంకేతికతో మార్ఫింగ్ చేసి వారు కూడాఇందులో భాగస్వాములని నమ్మిస్తూ అమాయకుల నుంచి భారీగా పెట్టుబడులు తీసుకుంటున్నారు. ఈ ప్రకటనలను నమ్ముతున్న కొందరు సదరు సోషల్‌మీడియా అడ్వర్‌టైజ్‌మెంట్ కంపెనీలకు డబ్బులు పంపుతున్న యువకులు నిండా మునుగుతున్నారు. దీనిపై పక్కా సమా చారంతో సైబర్ క్రైం పోలీసులు ఆరు కేసులు నమోదు చేసి నిందితులపై నిఘా ఉంచారు.



గ్రేటర్ పరిధిలో ట్రాఫిక్ నిర్వహణ, రోడ్డు ప్రమాదాల నివారణపై నాలుగు కమిషనరేట్ల ట్రాఫిక్ అధికారులతో డిజిపి ఆనంద్ సమీక్ష నిర్వహించిన దృశ్యం

## గ్రేటర్ పరిధిలో ట్రాఫిక్ నిర్వహణ, రోడ్డు ప్రమాదాల నివారణపై డిజిపి సమీక్ష

### పాల్గొన్న నాలుగు కమిషనరేట్ల పోలీసు అధికారులు

**హైదరాబాద్, మే 2, ప్రభాతవార్త:** అవుటర్ రింగ్ రోడ్డుతో పాటు జంట నగరాలు, శివార్లలో వరుసగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణ , ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై డిజిపి సి.వి ఆనంద్ శనివారం నాడు హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి, ఫ్యూచర్ సిటీ కమిషనరేట్లకు చెంది న ఉన్నతాధికారులతో భేటీ అయ్యారు. డిజిపి కార్యాలయంలో జరిగిన ఈ భేటీలో అనేక అంశాలపై డిజిపి ఆయా కమిషనరేట్ల ఉన్నతాధికారు లకు దిశా నిర్దేశం చేశారు. శంషాబాద్‌లోని అవుటర్ రింగ్ రోడ్డుపై శుక్రవారం నాడు ఆగివున్న లారీని కారు ఢీకొన్న ఘటనలో ఆరుగురు చని పోవడంతో పాటు గ్రేటర్ పరిధిలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై సిఎం రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేయడం, వీటిని నివారించాలని ఆ దేశించిన నేపథ్యంలో డిజిపి ఆనంద్ నాలుగు కమిషనరేట్ల అధికారులతో భేటీ అయ్యారు. జంట నగరాలతో పాటు శివారు ప్రాంతాలు, ఓఆర్ఆ ర్‌పై వేగంగా వెళ్లే వాహనాలపై కొరడా ఝుళిపించాలని, భద్రతా ప్రమాణాలను అందరు కచ్చితంగా పాటించేలా చూడాలని డిజిపి ఆనంద్ నాలు గు కమిషనరేట్ల అధికారులను డిజిపి ఆదేశించారు. జంట నగరాలలో సామాన్యులకు ఇబ్బంది కలగకుండా వుండేలా ట్రాఫిక్ పోలీసుల విధుల నిర్వహణ వుండాలని ఆయన ఆదేశించారు. పెరుగుతున్న వాహనాల రద్దీకి అనుగుణంగా ట్రాఫిక్ జాంలు ఏర్పడకుండా వ్యూహాలు అనుసరించాలని ఆయన తెలిపారు. రహదారి భద్రత కోసం త్వరలో రోడ్ సేఫ్టీ, ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నామని, దీనికి సంబం ధించిన కసకత్తులు జరుగుతున్నాయని ఆనంద్ తెలిపారు. ఈ వ్యవస్థ అందుబాటు లో వస్తే ట్రాఫిక్ నిర్వహణ సవ్యంగా వుండేందుకు ఆస్కార ం వుంటుందని ఆయన అన్నారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించే వారిపై ఉక్కుపాదం మోపాలని, మద్యం సేవించి వాహనాలు నడిపే వా రిపై కఠినంగా వుండాలని, హెల్మెట్లు ధరించని ద్విచక్ర వాహనదారులు, సీటు బెల్టులు ధరించని కార్ల డ్రైవర్లపైనా కఠినంగా వుండాలని డిజిపి ఆదేశించారు. ఈ సమావేశంలో ఫ్యూచర్ సిటీ ట్రాఫిక్ జాయింట్ సిపి చందనా దీప్తి, సిటీ ట్రాఫిక్ డిసిపిలు రాహుల్ హెగ్డె, రాజల్ సింగ్, అ వినాష్ కుమార్, కుత్బుల్లాపూర్ డిసిపి శేషాద్రిని రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో భానుడి ప్రతాపం

### ఈ సీజన్‌లోనే రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు

### నిజామాబాద్‌లో గరిష్టంగా 46 డిగ్రీలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మే2:** తెలంగాణలో ఎండలు మండిపోతున్నాయి. ఏప్రిల్‌లోనే ఎండలు దంచికొట్టగా మే నెల ప్రారంభం అవ్వగానే ఉష్ణోగ్రతలు భారీగా పెరిగిపోతున్నాయి. శనివారం ఈ సీజన్‌లోనే రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదవ్వడం ఆందోళన కలిగిస్తోంది. కొన్ని జిల్లాల్లో ఏకంగా 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నిజామాబాద్ జిల్లాలో గరిష్టంలో శనివారం 46 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నల్లగొండ,నిర్మల్,సిద్దిపేట జిల్లాలో 45.9 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదిలాబాద్,పెద్దపల్లి జిల్లాల్లో 45.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.ఏప్రిల్ లో నాలుగైదు రోజులుగా ఆదిలాబాద్, నిజామాబాద్ లో 45 డిగ్రీల వరకు ఉష్ణ తీవ్రత కొనసాగుతుండగా మే నెలలో సగటు కూడా మారుతోంది. ఏప్రిల్ లో 42 డిగ్రీల వరకు సరాసరి ఉష్ణోగ్రతలు ఉంటే మే 2 వారంలో ఉష్ణతీవ్రత గణాంకాలు మారే అవకాశాలు కనిపిస్తోంది. ఒకటి నుంచి రెండు డిగ్రీలు ప్రస్తుతం ఉన్న దానికంటే ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉంటుంది. ఇక హైదరాబాద్‌లోనూ భానుడు ప్రతాపం చూపిస్తున్నాడు.గతంలో లేనంతగా ఎండలు కొట్టడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో మధ్యాహ్నం రోడ్లన్నీ ఖాళీగా దర్శనం ఇస్తున్నాయి. బయట తిరిగేవాళ్లు ఎండలను తట్టుకునేందుకు ఓఆర్ఎస్,కొబ్బరి నీళ్లు,జూసులు తాగుతున్నారు.

# వైద్యులు మానవీయ విలువలు అలవర్చు కోవాలి: గర్నవర్ శివప్రతాప్‌శుక్లా

## ఉస్మానియా కొత్త ఆసుపత్రి 2027-చివరికి అందుబాటులోకి: మంత్రి దామోదర రాజనర్సింహ

**హైదరాబాద్ (గన్‌ఫౌండ్రి), మే 2ప్రభాతవార్త:** వైద్యవృత్తి కేవలం ఉపాధి మార్గం మాత్రమే కాదని, అది మానవాళికి సేవ చేయడానికి తీసుకునే పవిత్ర ప్రతిజ్ఞ అని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్‌శుక్లా అన్నారు. వైద్యులు జ్ఞానం,సాంకేతిక నైపుణ్యంతో పాటు కరుణ, సానుభూతి,వంటి మానవీయ విలువలను అలవర్చుకోవాలని యువ వైద్యులకు గవర్నర్ శివప్రతాప్‌శుక్లా సూచించారు.ఉస్మానియా వైద్య కళాశాల అనేక సంవత్సరాలుగా దేశానికి నిబద్ధతతో నైపుణ్యంతో కూడిన వైద్యులను అందిస్తుందన్నారు. పట్టభద్రులైన వైద్యులు వారికి కఠరో శ్రమ,అంకిత భావమన్నారు.యువ వైద్యులు గ్రామీణ ప్రాంతాలలో వైద్యసేవలు అందిస్తూ, అత్యాధునిక పరిశోధనల వరకు ప్రతి రంగంలోనూ నైతిక విలువలతో కూడిన సేవలు అందించాలని గవర్నర్ పిలుపునిచ్చారు. గోషామహల్‌లో ఉస్మానియా కొత్త ఆసుపత్రిలో భవన నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని 2027లో ప్రజలకు అందుబాటులోకి తీసుకు వచ్చే లక్ష్యంతో పనిచేస్తున్నామని తెలంగాణ ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా తెలిపారు.ఈ మేరకు



శనివారం ఉస్మానియా వైద్యవిద్యార్థులకు పట్టాలు అందచేస్తున్న గవర్నర్ శివప్రతాప్‌శుక్లా. చిత్రంలో మంత్రి రాజనరసింహ

ఉస్మానియా మెడికల్ కళాశాల మైదానంలో సాయంత్రం జరిగిన ఉస్మానియా ఎంబిబిఎస్ విద్యార్థుల 175వ స్నాత కోత్సవ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ్‌ప్రతాప్‌శుక్లాతో కలిసి దామోదర్ రాజ నర్సింహ విద్యార్థులకు మంత్రి పట్టాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో కాళోజీ నారాయణరావు,హెల్త్ యూనివర్సిటి విసి.డాక్టర్ రమేష్‌రెడ్డి, డిఎంఈ నరేంద్రకుమార్, ఉస్మానియా మెడికల్ ప్రిన్సిపల్ డాక్టర్ రాజారావు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ ప్రజల బాధను పంచుకుని,వారికి ఉపశమనం, కలిగించే భాద్యతను తమ ప్రభుత్వం నెరవేరు స్తుందన్నారు.వచ్చే ఏడాది చివరికల్లా గోషామహాల్‌లో కొత్త ఉస్మానియాను ప్రజలకు అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. ప్రస్తుతం ఉస్మానియా ఆసుపత్రికి రోజు వేలాది మంది రోగులకు సేవలందిస్తోందని,ఇటీవల18నెలల చిన్నారికి విజయవంతంగా లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ నిర్వహించడం ఉస్మానియా వైద్యుల నైపుణ్యానికి నిదర్శమన్నారు.కొత్త భవనం అందుబాటులోకి రాగానే అత్యాధునిక వైద్య సదుపాయాలు,సూపర్ స్పెషాలిటి సేవలు,అత్యవసర చికిత్సలు మరింత విస్తృతంగా అందిస్తామన్నారు. వైద్య, విద్యను బలోపేతం చేసేదిశగా విద్యార్థుల కోసం, గాంధీ, ఉస్మానియా మెడికల్ కళాశాలలో అత్యాధునిక వసతులతో హాస్టల్ భవనాల నిర్మాణం కూడా చేప ట్టామని మంత్రి గుర్తు చేశారు.ప్రజలకు అందుబాటులో,నాణ్యమైన వైద్యసేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.వచ్చే ఏడాది చివరికల్లా గోషామహాల్‌లో నూతనంగా నిర్మాణం జరుగుతున్న ఉస్మానియా ఆసుపత్రి భవనం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు.సూపర్ స్పెషాలిటిస్ సేవలు, అత్యవసరచికిత్సలు చేయడం జరుగుతుందన్నారు.

# 2లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేయాలి

## లేదంటే నిరుద్యోగులతో కలిసి సెక్రటేరియట్ ముట్టడిస్తాం: హరీష్‌రావు




నిరుద్యోగులతో కలిసి మాట్లాడుతున్న హరీష్‌రావు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** నిరుద్యోగుల ఉద్యమం మరింత ఉధృతం కాకముందే సిఎం రేవంత్‌రెడ్డి వెంటనే మేల్కొని జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని జిల్లా గ్రంథాలయంలో ఉద్యోగాలకు ప్రిపేర్ అవుతున్న విద్యార్థులతో ఆయన శనివారం ఇంటరాక్ట్ అయి వారి సమస్యలను అడిగి తెలుసుకొని మాట్లాడారు. 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేయాలని లేదంటే నిరుద్యోగులతో కలిసి సెక్రటేరియట్ ముట్టడిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం ఆ పరిస్థితిని తెచ్చుకోవద్దని తక్షణమే నిరుద్యోగుల డిమాండ్లను నెరవేర్చాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగులు, యువత ఉద్యోగ నోటిఫికేషన్ల కోసం ధర్నాలు చేస్తుంటే సీఎం నోటిఫికేషన్లు యువతే వద్దంటున్నారని బుకాయిస్తున్నారని మండిపడ్డారు. రెండున్నర యేండ్లుగా యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తుంటే ప్రభుత్వం నోటిఫికేషన్లు ఇవ్వడం లేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మొదటి యేడాదిలోనే 2 లక్షల ఉద్యోగాలు అంటూ నమ్మబలికి ఫుల్ పేజీ యాడ్లు ఇచ్చారు రాహుల్‌గాంధీ అశోక్ నగర్ చౌరస్తాలో కూర్చొని చెప్పారని తెలిపారు. నాడు నమ్మించడం నేడు వంచించడం కాంగ్రెస్ నైజాం అన్నారు. బిఆర్ఎస్ హయాంలో 40 వేల పోలీసు ఉద్యోగాలను భర్తీ చేస్తే కాంగ్రెస్ సర్కార్ ఒక్క ఉద్యోగం కూడా భర్తీ చేయలేదన్నారు. మెగా డీఎస్సీ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వాలన్నారు. గ్రూప్ ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు. 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్న సిఎం రేవంత్‌రెడ్డి నేడు హోటళ్లలో పని చేసుకోండని నిరుద్యోగులను అవమానించేలా వ్యాఖ్యాలు చేస్తున్నారని మండిపడ్డారు. జాబ్ క్యాలెండర్ కాస్త జాబ్ లేస్ క్యాలెండర్ అయిందన్నారు. బిఆర్ఎస్ హయాంలో ఇచ్చిన నోటిఫికేషన్లకు కాగితాలు ఇచ్చి నేనే ఇస్తున్నట్లు ఫోజు కొడుతున్నాడు సిఎం అన్నారు. కార్యక్రమంలో నిరుద్యోగ జెఎసి నాయకులు, బిఆర్ఎస్ నాయకులు కొండం సంపత్‌రెడ్డి, మచ్చ వేణుగోపాల్‌రెడ్డి, పాల సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

## డీజిల్ పోసుకొని బిటెక్ విద్యార్థిని ఆత్మహత్య



కీర్తి (ఫైల్)

**సరూర్‌నగర్, మే 2 ప్రభాతవార్త:** ఒంటిపై డీజిల్ పోసుకొని బిటెక్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. బడంగ్‌పేట్‌లోని శ్రీ మారుతీనగర్‌కు చెందిన మాలగరి కీర్తి (21) గండిపేట్ ఎంజిఐటి కాలేజీలో బిటెక్ మూడవ సంవత్సరం చదువుతున్నది. కాగా శనివారం మధ్యాహ్నం కాలేజీ నుండి ఇంటికి తిరిగి రాగా అదే సమయంలో కుటుంబ సభ్యులు అల్మాస్‌గూడలోని జయశంకర్ కాలనీలో ఉంటున్న కీర్తి పిన్ని వద్దకు వెళ్లారు. అయితే ఇంట్లో ఒక్కతే ఉన్న సమయంలో కీర్తి అందుబాటులో ఉన్న డీజిల్‌ను ఒంటిపై పోసుకొని నిప్పటించుకుంది. చేతిలో ఫోన్ పట్టుకొని ఉన్న కీర్తి అక్కడికక్కడే సజీవ దహనమైంది. ఈ మేరకు సమాచారం అందుకున్న మీర్‌పేట్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కీర్తి ఆత్మహత్యపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రతి రెండవ మంగళవారం ఆర్టీసీ డిపోల్లో గ్రీవెన్స్ ఏర్పాటు

### అధికారులు డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బంది పట్ల ఫ్రెండ్లీగా కొనసాగాలి

### ఆర్టీసీ అధికారుల జూమ్ మీటింగ్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్



**హైదరాబాద్, ప్రభాతవార్త, మే 2:** ప్రతి రెండవ మంగళవారం ఆర్టీసీ సిబ్బంది సమస్యలు వినడానికి అన్ని డిపోల్లో గ్రీవెన్స్ ఏర్పాటు చేయాలని.. డిపో మేనేజర్లు ఇతర సిబ్బంది అందుబాటులో ఉండాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. ఆర్టీసీ ఉన్నతాధికారులతో మంత్రి పొన్నం ప్రభాకర్ శనివారం జూమ్ సమావేశం నిర్వహించారు. జూమ్ సమావేశంలో ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డితోపాటు ఈడిలు, ఆర్ఎంలు, వివిధ విభాగాల హెచ్ఓడిలు, డీఎంలు పాల్గొన్నారు. శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఆర్టీసీ కార్మిక సంఘాల నేతలతో జరిగిన సమావేశంలో కార్మిక సంఘాలు లేవనెత్తిన అంశాలపై అధికారులకు మంత్రి పొన్నం ప్రభాకర్ దిశా నిర్దేశం చేశారు. ఆర్టీసీ అధికారులు కిందిస్థాయి సిబ్బంది, ప్రయాణీకులకు సంబంధించి సానుకూలంగా ఉండాలని డివిజన్ స్థాయి అధికారులను ఆదేశించారు. సిబ్బందితో వేధింపులు లేకుండా ప్రేమతో సానుకూల దృక్పథంతో పనులు చేయించాలన్నారు. ఆర్టీసీ అధికారులు డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బంది పట్ల దురుసుగా కాకుండా ఫ్రెండ్లీ గా స్నేహపూర్వకంగా పనులు మెలగాలన్నారు. డిపో మేనేజర్లు, ఆర్టీసీ సిబ్బంది ప్రయాణికులతో సత్సంబంధాలు కలిగి ఉండాలన్నారు. మే 17 లోగా డిపోల్లో, బస్ స్టేషన్లలో కార్మికులకు మౌలిక సదుపాయాలు మెరుగు పరచాలని, టాయిలెట్స్, మంచి నీటి సౌకర్యం, ప్లాంటేషన్, పరిశుభ్రత పాటిం చాలన్నారు. ఖమ్మం, మెదక్, రంగారెడ్డి, నారాయణఖేడ్, బాన్సువాడ, ఇల్లందు డిపోలు నష్టాల్లో ఎందుకు నడుస్తున్నాయో ఆర్ఎంలు, డిపో మేనేజర్‌లు సమీక్షి ంచుకోవాలన్నారు. టిక్కెట్‌కు సంబంధించి ఏదైనా ఇబ్బందులు జరిగితే చర్యలు తీసుకోవాలని, సిబ్బంది గొడవలు పెట్టుకోవడం సరికాదన్నారు. సంస్థలో ఇంటర్నల్ ఎటాక్ అనేది ప్రమాదకరమైన విషయమని హెచ్చరించారు. మంత్రి నుండి సిబ్బంది వరకు అందరం కలిసి పని చేద్దామని, పెండింగ్ షాప్‌లు ఏవైనా ఉంటే జూన్ వరకు క్లియర్ కావాల్సిందే ఎక్కడెక్కడ పెండింగ్‌లో ఉందో చూడాలన్నారు. సమ్మెలో డిమాండ్ చేసిన కార్మికుల సమస్యలను పరిష్కారం చేస్తున్నామని.. ఇంకా భవిష్యత్తులో మంచి ఫలితాలను సాధించే దిశగా ముందుకు వెళ్దామని మంత్రి సూచించారు.

## నాదెండ్ల భాస్కర్‌రావు దశదిన కార్యక్రమంలో పాల్గొన్న ఏపి,తెలంగాణ మంత్రులు









**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మే2:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కర్ రావు దశదిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర మంత్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భాస్కర్ రావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం వారి కుమారుడు ఆంధ్రప్రదేశ్ మంత్రివర్యులు నాదెండ్ల మనోహర్‌ను, కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.భాస్కర్ రావు రాష్ట్ర రాజకీయాల్లో చేసిన సేవలను స్మరించుకుంటూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

తెలంగాణ డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు,ఉత్తమ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఏపీ మంత్రులు పయ్యావుల కేశవ్, అనిత, కొల్లు రవీంద్ర, సత్య కుమార్ యాదవ్, టీజీ భరత్, డోలా బాల వీరాంజనేయ స్వామి, ఎంపీలు పుట్టా మహేష్, కేశినేని శివనాథ్, తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్, సాన సతీష్ బాబు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు కూన రవికుమార్, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, సుజనా చౌదరి, పత్తిపాటి పుల్లారావు, బొమ్మిడి నాయకర్, కొణతాల రామకృష్ణ, మండలి బుద్ధ ప్రసాద్, బొలిశెట్టి శ్రీనివాస్, సుందరపు విజయ్, లోకం నాగ మాధవి, వంశీకృష్ణ శ్రీనివాస్, పత్సమట్ల ధర్మరాజు, పంచకర్ల రమేష్ బాబు, బత్తుల బలరామ కృష్ణ, పంతం నానాజీ, గిడ్డి సత్యనారాయణ, అరవ శ్రీధర్, శాసనమండలిలో ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్, మాజీ ఎంపీ శ్రీ టి సుబ్బరామిరెడ్డి, తెలంగాణ పిసిసి ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్, బిఆర్ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, ఏపీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కళ్యాణం శివ శ్రీనివాస్, ఏపీ ఐడీసీ చైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణ, ఏపీ సివిల్ సప్లైస్ కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్, హస్తకళల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ డా.హరిప్రసాద్, ఒంగోలు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఛైర్మన్ షేక్ రియాజ్, అహుడా చైర్మన్ శ్రీ టి సి వరుణ్,మాజీ ఎంపీ కేవీపీ రామచంద్ర రావు, గుత్తా సుఖేందర్ రెడ్డి, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నేత వి హనుమంతరావు, టీజీ వేంకటేష్, సిపిఐ నేత నారాయణ, ఆంధ్రప్రదేశ్ ఇంటిలిజెన్స్ చీఫ్ మహేష్ చంద్ర లడ్డా, విశ్రాంత ఐఎఎస్ అధికారి నిమ్మగడ్డ రమేష్ కుమార్, విశ్రాంత ఐపీఎస్ అధికారి గోపీనాథ్ రెడ్డి, ఐఎఎస్ అధికారులు కన్నబాబు, సృజన, సినీ పరిశ్రమ నుంచి అల్లు అరవింద్, విశ్వ ప్రసాద్ తదితరులు భాస్కర్‌రావు చిత్ర పటానికి నివాళులు అర్పించారు.

# ఇరాన్‌కు 500 కోట్ల డాలర్ల నష్టం

### నౌకల దిగ్బంధంతో తీవ్రంగా దెబ్బతిన్న ఇరాన్ ఆర్థిక వ్యవస్థ

### 40కిపైగా నౌకల దారి మళ్లింపు

### రెండు నౌకలు ఇంకా అమెరికా ఆధీనంలోనే




**వాషింగ్టన్, మే 2:** గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లో అమెరికా నేతృత్వంలో కొనసాగుతున్న కఠినమైన దిగ్బంధనం కారణంగా ఇరాన్ ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింది. ఈ ఆంక్షల వల్ల ఇరాన్ చమురు అమ్మకాల ద్వారా పొందాల్సిన దాదాపు 5 బిలియన్ డాలర్ల ఆదాయాన్ని కోల్పోయిందని అమెరికా రక్షణ శాఖ (పెంటగాన్) అంచనా వేసింది. ఇస్లామాబాద్‌లో జరిగిన శాంతి చర్చలు విఫలమైన నేపథ్యంలో ఇరాన్‌ను మళ్లీ చర్చల వేదికకు తీసుకురావడానికి ఈ ఆర్థిక దిగ్బంధనాన్ని తమ ప్రధాన అస్త్రంగా అమెరికా ఉపయోగిస్తోంది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదేశాలతో ఏప్రిల్ 13న ఈ దిగ్బంధనం ప్రారంభమైంది. అప్పటి నుంచి చమురు లేదా ఇతర నిషేధిత వస్తువులను రవాణా చేస్తున్నాయనే అనుమానంతో 40కి పైగా నౌకలను దారి మళ్లించినట్లు పెంటగాన్ అధికారులు తెలిపారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా రెండు నౌకలను అమెరికా దళాలు స్వాధీనం చేసుకున్నాయి.

**సముద్రంలో చిక్కుకున్న 53 మిలియన్ బ్యారెళ్ల చమురు:** ప్రస్తుతం గల్ఫ్ జలాల్లో సుమారు 53 మిలియన్ బ్యారెళ్ల ముడి చమురుతో ఉన్న 31 ఇరానియన్ ట్యాంకర్లు చిక్కుకుపోయాయని అధికారులు వెల్లడించారు. దీని విలువ దాదాపు 4.8 బిలియన్ డాలర్లు ఉంటుందని అంచనా. ఇప్పటికే భూమిపై ఉన్న నిల్వ కేంద్రాలు నిండిపోవడంతో ఇరాన్ పాతబడిన ట్యాంకర్లను తేలియాడే నిల్వ కేంద్రాలుగా (ఫ్లోటింగ్ స్టోరేజ్ యూనిట్లుగా) మార్చింది. అమెరికా నిఘాను తప్పించుకోవడానికి కొన్ని నౌకలు చైనాకు చేరడానికి సుదీర్ఘమైన, ఖర్చుతో కూడిన ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణిస్తున్నాయి. ట్యాంకర్‌ట్రాకర్స్.కామ్ సహ వ్యవస్థాపకుడు సమీర్ మదానీ ఈ పరిస్థితిని విశ్లేషించారు. హ్యూజ్ అనే పేరున్న ఒక ట్యాంకర్ పాకిస్థాన్, భారత తీరాలకు దగ్గరగా ప్రయాణించి, అనంతరం మలక్కా జలసంధి వైపు వెళ్లిందని, అక్కడి నుంచి చమురును చైనాకు వెళ్లే ఇతర నౌకలకు తరలిస్తున్నారని ఆయన తెలిపారు. ఒత్తిడి ఇలాగే కొనసాగితే, పాకిస్థాన్ సరిహద్దుకు సమీపంలో భారీగా నిల్వలను ఏర్పాటు చేసుకుని, ఏదో ఒకరోజు రాత్రికి రాత్రే ఒక్కసారిగా తప్పించుకోవడానికి (గ్రేట్ ఎస్కేప్) ఇరాన్ ప్రయత్నించవచ్చని నేను భావిస్తున్నాను" అని ఆయన యాక్సియోస్‌తో అన్నారు. ఈ ప్రతిష్టంభన ఇరు దేశాల మధ్య భారీ ఆర్థిక ఘర్షణగా మారింది.

హార్మూజ్ జలసంధిలో ఇరాన్ రాకపోకలను నియంత్రిస్తుంటే, అమెరికా దిగ్బంధనంతో ప్రతిఘటిస్తోంది. మరికొన్ని వారాల్లో ఇరాన్ వద్ద నిల్వ సామర్థ్యం పూర్తిగా అయిపోయి, చమురు ఉత్పత్తిని నిలిపివేయాల్సిన ప్రమాదం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. "నిల్వ సామర్థ్యం పూర్తిగా అయిపోవడానికి వారికి కొన్ని వారాలు, లేదా బహుశా ఒక నెల సమయం పట్టవచ్చు" అని యూరేషియా గ్రూప్‌కు చెందిన విశ్లేషకుడు గ్రెగరీ బ్రూ పేర్కొన్నారు. "ఉగ్రవాదానికి, ప్రాంతీయ అస్థిరతకు నిధులు సమకూర్చే ఇరాన్ ప్రభుత్వ సామర్థ్యంపై మేము విధ్వంసకరమైన దెబ్బ కొడుతున్నాం. ఈ ప్రాంతంలోని మా సాయుధ దళాలు ఈ నిరంతర ఒత్తిడిని కొనసాగిస్తాయని పెంటగాన్ ప్రెస్ సెక్రటరీ జోయెల్ వాల్డెజ్ స్పష్టం చేశారు.

## పుట్టపర్తిలో యుద్ధవిమానాల కేంద్రం

**అనంతపురం, మే 2, ప్రభాతవార్త బ్యూరో :** దశాబ్దాల కాలం నుంచి కరువు కాటకాలతో వెనుకబడిన శ్రీ సత్య సాయి జిల్లా రక్షణ, ఏరోస్పేస్ హబ్‌గా వేగంగా మారేందుకు అవకాశాలు కనిపిస్తున్నాయి. శ్రీసత్యసాయి జిల్లా బెంగళూరుకు సమీపంగా ఉండటంతో జిల్లాకు ప్రాధాన్యత పెరిగి ఏరోస్పేస్, రక్షణ రంగం పరుగులు పెట్టనుంది అని పరిశీలకులు భావిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలో ఏకంగా రూ.15,000 కోట్ల పెట్టుబడితో ఐదో తరం స్టెల్త్ యుద్ధ విమానాల తయారీ ప్రాజెక్టును ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ డిఆర్‌డిఒ (రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ) ముందుకు వచ్చింది. ఈ నెల 15న సిఎం చంద్రబాబు ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్టు రాకతో శ్రీసత్యసాయి జిల్లా దేశ రక్షణ రంగ పటంలో కీలక స్థానాన్ని సంపాదించనుంది. ఈ ప్రాజెక్టులో భాగంగా అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఎఎంసీఎ) మోడల్ యుద్ధ విమానాలను తయారు చేయనున్నారు. దేశీయంగా, అత్యాధునిక సాంకేతికతతో రూపొందించే ఈ విమానాలను భారత వైమానిక దళం, నౌకాదళం కోసం వినియోగిస్తారు. ప్రస్తుతం వాడుకలో ఉన్న సుఖోయ్ ఎస్‌యూ30యుద్ధ విమానాలకు ప్రత్యామ్నాయంగా వీటిని అభివృద్ధి చేస్తున్నారు. ఈ ప్రాజెక్టు కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 600 ఎకరాల భూమిని డిఆర్‌డిఒకు కేటాయించింది. భవిష్యత్ అవసరాల కోసం మరో 400 ఎకరాలను కూడాఅందుబాటులో ఉంచింది. నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేసి, 2029 నాటికి మొదటి నమూనాను సిద్ధం చేయాలని, 2035 నాటికి పూర్తిస్థాయిలో విమానాల ఉత్పత్తి ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఏరోస్పేస్ హబ్‌గా శ్రీసత్యసాయి జిల్లా ఈ ఒక్క ప్రాజెక్టుతోనే కాకుండా శ్రీసత్యసాయి జిల్లా క్రమంగా ఏరోస్పేస్, డిఫెన్స్ హబ్‌గా రూపాంతరం చెందుతోంది. ఇప్పటికే పాలసముద్రం వద్ద రూ.500 కోట్ల పెట్టుబడితో భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బిఇఎల్) వెయ్యి ఎకరాల్లో డిఫెన్స్ సిస్టమ్స్ ఇంటిగ్రేషన్ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేస్తోంది. అలాగే మడకశిరలో కల్యాణి స్ట్రాటజిక్ సిస్టమ్స్ లిమిటెడ్ రూ.2,500 కోట్ల వ్యయంతో వెయ్యి ఎకరాల్లో డిఫెన్స్ ఎనర్జిటిక్స్ తయారీ కాంప్లెక్స్‌ను నిర్మించనుంది. ఇప్పుడు డిఆర్‌డిఒ ప్రాజెక్టు కూడా తోడవడంతో జిల్లా పారిశ్రామిక స్వరూపం పూర్తిగా మారిపోనుంది. బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయానికి కేవలం 130కిలోమీటర్ల దూరంలో ఈ ప్రాంతం ఉండటం పరిశ్రమల ఏర్పాటుకు కలిసివస్తోంది. బెంగళూరు చుట్టు పక్కల రక్షణ రంగ విస్తరణకు అవకాశాలు తగ్గడంతో కంపెనీలన్నీ శ్రీసత్యసాయి జిల్లా వైపు చూస్తున్నాయి.




# హైదరాబాద్ ఆరేస్తుందా?

## నేడు ఉప్పల్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో మ్యాచ్

**హైదరాబాద్, మే 2(వార్త క్రీడా ప్రతినిధి):** ఉప్పల్ ఇచ్చిన విజయాల బూస్టింగ్‌తో జోరు మీదికొచ్చిన సన్‌రైజర్స్ హైదరాబాద్...జైపూర్, వాంఖడేలోనూ విజయాలు అందుకుంది. వరుస అయిదు విజయాలతో ఊపు మీదున్న ఆరేంజ్ టీమ్... సొంతగడ్డపై మరో మ్యాచ్‌కు సిద్ధమైంది. ఫామ్‌తో సతమతమవుతున్న కోల్‌కతాతో మధ్యాహ్నం మూడున్నర గంటలకు మ్యాచ్ ఆడనుంది. ఈ సీజన్‌ను నెమ్మదిగా ప్రారంభించిన సన్‌రైజర్స్.. తమ తొలి 4 మ్యాచ్‌లలో మూడింటిలో ఓడింది. అయితే బౌలింగ్ విభాగంలో సమూల మార్పులు చేసి గాడిలో పడ్డారు. పాట్ కమిన్స్ సారథ్యంలోని ఈ జట్టు వరుసగా ఐదు మ్యాచ్‌ల విజయ పరంపరలో ఉంది. కోల్‌కతాపై నెగ్గి పతకాల పట్టికలో అగ్రస్థానానికి చేరుకోవడంపై ఫోకస్ పెట్టింది.

సన్‌రైజర్స్ బ్యాటింగ్ భీకరంగా ఉంది.టాప్‌ఆర్డర్ పరుగుల వరద పారిస్తోంది. ముంబై ఇండియన్స్ నిర్దేశించిన 244 రన్స్ టార్గెట్‌ను కూడా ఉఫ్ మనేసింది. అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్ ఫ్లయింగ్ స్టార్ట్ అందిస్తున్నారు. ఇక ఇషాన్ కిషన్ గత మ్యాచ్‌లో గోల్డెన్ డక్‌తో నిరాశపరిచినా ఓవరాల్‌గా చక్కగా ఆడుతున్నాడు. హెన్రిచ్ క్లాసెన్ మ్యాచ్ ఫినిషింగ్‌లతో అదరగొడుతున్నాడు. నితీష్, సలీల్ అరోరా వరకు బ్యాటింగ్ ఆర్డర్ పటిష్టంగా ఉంది. కమిన్స్ నేతృత్వంలోని బౌలింగ్ డిపార్ట్‌మెంట్ కూడా ప్రత్యర్థి జట్లను చక్కగా కట్టడి చేస్తోంది. యంగ్ పేస్ గన్స్ ప్రఫుల్, షాకిబ్, మలింగ వికెట్ల వేటలో ఉన్నారు.

మరో వైపు వరుస పరాజయాలకు ఫుల్‌స్టాప్ పెడుతూ కోల్‌కతా నైట్ రైడర్... గత రెండు మ్యాచ్‌ల్లో పుంజుకుంది. మూడుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన ఈ జట్టు, తమ తొలి ఆరు మ్యాచ్‌లలో ఐదింటిలో ఓడిపోయినప్పటికీ, ఆ తర్వాత వరుసగా రెండు విజయాలు నమోదు చేసింది. లక్నో సూపర్ జెయింట్స్‌ను సూపర్ ఓవర్‌లో ఓడించారు. అయితే బ్యాటింగ్ వైఫల్యం వెంటాడుతోంది. రింకూ సింగ్ తప్పిస్తే మిగతా బ్యాట్స్‌మెన్ అంతా తమ స్థాయికి తగ్గ ఆటతీరు కనబడరచడం లేదు. మతీషా పతిరన తుది జట్టులోకి రానుండటం పెద్ద ఊరటగా నిలవనుంది.

**హెడ్ టు హెడ్ :** సన్‌రైజర్స్‌పై కోల్‌కతాదే ఆధిక్యం. ఇరు జట్లు 31 మ్యాచ్‌ల్లో తలపడగా... సన్‌రైజర్స్ 11 మ్యాచ్‌ల్లో, కోల్‌కతా నైట్ రైడర్స్ 19 మ్యాచ్‌ల్లో గెలుపొందాయి. ఒక మ్యాచ్‌లో ఫలితం రాలేదు. ఈ సీజన్‌లో ఇరుజట్లు తలపడినపుడు సన్‌రైజర్స్ గెలుపొందింది. ఉప్పల్‌లో వరుసగా మూడు మ్యాచ్‌లు నెగ్గిన సన్‌రైజర్స్‌కే హోమ్ అడ్వాంటేజ్ ఉంటుంది.

**పిచ్ రిపోర్ట్:** ఉప్పల్ పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉంటుంది. లైన్ అండ్ లెంగ్త్‌కు కట్టుబడి బౌలింగ్ చేయగలిగితే బౌలర్లకు అడ్వాంటేజ్ ఉంటుంది. ఈసీజన్‌లో నాలుగు మ్యాచ్‌లు జరగ్గా సగటు మొదటి ఇన్నింగ్స్ స్కోరు 202. మూడు మ్యాచ్‌ల్లో మొదట బ్యాటింగ్ చేసిన జట్టు గెలుపొందింది.



**సన్‌రైజర్స్ హైదరాబాద్(అంచనా):**అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్, ఇషాన్ కిషన్, హెన్రిచ్ క్లాసెన్, సలీల్ అరోరా, అనికేత్ వర్మ, నితీష్ కుమార్ రెడ్డి, పాట్ కమిన్స్ (కెప్టెన్), హర్ష్ దూబే, ప్రఫుల్ హింగే, ఎషాన్ మలింగ. **ఇంపాక్ట్ ప్లేయర్:** సాకిబ్ హుస్సేన్

**కోల్‌కతా నైట్ రైడర్స్(అంచనా):** అజింక్య రహానే (కెప్టెన్), సునీల్ నరైన్, రఘువంశీ, కెమెరూన్ గ్రీన్, రోవ్‌మన్ పావెల్, రింకూ సింగ్, అనుకుల్ రాయ్, రమణదీప్ సింగ్, వైభవ్ అరోరా, కార్తీక్ త్యాగి, వరుణ్ చక్రవర్తి; **ఇంపాక్ట్ ప్లేయర్:** పతిరన

### ముంబై ఇండియన్స్ ప్లే ఆఫ్ ఆశలు గల్లంతు

# చెన్నై ఖాతాలో నాలుగో విక్టరీ



మూడు వికెట్లు తీసి ముంబైను కుప్పకూల్చిన కంబోజ్‌ను అభినందిస్తున్న సహచరులు

**చెన్నై:** టాప్ ఫేవరేట్‌గా బరిలోకి దిగిన ముంబై ఇండియన్స్ ఈ ఐపీఎల్ సీజన్‌లో తేలిపోతోంది. తాజాగా మరో ఓటమి ఖాతాలో వేసుకుంది. దీంతో ప్లే ఆఫ్ అవకాశాలు దాదాపు గల్లంతయ్యాయి. మరోవైపు సొంతగడ్డపై చెన్నై సూపర్ కింగ్స్...ముంబై ఇండియన్స్‌పై 8 వికెట్ల తేడాతో గెలుపొందింది. 160 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని మరో 11 బంతులు మిగిలి ఉండగానే రెండు వికెట్లు కోల్పోయి అందుకుంది. సంజూ శాంమ్సన్(11)ను ఆరంభంలోనే బుమ్రా బోల్తాకొట్టించాడు. క్రీజ్‌లోకి వచ్చిన ఉర్విల్ పటేల్(12 బంతుల్లో 24) అండగా ముంబై బౌలర్లపై రుతురాజ్ ధాటిగా ఆడాడు. రెండో వికెట్‌కు 49 రన్స్ జోడించాడు. ఉర్విల్ ఔటైన తర్వాత వచ్చిన కార్తీక్ శర్మ(40 బంతుల్లో 54 నాటౌట్) కలిసి విజయాన్ని అందించాడు. ఈ క్రమంలో అర్ధసెంచరీ సాధించిన రుతురాజ్ గైక్వాడ్ 48 బంతుల్లో అయిదు ఫోర్లు, రెండు సిక్స్‌లతో 67 పరుగులతో కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడాడు.

అంతకుముదు టాస్ నెగ్గి మొదట బ్యాటింగ్‌కు చేసిన ముంబై ఇండియన్స్‌ను కంబోజ్ ఆరంభంలోనే దెబ్బతీశాడు. విల్ జాక్స్(10)ను పెవిలియన్‌కు చేర్చాడు. ర్యాన్ రికల్టన్(37), సూర్యకుమార్(21) అండగా నమన్ ధిర్(37 బంతుల్లో 57) ఆదుకునే ప్రయత్నం చేశారు. అయితే మిడిల్ ఓవర్లలో ముంబై వేగంగా వికెట్లు కోల్పోయింది. 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 159 పరుగులే చేయగలిగింది. చెన్నై బౌలర్లలో కంబోజ్ మూడు, నూర్ అహ్మద్ రెండు వికెట్లు పడగొట్టారు.



## టీ20 ప్రపంచకప్‌కు భారత్ మహిళా జట్టు ఎంపిక

### విమెన్ ఇన్ బ్లూలో శ్రీచరణి, అరుంధతికి చోటు

**ముంబై:** ఇంగ్లాండ్ వేదికగా జరగనున్న ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్‌కు భారత జట్టును బీసీసీఐ ప్రకటించింది. అమితా శర్మ నేతృత్వంలోని సెలెక్షన్ కమిటీ.. శనివారం బీసీసీఐ కార్యదర్శి దేవ్‌జిత్ సైకియా, మహిళల జట్టు ప్రధాన కోచ్ అమోల్ మజుందార్, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌లతో సుదీర్ఘ చర్చ అనంతరం 15 మంది జట్టును ప్రకటించారు. హర్మన్‌ప్రీత్ కౌర్ రికార్డు స్థాయిలో ఐదోసారి కెప్టెన్‌గా జట్టును నడిపించనుంది. తెలుగు క్రికెటర్లు శ్రీచరణి, అరుంధతిలకు జట్టులో చోటు దక్కింది. గాయంతో దూరమైన అమన్‌జ్యోత్ కౌర్ స్థానంలో భారతి ఫుల్మాలిని ఎంపిక చేసినట్లు సెలెక్షన్ కమిటీ ప్రకటిం చింది. బ్యాటర్ హర్లీన్ డియోల్, స్పిన్నర్ స్నేహ్ రాణాలకు జట్టులో చోటు దక్కలేదు.

జూన్ 12 నుంచి ఇంగ్లండ్ వేదికగా టీ20 ప్రపంచకప్ జరగనుంది. గ్రూప్‌ఏలో భారత్‌తో పాటు పాకిస్తాన్, ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, నెదర్లాండ్స్, దక్షిణాఫ్రికా ఉన్నాయి. డిఫెండిగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగనున్న టీమిండియా...తొలి మ్యాచ్‌ను జూన్ 14న పాకిస్తాన్‌తో ఆడనుంది.ఆ తర్వాత 17న నెదర్లాండ్స్, 21న సౌతాఫ్రికా, 25న బంగ్లాదేశ్, 28న ఆస్ట్రేలియాతో ఆడనుంది. ఇక గతేడాది స్వదేశంలో జరిగిన టీ20 ప్రపంచకప్ ఫైనల్లో దక్షిణాఫ్రికాను ఓడించి తొలి సారి కప్ అందుకుంది.

**భారత జట్టు:** హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన, షఫాలీ వర్మ, జెమిమా రోడ్రిగ్స్, భారతీ ఫుల్మాలి, దీప్తి శర్మ, రిచా ఘోష్, శ్రీచరణి, యాస్తికా భాటియా, నందనీ శర్మ, అరుంధతీ రెడ్డి, రేణుకా సింగ్, క్రాంతి గౌడ్, శ్రేయాంక పాటిల్, రాధా యాదవ్.

## మాడ్రిడ్ ఓపెన్ ఫైనల్లో సిన్నర్, జ్వెరెవ్

**మాడ్రిడ్:** టాప్ సీడ్లు జానిక్ సిన్నర్, అలెగ్జాండర్ జ్వెరెవ్... మాడ్రిడ్ ఓపెన్ పురుషుల సింగిల్స్ ఫైనల్ చేరారు. తొలి సెమీస్‌లో ప్రపంచ నంబర్ వన్ జానిక్ సిన్నర్ 6-2, 6-4తో వరుస సెట్లలో అలవోకగా ఆర్థర్ ఫిల్స్‌ను ఓడించాడు. కార్లోస్ అల్కరాజ్‌ను వెనక్కి నెట్టి ఇండియన్ వెల్స్, మయామి, మాంటె కార్లో టైటిల్స్ గెలిచి జైత్రయాత్ర కొనసాగిస్తున్న సిన్నర్‌కు ఫిల్స్ నుంచి ఎలాంటి ప్రతిఘటన ఎదురుకాలేదు. తొలి సెట్‌ను 6-2తో అలవోకగా నెగ్గిన సిన్నర్‌కు.. ఫిల్స్ రెండో సెట్‌లో కాస్త పోటీ ఇచ్చాడు. అయితే సిన్నర్ ఏస్‌లతో విరుచుకుపడుతూ ఫిల్స్ సర్వీస్‌ను బ్రేక్ చేసి సెట్‌ను మ్యాచ్‌ను ముగించాడు. ఇది సిన్నర్‌కు వరుసగా 22వ గెలుపు. వరుసగా రికార్డు స్థాయిలో ఐదో మాస్టర్స్ 1000 టైటిల్ గెలవడంపై దృష్టి పెట్టాడు. ఇక రెండో సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్... 6-2, 7-6తో బ్లాక్స్‌ను ఓడించి ఫైనల్ పోరుకు సిద్ధమయ్యాడు. బ్లాక్స్‌పై మొదటి సెట్‌ను జ్వెరెవ్ సునాయాసంగా గెలుచుకున్నాడు, కానీ రెండో సెట్‌లో బెల్జియన్ ఆటగాడి సర్వ్‌ను బ్రేక్ చేయడానికి చాలా కష్టపడ్డాడు. ఇరువురు పోటాపోటీగా సర్వీసులు నిలబెట్టుకోవడంతో రెండో సెట్ టైబ్రేకర్‌కు సాగింది.

## గాయంతో ఫ్రాన్స్‌తో పోరుకు లక్ష్యసేన్ ఔట్



**డెన్మార్క్:** ఫ్రాన్స్‌తో జరిగే థామస్ కప్ సెమీ ఫైనల్‌కు ముందే భారత్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. స్టార్ ఆటగాడు లక్ష్యసేన్ గాయంతో జట్టుకు దూరమయ్యాడు. చైనీస్ తైపీతో జరిగిన క్వార్టర్ ఫైనల్ పోరులో రెండుమ్యాచ్ పాయింట్లు కాచుకుని మరీ ప్రపంచ నెంబర్ సిక్స్ చౌ టియెన్ చెన్‌పై నెగ్గిన లక్ష్యసేన్... సుదీర్ఘ మ్యాచ్ ఆడాడు. ఆ మ్యాచ్‌లో స్మాష్ కోసం డైవ్ చేస్తున్నపుడు మోచేతికి గాయమైంది. అది తగ్గకపోవడంతో ఫ్రాన్స్‌తో జరిగే సెమీస్ పోరుకు అందుబాటులో ఉండడం లేదని జట్టు కోచ్ వెల్లడించాడు.పాదాలకు బొబ్బలతోకూడా లక్ష్యసేన్ ఇబ్బంది పడుతున్నాడని విమల్ కుమార్ తెలిపారు.లక్ష్యసేన్ అందుబాటులో లేకపోవడంతో.. యువ ఆటగాడు ఆయుష్ శెట్టి ఆరంభ సింగిల్స్‌లో ప్రపంచ నంబర్ 4 క్రిస్టో పోపోవ్‌తో, కిదాంబి శ్రీకాంత్.. రెండో సింగిల్స్‌లో ప్రపంచ నంబర్ 10 అలెక్స్ లానియర్‌తో తలపడతారు.

# బీమా రంగంలోకి 100శాతం ఎఫ్‌డిఐ

## నోటిఫై చేసిన కేంద్రం




**న్యూఢిల్లీ, మే 2:** బీమారంగంలోకి నూరుశాతం ప్రత్యక్ష విదేశీ పెట్టుబడులు అనుమతించే విధానాన్ని ఆర్థికశాఖ శనివారం నోటిఫైచేసింది. ఆటోమేటిక్ రూట్‌లో 100శాతం ఎఫ్‌డిఐలు వచ్చేందుకు ఇపుడు నిబంధనలు సడలించారు. జీవిత బీమా సంస్థలో ఇప్పటివరకూ 20శాతం వరకూ మాత్రమే పరిమితులున్నాయి. ఇపుడు విదేశీ పెట్టుబడులు 100శాతానికి సడలించారు. భారతీయ బీమారంగంలో నూరుశాతం అధీకృత ఈక్విటీ అనుమతిస్తున్నట్లు ఆర్థికశాఖ ప్రకటించింది. అయితే ఇందుకు ఐఆర్‌డిఎ సమగ్ర పరిశీలన, ఆమోదం తర్వాతనే 100శాతం పెట్టుబడులు ఆమోదించడం జరుగుతుందని ఆర్థిక మంత్రిత్వశాఖ ప్రకటించింది.సబ్‌కా బీమా, సబ్‌కీ రక్షా బిల్లును 2025లో ఆమోదించింది. డిసెంబరు 2025లోనే ఈ పరిమితిని నూరుశాతానికి పెంచారు. అప్పటివరకూ 74 శాతంగా ఉన్న ఎఫ్‌డిఐలు ఈ బిల్లుతో 100శాతానికి పెరిగాయి.

2020లో బీమా అనుబంధ రంగాల్లోకి నూరుశాతం, ఎల్‌ఐసిలోకి 20శాతం విదేశీ పెట్టుబడులను మాత్రమే ప్రభుత్వం అనుమతించింది.జీవిత బీమా కార్పొరేషన్ చట్టం పరిధిలోని వివిధ నిబంధనలకు లోబడి ఈ విదేశీ పెట్టుబడులు అనుమతిస్తారని తేలింది. ఇపుడు నూరుశాతం పెట్టుబడులతో బీమా రంగంలోకి విదేశీ ఇన్వెస్టర్లు, పెట్టుబడుల సంస్థలు రావాలన్న ఆసక్తి మరింత పెరుగుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఎల్‌ఐసితో పాటు వివిధ బీమా సంస్థలు ప్రభుత్వరంగంలో పనిచేస్తున్నాయి. వీటికి తోడు ఇప్పటికే ప్రైవేటు రంగంలోకూడా బీమా సంస్థలు విదేశీ సంస్థలను కలుపుకుని వ్యాపార లావాదేవీలునిర్వహిస్తున్న సంగతి తెలిసిందే.

### రిజర్వు బ్యాంకు డిప్యూటి గవర్నర్‌గా

# రోహిత్ జైన్

**ముంబయి, మే 2:** రిజర్వుబ్యాంకు డిప్యూటి గవర్నర్‌గా రోహిత్ జైన్‌ను నియమించేందుకు కేబినెట్ నియామకాల కమిటీ ఆమోదం తెలిపింది. ప్రస్తుతం ఉన్న టి రవిశంకర్ పదవీకాలం శనివారంతో ముగియడంతో కేబినెట్ కమిటీ రోహిత్‌జైన్ నియామకానికి ఆమోదం తెలిపింది. మూడేళ్ల పదవీకాలంతో రోహిత్ జైన్ ఫనిచేస్తారు.ప్రస్తుతం ఆర్‌బిఐలో 2020 నుంచి రోహిత్‌జైన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు.బ్యాంకులో రిస్క్ అనలిటిక్స్,కీలక అధ్యయనం విభాగాలను పర్యవేక్షించారు. ఎంబిఎలో మాస్టర్స్ డిగ్రీ తీసుకున్న రోహిత్ ఇంటర్నేషనల్ సర్టిఫికేట్ బ్యాంకింగ్ ఇన్ రిస్క్ రెగ్యులేషన్‌ను సాధించారు. సిఎఐఐబి, సర్టిఫైడ్ బ్యాక్ ట్రైనర్‌గా కూడా ఆయన గుర్తింపు పొందారు. నలుగురు డిప్యూటి గవర్నర్లలో ఇద్దరు అంతర్గత ర్యాంకుల్లోనే ప్రమోషన్ పొందారు. వారిలో ఎస్‌సి ముర్ము ఆర్‌బిఐ ర్యాంకుల్లో పదోన్నతిపొందారు. మరో ఇద్దరు బయటినుంచి అంటే ఆర్థికవేత్త పూనమ్ గుప్తా వాణిజ్య బానయంకులనుంచి జె స్వామినాథన్‌లను ఎంపిక చేసారు. ఇపుడు రోహిత్‌జైన్ ఆర్థిక మార్కెట్ల క్రమబద్ధీకరణ, విదేశీ కరెన్సీ, పేమెంట్ సెటిల్‌మెంట్ వ్యవస్థలు ఇతరత్రా రవిశంకర్ చూసిన అన్ని విభాగాలు పర్యవేక్షిస్తారు. కేబినెట్ నియామకాల కమిటీ ఇప్పటి వరకూ డిప్యూటి గవర్నర్ పోస్టు కోసం నలుగురు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లను ఇంటర్వ్యూలు చేసింది.






## కోటక్ మహీంద్ర నికరలాభం

# రూ.5423 కోట్లు

**ముంబయి, మే 2:** కోటక్ మహీంద్ర బ్యాంకు నికరలాభాలు పదిశాతంపెరిగి నాలుగోత్రైమాసికంలో రూ.5423 కోట్లకు పెరిగాయి. ఏకీకృత లాభం చూస్తే 13 శాతం పెరిగి 4027 కోట్లుగా ఉంది. అంతకుముందు ఏడాది ఇదే కాలంలో రూ.3552 కోట్లుగా ఉంది.నికరవడ్డీ ఆదాయం 8శాతం పెరిగి రూ.7876 కోట్లకు చేరింది. ఇతర రాబడుల్లో రెండుశాతం తగ్గినా రుణాల్లో వృద్ధి నమోదయింది. ఇతర రాబడులు రూ.3116 కోట్లుగా ఉంది. నికరవడ్డీ మార్జిన్ 13 బేసిస్ పాయింట్లు పెరిగి 4.67శాతంగా ఉంది. ఇక కేటాయింపుల పరంగా కూడా తక్షణ కేటాయింపులు 43శాతం తగ్గాయి. మూడో త్రైమాసికంలో 810 కోట్లు ఉంటే ఈ త్రైమాసికంలో రూ.516 కోట్లుగా ఉంది. అదే గత ఏడాది రూ.909 కోట్లవరకూ ఉన్నాయి.ఇతర రాబడుల్లో స్లిప్పేజెస్‌కింద చూస్తే 1605 కోట్లనుంచి 1018కోట్లకు కట్టడిచేయగలిగింది. గత ఏడాది ఇదేకాలంలో రూ.1488 కోట్లవరకూ స్లిప్పేజిలున్నాయి. స్థూల నిరర్థక ఆస్తులు 10 బేసిస్‌పాయింట్లు తగ్గి 1.20శాతంగా ఉంటే నికర ఎన్పీయే నిష్పతి కూడా ఆరు బేసిస్‌పాయింట్లు మెరుగుపడి 0.25శాతంగా ఉన్నాయి. అడ్వాన్సులు కూడా 16శాతంపెరిగి రూ.5.14 లక్షలకోట్లకు చేరాయి. ఎస్‌ఎంఇ రంగానికి 19శాతం కార్పొరేట్ బుక్ 22శాతం, కన్స్యూమర్ బ్యాంకింగ్ 14శాతం, కమర్షియల్ బ్యాకింగ్ 8శాతం చొప్పున రుణాలిచ్చింది. డిపాజిట్లు కూడా 15శాతంపెరిగి రూ.5.72 లక్షలకోట్లుగా ఉనానయి.కాసా నిష్పతికి 43.3శాతంగా ఉంది. సిడి నిష్పత్తి కూడా 86.6శాతంగా ఉందని వెల్లడించింది.




## వారంలోనే 13,945కోట్లు విత్‌డ్రా

**ముంబయి, మే 2:** విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్లు గతనెల 30వ తేదీతో ముగిసిన వారంలో మార్కెట్ల నుంచి రూ.13,944.59 కోట్లు విత్‌డ్రా చేసుకున్నారు. ప్రత్యేకించి ఈక్విటీ, డెట్, హైబ్రిడ్, మ్యూచువల్‌ఫండ్ ఉత్పత్తుల్లోనే ఈ విత్‌డ్రాలు ఎక్కువ కనిపిస్తున్నాయి. ఎక్కువగా ఈక్విటీలనుంచే విత్‌డ్రా అయ్యాయి. ఎన్‌ఎస్‌డిఎల్ డేటా ప్రకారంచూస్తే ఈక్విటీలనుంచి 8721.65 కోట్లు విత్‌డ్రా అయ్యాయి. ఒక్క రోజే ఈ మొత్తం విత్‌డ్రా అయింది.

మంగళవారం కూడా 4188.34కోట్లు, బుధవారం 1991.87 కోట్లు, గురువారం 1978.63క ఓట్లు విత్‌డ్రా అయ్యాయి. మొత్తంగా వారంలో ఈక్విటీ విత్‌డ్రాలు రూ.16,880.49 కోట్లుగా ఉన్నాయి. ఇక డెట్ మార్కెట్లలోకూడా ఇదే తీరు కనిపించింది. సోమ, మంగళవారాల్లో కొంతమేర కొనుగోళ్లు జరిగాయి. 1338.95 కోట్ల వరకూ ఉంటే గురువారం రూ.1257.01 కోట్లుగా ఉంది. ఇక స్వచ్ఛంద రిటెన్షన్ రూట్‌లో ఇన్‌ఫ్లోలు రూ.1591.32 కోట్లుగా ఉంటే మంగళవారం 911.10 కోట్లు ఉన్నాయి. ఏప్రిల్ నెలలో పోర్టుఫోలియో విదేశీ ఇన్వెస్టర్లు రూ.63,167 కోట్లు విత్‌డ్రాచేసుకున్నారు. ప్రైమరీ మారెనకట్‌లో రూ.2319 కోట్లుమాత్రమే పెట్టుబడులు పెట్టారు. దీనితో ఎఫ్‌పిఐ అమ్మకాలురూ.60,848 కోట్లుగా ఉన్నాయని జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ ముఖ్య వ్యూహకర్త డా.వికె విజయ్‌కుమార్ తెలిపారు. 2026 కేలండర్‌సంవత్సరంలో ఇప్పటివరకూ రూ.1.91,968 కోట్లు విత్‌డ్రా అయినట్లు ఆయన చెప్పారు. పశ్చిమాసియా ఉద్రిక్తతలు, ఫెడ్ రిజర్వు ఫండ్స్‌రేట్, ఆయా దేశాల కేంద్ర బ్యాంకుల మానిటరీ పాలసీ నిర్ణయాలు కూడా స్థానిక మార్కెట్లనుంచి నిధులు విత్‌డ్రాకు ఆస్కారం కల్పించింది. బ్రెంట్ ముడిచమురు కూడా ఏడుశాతం పెరిగి బ్యారెల్‌కు 114 డాలర్లుగా పెరగడంతో కరెన్సీ మార్కెట్‌లో రూపాయి విలువలు కూడా మరింత క్షీణించాయి.

### ఉత్పత్తుల ధరలు పెంచుతున్న

## హిందూస్థాన్ యూనిలీవర్

**ముంబయి, మే 2:** ఎఫ్‌ఎంసీజీ సంస్థ హిందూస్థాన్ యూనీలీవర్, తన వినియోగరంగ ఉత్పత్తుల ధరలను పెంచుతున్నట్లు ప్రకటించింది. పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ ఉద్రిక్తతలు ఇప్పుడు నేరుగా సామాన్యుడి జేబుకు చిల్లు పెట్టబోతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో చోటుచేసుకుంటున్న పరిణామాలు ఈపెంపునకు మూలకారణంగా కనిపిస్తున్నాయి. యుద్ధ మేఘాల వల్ల ముడి చమురు ధరలు భారీగా పెరిగాయి. దీనివల్ల రవాణా ఖర్చులు పెరగడమే కాకుండా, ప్యాకేజింగ్ కోసం వాడే ప్లాస్టిక్,సబ్బులు తదితర అన్ని వస్తువుల తయారీకి అవసరమైన ముడి సరుకుల వ్యయం 8 నుంచి 10 శాతం పెరిగింది. పెరిగిన ఉత్పత్తి వ్యయాన్ని తట్టుకుని, కంపెనీ లాభాలను కాపాడుకోవడానికి ధరల సర్దుబాటు తప్పనిసరి అయిందని సీఈఓ ప్రియా నాయర్, సీఎఫ్ఓ నిరంజన్ గుప్తా స్పష్టం చేశారు.

మనం రోజూ వాడే అనేక బ్రాండ్ల ధరలు ఇప్పటికే 2 నుంచి 5 శాతం పెరిగాయి.మరికొన్ని ఉత్పత్తుల విషయంలో ధర పెంచకుండా, ప్యాకెట్ పరిమాణాన్ని తగ్గించే వ్యూహాన్ని కూడా కంపెనీ అమలు చేస్తోంది. సాధారణంగా హిందుస్థాన్ యూనీలీవర్ వంటి పెద్ద సంస్థ ధరలు పెంచితే, దానిని అనుసరిస్తూ మిగిలిన పోటీ సంస్థలు కూడా రేట్లు పెంచే అవకాశం ఉంటుంది. ఇది మొత్తం ఎఫ్‌ఎంసీజీ రంగంలో ధరల పెరుగుదలకు దోహదంచేయడంతోపాటు ద్రవ్యోల్బణం పెరిగే ప్రమాదం కూడా లేకపోలేదు.




# స్పిరిట్ ఎయిర్‌లైన్స్ మూసివేత!

**ముంబయి,మే 2:**పశ్చిమాసియా యుద్ధమేఘాల కారణంగా స్పిరిట్ ఎయిర్‌లైన్స్ శనివారం తమ సేవలను నిలిపివేస్తున్నట్లుప్రకటించింది. అమెరికా ప్రభుత్వ బెయిల్ ఔట్ ప్రణాళికకుతోడు బ్యాంకర్ల మద్దతును కూడా సాధించలేకపోవడం కూడా మూసివేతకు ఒక కారణంగా కనిపిస్తోంది. దీనికి తోడు జెట్ ఇంధన ధరలు రెట్టింపు అయ్యాయి. రెండునెలలుగా ఇరాన్‌తో జరుగుతున్న యుద్ధం ఇపుడు వేలాది ఉద్యోగాల మెడపై లేఆఫ్ కత్తిని వేలాడదీసింది. స్పిరిట్‌ను రక్షించేందుకు 500 మిలియన్ డాలర్ల బెయిల్ ఔట్ ప్లాన్‌ను ట్రంప్ ప్రతిపాదించినా బ్యాంకర్ల నుంచి మద్దతు సాధించలేకపోయింది. ట్రంప్ ప్రణాళికను రిపబ్లికన్లు కాంగ్రెస్‌తో తీవ్రంగా వ్యతిరేకించినా ట్రంప్ స్పిరిట్‌ను నష్టాలనుంచి బైట పడేయాలని భావించారు. అమెరికా విమానసర్వీసుల్లో ఐదుశాతం విమానాలు స్పిరిట్ నడుపుతోంది.




స్పిరిట్ విమానసంస్థ ఇతర మేజర్ సంస్థలతో పోలిస్తే ధరలు కూడా తక్కువ స్థాయిలోనే కొనసాగించింది. కంపెనీ రక్షణకు ఎలాంటి ప్రత్యామ్నాయ ప్రణాళికలపై చర్చించకుండానే బోర్డు సమావేశం కూడా ముగిసింది. ముందురోజే ట్రంప్ 500మిలియన్ డాలర్ల ఫైనాన్సింగ్ ప్యాకేజిని ప్రకటించి సేవ్ చేసారని వైట్‌హౌస్ ప్రకటించింది. అమెరికా ఎయిర్‌లైన్స్‌కు ఇరాన్ యుద్ధం ఎఫెక్ట్ భారీగా పడిందనడానికి స్పిరిట్ ఎయిర్‌లైన్స్ మూసివేత ప్రత్యక్ష నిదర్శనమని నిపుణులు చెపుతున్నారు. స్పిరిట్ పునర్వ్యవస్థీకరణ ప్రణాళికలో జెడ్ ఇంధన వ్యయాలు గ్యాలన్‌కు 2.24 డాలర్లుపెరిగాయి.2027లో 2.14డాలర్లు ఉంటాయని అంచనా. అయితే ధరలు మాత్రం 4.51 డాలర్లకు పెరిగాయి. ఏప్రిల్ చివరినాటికి గ్యాలన్‌ధరలకు అదనంగా 4.51 డాలర్లు చెల్లించాల్సివస్తోంది. స్పిరిట్ ఎయిర్‌లైన్స్ కొనుగోలు కోసం అనేక ఇతర సంస్థలను కూడా సంప్రదించామని అయితే బయ్యర్లు నిరాసక్తంగా ఉన్నారని రవాణా మంత్రి సీన్ డఫ్ఫీ వెల్లడించారు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., IslamiaJr.College Compound, MGM Road, Warangal-506002. RNI No.64849 Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act.